


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 సంచిక: 64

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



కాన్స్‌లో అనసూయకు ఉత్తమ నటి అవార్డు

భారతీయ నటి అనసూయ సేన్ గుప్తా.. 77వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'అన్‌సర్టెన్ రిగార్డ్' విభాగంలో 'ది షేమ్‌లెస్' చిత్రంలోని నటనకు ఉత్తమ నటి అవార్డు అందుకున్నారు.

- వివరాలు 12లో



నేడు ఐపీఎల్ ఫైనల్

చెన్నైలో జరిగే తుది పోరులో మాజీ చాంపియన్లు సన్‌రైజర్స్ హైదరాబాద్, కోల్‌కతా నైట్ రైడర్స్ తలపడతాయి. హైదరాబాద్ చివరగా 2016లో, కోల్‌కతా 2014లో టైటిల్ గెలిచాయి.

- వివరాలు 12లో



ఆరో దశలో 61.11% పోలింగ్

లోక్‌సభ ఆరో దశ ఎన్నికల్లో 58 స్థానాలకు పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 61.11 శాతం పోలింగ్ నమోదైంది.

- వివరాలు 6లో



ముస్లింల ఓట్ల కోసం 'ముజ్రా'

'ఇండియా' కూటమి ముస్లిం ఓటుబ్యాంక్ కోసం ముజ్రా (వేడుకల్లో అతిథులను అలరించడానికి చేసే నృత్యం) చేస్తోందని మోదీ ధ్వజమెత్తారు.

- వివరాలు 6లో



వాగులోకి నడిపించిన 'గూగుల్'

కేరళలో.. గూగుల్ మ్యాప్ సాయంతో దారి తెలుసుకుంటూ నలుగురు హైదరాబాదీలు ప్రయాణిస్తున్న కారు వాగులోకి దూసుకెళ్లింది.

- వివరాలు 6లో



రేపు 'ఎమ్మెల్సీ' పోలింగ్

వరంగల్-ఖమ్మం-నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు ఈ నెల 27న పోలింగ్ జరగనుంది. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

- వివరాలు 5లో

కొత్తగా దక్షిణ 'రింగ్'!

మొత్తం 189.4 కిలోమీటర్ల మేర గ్రీన్‌ఫీల్డ్ హైవేగా నిర్మాణం



కన్సల్టెన్సీ సంస్థ రూపొందించిన మూడో అలైన్‌మెంట్‌కు మొగ్గు

కేంద్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరగానే ఆమోద ముద్ర

- భారత్ మాల పరియోజన–2 పథకం కింద పనులు
- చేవెళ్ల–కంది రోడ్డు అనుసంధానం ఆలోచన విరమణ
- దానికి దూరంగా నిర్మాణం.. భారీగా పెరిగిన పొడవు
- నిర్మాణానికి రూ.18 వేల కోట్ల వ్యయం అవుతుందని అంచనా.. తుది అలైన్‌మెంట్ ఖరారు తర్వాత అన్ని అంశాలపై స్పష్టత

రీజనల్ రింగ్ రోడ్డు దక్షిణ భాగం ఇలా..

నిడివి	నిర్మాణ వ్యయం
189.4 కిలోమీటర్లు (ఖరారు కావాలి)	18,000 కోట్లు (అంచనా)

2,500 హెక్టార్లు (దాదాపు) రోడ్డు నిర్మాణానికి అవసరమయ్యే భూమి

అలైన్‌మెంట్

సంగారెడ్డి- కంది- నవాబ్‌పేట- చేవెళ్ల- షాబాద్- షాద్‌నగర్- ఆమన్‌గల్- మర్రిగూడ- శివన్నగూడ- సంస్థాన్ నారాయణపూర్- చౌటుప్పల్ (ఈ ప్రాంతాలకు చేరువగా కాస్త అటూ ఇటూ నిర్మాణం సాగుతుంది)

- కేంద్రం చేపట్టిన భారత్‌మాల పరియోజన ప్రాజెక్టు-2 కింద నిర్మాణం
- ఢిల్లీకి చెందిన ఇంటర్ కాంటినెంటల్ కన్సల్టెంట్స్ అండ్ టెక్నోక్రాట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు కన్సల్టెన్సీ బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్: రీజనల్ రింగురోడ్డులో దక్షిణ భాగాన్ని కూడా పూర్తి కొత్తగా నిర్మించేందుకు రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే ఉన్న రోడ్ల అనుసంధానం, విస్తరణ వంటివేమీ లేకుండా.. మొత్తంగా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేగా రూపుదిద్దుకోనుంది. దీనితో ముందు భావించిన దానికన్నా రోడ్డు పొడవు పెరిగి.. 189.4 కిలోమీటర్ల నిడివికి చేరనుంది. సంగారెడ్డి నుంచి ఆమన్‌గల్ మీదుగా చౌటుప్పల్ వరకు నిర్మితం కానుంది. ఇప్పటికే కన్సల్టెన్సీ సంస్థ జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ)కు సమర్పించిన ఈ అలైన్‌మెంటుకు.. జూన్‌లో కేంద్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరగానే ఆమోదముద్ర పడే అవకాశం ఉంది. ఆ వెంటనే భూసేకరణ సర్వే పనులు మొదలవుతాయి. రీజనల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగం 158.65 కిలోమీటర్ల రోడ్డుకు ఇప్పటికే భూసేకరణ కూడా జరుగుతోంది. త్వరలోనే దక్షిణ భాగంపై స్పష్టత రానుంది.

తొలుత కొన్ని పాతరోడ్లతో కలపాలనుకున్నా..

సంగారెడ్డి సమీపంలోని గిర్మాపూర్ నుంచి గజ్వేల్ మీదుగా చౌటుప్పల్ వరకు ఉత్తర భాగానికి కేంద్రం మూడేళ్ల క్రితమే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఉత్తర భాగాన్ని పూర్తి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేగా నిర్మిస్తున్నారు. దక్షిణ భాగాన్ని మాత్రం ఇప్పటికే ఉన్న కొన్ని పాత రోడ్లను అనుసంధానిస్తూ నిర్మించాలని తొలుత భావించారు. ఉత్తర భాగంలోని ప్రాంతాలతో పోలిస్తే.. దక్షిణ భాగంలోని ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు తక్కువగా ఉన్నాయని కేంద్రం గుర్తించింది. అలాంటప్పుడు భారీ వ్యయంతో నాలుగు వరుసల ఎక్స్‌ప్రెస్‌వేగా నిర్మించాల్సిన అవసరం ఉందా? అన్న సందేహం వ్యక్తం చేసింది. ఉత్తర భాగాన్ని నాలుగు వరుసల ఎక్స్‌ప్రెస్‌వేగా నిర్మించి.. దక్షిణ భాగాన్ని ప్రస్తుత రోడ్ల అనుసంధానంతో సాధారణ హైవేగా నిర్మిస్తే సరిపోతుందని భావించింది. కానీ రింగు రోడ్డుగా పూర్తి రూపం రావాలంటే.. దక్షిణ భాగాన్ని కూడా నాలుగు

మిగతా 5వ పేజీలో ▶



సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయిన కూనంనేని సాంబశివరావు, కోదండరాం, పీఎల్.విశ్వేశ్వరరావు, జూలకంటి, వేం నరేందర్‌రెడ్డి, మల్లు రవి, మహేశ్‌కుమార్‌గౌడ్, బొంతు రామ్మోహన్ తదితరులు

కలిసికట్టుగా ముందుకు..

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక వేళ కాంగ్రెస్, లెఫ్ట్, టీజేఎస్ ఐక్యతారాగం

- కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు కోసం సీఎం నివాసంలో గంటకుపైగా భేటీ
- ఉమ్మడిగా పనిచేసి మల్లన్నను గెలిపిద్దామని కోరిన రేవంత్.. మీడియాకు నేతల వెల్లడి

సాక్షి, హైదరాబాద్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక వేళ కాంగ్రెస్, వామపక్షాలు, తెలంగాణ జనసమితి ఐక్యతారాగం ఆలపించాయి. నాలుగు పార్టీల కేడర్‌కు సమష్టి సందేశం ఇస్తూ ఉమ్మడిగా సమావేశమయ్యాయి. ముఖ్యమంత్రి, టీపీసీసీ చీఫ్ ఎనుముల రేవంత్‌రెడ్డి నివాసంలో శనివారం ఆయా పార్టీల నేతలంతా భేటీ అయ్యారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక సందర్భంగా నిర్వహించిన ప్రచారం, పోలింగ్ సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు జరిగిన ఈ సమావేశంలో ప్రొఫెసర్ ఎం. కోదండరాం, ప్రొఫెసర్ పీఎల్. విశ్వేశ్వరరావు (టీజేఎస్), కూనంనేని సాంబశివరావు, పల్లా వెంకట్‌రెడ్డి, బాగం హేమంతరావు (సీపీఐ), ఎస్. వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, జి.నాగయ్య (సీపీఎం), మహేశ్‌కుమార్‌గౌడ్, మల్లు రవి, వేం నరేందర్‌రెడ్డి, బొంతు రామ్మోహన్ (కాంగ్రెస్) పాల్గొన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో తమ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు అవసరమని, ఆయన గెలుపునకు సహకరించేలా మిత్రపక్ష పార్టీలు కేడర్‌ను అప్రమత్తం చేయాలని సీఎం రేవంత్ ఈ భేటీలో సూచించారు. కలసికట్టుగా పనిచేసి తీన్మార్ మల్లన్నను గెలిపిద్దామని కోరారు. అనంతరం

మిగతా 2వ పేజీలో ▶

హైదరాబాద్ ప్రతిష్టను దెబ్బతీయొద్దు..

విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు: సీఎం రేవంత్ హెచ్చరిక 2లో

న్యూస్‌రీల్

పది రోజులు బ్యాగు లేకుండా బడి!



బడి పిల్లలపై బ్యాగు భారం తగ్గించి, వారిలో ఉత్సాహం నింపే ప్రయత్నంలో భాగంగా 2024-25 విద్యా సంవత్సరంలో పది రోజులు బ్యాగు లేకుండా బడి నిర్వహించాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది.

- వివరాలు 14లో ▶

ఈడబ్ల్యూఎస్ కోటాతో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం



వైద్యవిద్య సీట్ల భర్తీలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేస్తే ఎక్కువగా నష్టపోయేది బీసీలు, ఆ తర్వాత ఎస్సీ, ఎస్టీలు అని ఎన్సీబీసీ మాజీ చైర్మన్ జస్టిస్ వి.ఈశ్వరయ్య తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఆమోదయోగ్యం కాదన్నారు.


- వివరాలు 3లో ▶

'కూల్ రూఫ్' కనిపించదేం?

రాష్ట్రంలో కూల్ రూఫ్ పాలసీకి ఆదరణ కరువు 14లో

ఏడో బ్లాక్ మినహా.. మేడిగడ్డ సేఫ్!

బ్యారేజీలోని ఏడో బ్లాక్ కింద మాత్రమే కొట్టుకుపోయిన ఇసుక



మిగతా బ్యారేజీకి ప్రస్తుతం ఎలాంటి ఉపద్రవం లేనట్టే! .. గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ పరీక్షల్లో ఎల్‌అండ్‌టీ నిర్ధారణ

- వివరాలు 5లో



రాజ్‌కోట్‌లో పెను విషాదం

టీఆర్‌పీ గేమ్ జోన్‌లో భారీ అగ్ని ప్రమాదం

నలుగురు చిన్నారులు సహా **27** మంది మృతి

- వివరాలు 6లో



మాకంటే ఎక్కువ ఉద్యోగాలిచ్చుంటే రాజీనామా

కాంగ్రెస్, బీజేపీ నేతలకు కేటీఆర్ సవాల్

- దేశంలోని ఏదైనా రాష్ట్రంలో ఇచ్చినట్లు రుజువు చేయండి
- ఉద్యోగాలు ఇచ్చినా చెప్పుకోలేకపోయాం..
- రాష్ట్రంలో భట్టి, రేవంత్, ఉత్తమ్ (బ్రూ) ట్యాక్స్ నడుస్తోంది
- వరంగల్ నుంచి టెక్ మహీంద్ర వెళ్లిపోయే పరిస్థితి ఉందని ధ్వజం 2లో

క్లుప్తంగా...

మత రాజకీయాలే బీజేపీ ఎజెండా

పంజాబ్ లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం భట్టి



సాక్షి, హైదరాబాద్: హిందువులు, ముస్లింల పేరిట మత రాజకీయాలు చేయడం తప్ప బీజేపీకి మరో ఎజెండా లేదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. దేశంలో బీజేపీ మరోమారు గెలిస్తే రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను రద్దు చేస్తుందని హెచ్చరించారు. పంజాబ్ రాష్ట్రంలోని ఫరీద్‌కోట్ లోక్‌సభ ప్రత్యేక పరిశీలకుడిగా వెళ్లిన భట్టి శనివారం మొగ, ధరంకోట్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...దేశంలోని కొద్దిమంది తన పెట్టుబడిదారు మిత్రులు మాత్రమే ధనికులుగా ఉండాలని, మిగిలిన వారంతా పేదలుగా మిగిలిపోవాలని ప్రధాని మోదీ కోరుకుంటున్నారని ఆరోపించారు. మోదీ మళ్లీ గెలిస్తే దేశంలో మిగిలిన ప్రభుత్వరంగ సంస్థల్ని కూడా అమ్ముకుంటారని, ద్రవ్యోల్బణం, ధరలు పెరుగుతాయని హెచ్చరించారు. దేశంలో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేది ఇండియా కూటమేనని చెప్పారు. ఇండియా కూటమి ఈసారి ఎన్నికల్లో ముందంజలో ఉందన్నారు.

నోటాను కల్పిత అభ్యర్థిగా గుర్తించాలి

రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు ఎఫ్‌జీజీ వినతి

సాక్షి, హైదరాబాద్: నోటాను ఒక కల్పిత అభ్యర్థిగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ గుర్తిస్తూ చర్యలు తీసుకోవాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) కోరింది. ఈ మేరకు శనివారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథిని ఎఫ్‌జీజీ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇటీవల గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఒక అభ్యర్థికి లాభపడేలా బరిలోని మిగిలిన అభ్యర్థులందరూ తమ నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతో ఆ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విషయంలో నోటాను ఒక కల్పిత అభ్యర్థిగా గుర్తించి ఏకగ్రీవ ఎన్నికను ఆపాలని సుప్రీంకోర్టులో కేసు నడుస్తోందని ఆయన గుర్తుచేశారు. 2019లో సర్పంచ్ ఎన్నికల్లో కూడా అనేక ప్రాంతాల్లో ఏకగ్రీవ ఎన్నికలు జరిగాయని.. ఇలా చేయడం వల్ల ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోలేకపోతారని వివరించారు. త్వరలోనే రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. నోటాపై ఈనెల 28న ప్రెస్‌క్లబ్‌లో చర్చావేదిక నిర్వహించనున్నట్టు ఎం.పద్మనాభరెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు.

కొల్లాపూర్‌లో బుల్డోజర్ల సంస్కృతి

బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: ఉత్తరప్రదేశ్ తరహాలో కొల్లాపూర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు బుల్డోజర్ల సంస్కృతి తెచ్చారని, ఫ్యాక్షనిజం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అని బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూలు ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శించారు. అనేక గ్రామాల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తలపై మంత్రి జూపల్లి అనుచరులు దాడులు చేస్తున్నా పోలీసులు చోద్యం చూస్తూ కాంగ్రెస్ ఏజెంట్లలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో ప్రవీణ్‌కుమార్ శనివారం మీడియాతో మాట్లాడుతూ, ప్రతీ కేసులో రాజీపడాలంటూ పోలీసులు బీఆర్‌ఎస్ కార్యకర్తలను వేధిస్తున్నారని, హోం మంత్రిత్వ శాఖ బాధ్యతలు చూస్తున్న సీఎం రేవంత్ దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ కార్యకర్త శ్రీధర్‌రెడ్డి హత్యకు సంబంధించి పోలీసులు ఇప్పటి వరకు ఒక్కరిని కూడా అదుపులోకి తీసుకోలేదన్నారు. తమ కుమారుడి హత్యకు జూపల్లి అనుచరులు కారణమని శ్రీధర్‌రెడ్డి తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినా ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని ప్రవీణ్ కుమార్ అన్నారు. నాగర్‌కర్నూలు జిల్లాలో నెలకొన్న పరిస్థితుల గురించి పది రోజుల క్రితమే డీజీపీని కలిసినా, శ్రీధర్‌రెడ్డి హత్య జరిగిందన్నారు. కొల్లాపూర్‌ను కల్లోలిత ప్రాంతంగా ప్రకటించి పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇదండీ సంగతి



ఆ మూడు రోజుల్లో మా పేరంటే మా పేరు చెప్పండని కూటమి పార్టీల నుండి ఒకటే ఫోన్లు సార్!

హైదరాబాద్ ప్రతిష్టను దెబ్బతీయొద్దు

విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు: సీఎం రేవంత్ హెచ్చరిక

- ఓఆర్ఆర్ లోపల ఉన్న ప్రాంతమంతా ఒకే యూనిట్‌గా విపత్తు నిర్వహణ
- 365 రోజులు పనిచేసేలా జూన్ 4లోగా పూర్తిస్థాయి ప్రణాళిక ఇవ్వాలి
- కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అధికారులతో సీఎం సమీక్ష



శనివారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డీజీపీ రవిగుప్తా, సీఎస్ శాంతికుమారి

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ ప్రతిష్ట దెబ్బతినేలా వ్యవహరిస్తే సహించేది లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను హెచ్చరించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదని హెచ్చరించారు. పనిచేసే వారిని ప్రోత్సహించి, ఉన్నత స్థానం కల్పిస్తామన్నారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. నగరంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మునిసిపల్ అధికారులతో ముఖ్యమంత్రి శనివారం రాత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికార యంత్రాంగానికి పలు సూచనలతోపాటు హెచ్చరికలు జారీ చేశారు. హైదరాబాద్ మహానగరానికి సంబంధించి వివిధ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ విపత్తు నిర్వహణ వ్యవస్థను రూపొందించాలని సూచించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న ప్రాంతాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ఈ వ్యవస్థను తయారు చేయాలన్నారు. కేవలం వర్షాకాలంలోనే కాకుండా 365 రోజులు పనిచేసేలా విపత్తు నిర్వహణ వ్యవస్థ ఉండాలన్నారు. ప్రభుత్వంలోని ఒక్కో విభాగం నుంచి ఒక్కో అధికారి బాధ్యత వహించేలా వ్యవస్థ ఉండాలని, జూన్ 4లోగా దీనికి సంబంధించి పూర్తిస్థాయి ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో నాలాల పూడికతీతలో నిర్లక్ష్యం వహించవద్దని, తీసిన పూడికను సమీప క్వారీ ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓపెన్ సెల్లార్ గుంతల వద్ద ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, వాటికి బారీకేడింగ్ ఉండేలా చూడాలని ఆదేశించారు. గతంలో జరిగిన ఘటనల ఆధారంగా ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. వరద తీవ్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో శాశ్వత పరిష్కారం కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కంటోన్మెంట్ ప్రాంతంలో నాలాల సమస్యలు తలెత్తకుండా యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించాలన్నారు. సమస్యాత్మక నాలాల వద్ద అవసరమైతే ప్రతీ రోజు క్లీనింగ్ చేపట్టాలని, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, పవర్ మేనేజ్‌మెంట్ సరిగా ఉండేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు.

డ్రగ్స్‌రహిత రాష్ట్రంగా..

రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, డ్రగ్స్ కేసులో సెలబ్రిటీలున్నా, ఎంత పెద్దవారున్నా ఉపేక్షించొద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. డ్రగ్స్ అనే మాట వింటేనే భయపడేలా చర్యలుండాలన్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శనివారం రాత్రి జరిగిన సమీక్ష సమావేశంలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనలో పురోగతిపై నార్కోటిక్స్ డ్రగ్స్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపాలని, అవసరమైతే యాంటీ డ్రగ్స్ టీమ్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. డ్రగ్స్ నిర్మూలన కోసం ఎఫెక్టివ్‌గా పనిచేసే వారిని ప్రోత్సహించాలని స్పష్టం చేశారు. సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెట్టి, గంజాయి, డ్రగ్స్ సరఫరా చైన్‌ను బ్రేక్ చేయాలని ఆదేశించారు. అనుమానిత ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్స్ నిర్వహించాలన్నారు. డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపేందుకు ఏం కావాలన్నా ప్రభుత్వం సమకూరుస్తుందని నార్కోటిక్స్ అధికారులకు చెప్పారు.

కలిసికట్టుగా ముందుకు..

▶ మొదటి పేజీ తరువాయి

పలు అంశాలపై దాదాపు గంటపాటు నేతలంతా చర్చించారు.

భారీ మెజారిటీతో మల్లన్న గెలుస్తారు: మహేశ్‌కుమార్‌గౌడ్

ఈ భేటీ అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఉపఎన్నికపై సీఎం రేవంత్ సమీక్షించారని చెప్పారు. సీపీఐ, సీపీఎం, జనసమితి పూర్తిగా మద్దతిస్తున్న నేపథ్యంలో తీన్మార్ మల్లన్న భారీ మెజారిటీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ప్రజాస్వామ్యం బతకాలంటే మల్లన్న గెలవాలి: కూనంనేని

కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయం కోసం సీపీఐ శ్రేణులన్నీ కృషి చేయాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యం బతకాలంటే మల్లన్న గెలుపు అనివార్యమన్నారు. రాజకీయ పొత్తులో భాగంగా తాము మల్లన్నకు, కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని చెప్పారు.

మార్పు కోసం గెలిపించండి: ప్రొ.కోదండరాం

టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికలోనూ టీజేఎస్ మద్దతు కాంగ్రెస్‌కేనని చెప్పారు. ప్రజాస్వామ్య పాలనను బలోపేతం చేసేందుకు, మార్పు కోసం కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని టీజేఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.

మల్లన్నకు ఓటేయండి: సీపీఎం నేత వీరయ్య

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికలో విద్యాధికులు ప్రస్తుత సామాజిక, రాజకీయ పరిస్థితులను అర్థం చేసుకొని ఓటేయాలని సీపీఎం నేత ఎస్. వీరయ్య కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మల్లన్నను గెలిపించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

దశాబ్ది ఉత్సవాలపై చర్చ.... విడివిడిగా భేటీ

సమావేశంలో భాగంగా తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు, కాళేశ్వరం ప్రాజెక్టుపైనా నాలుగు పార్టీల నేతలు చర్చించినట్లు తెలిసింది. దశాబ్ది ఉత్సవాలకు సోనియా గాంధీని ఆహ్వానిస్తున్నామని, తెలంగాణ ఉద్యమకారులతోపాటు అమరవీరుల కుటుంబాలను ప్రభుత్వం తరఫున సన్మానించాలని భావిస్తున్నామని సీఎం రేవంత్ చెప్పినట్లు సమాచారం. ఉత్సవాల నిర్వహణపై రేవంత్‌కు వారు పలు సూచనలు చేశారు. ఆపై కాళేశ్వరం ప్రాజెక్టు అంశం ప్రస్తావనకు రాగా మేడిగడ్డ బ్యారేజీ విషయంలో ఏం చేయాలనే విషయమై అధ్యయనం చేస్తున్నామని, ఎన్నికలు పూర్తయ్యాక అన్ని పార్టీలతో కలిపి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తామని సీఎం చెప్పినట్లు తెలియవచ్చింది. ఈ భేటీ తర్వాత సీఎంతో టీజేఎస్, సీపీఐ, సీపీఎం నేతలు విడివిడిగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని, గుడిసెలు వేసుకున్న పేదలకు ఆయా స్థలాల్లో పట్టాలు ఇవ్వాలని సీపీఎం నేతలు వినతిపత్రం ఇచ్చారు.

కాంగ్రెస్ హామీలు నెరవేరిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా

'తీన్మార్'ది ప్రశ్నించే గొంతు కాదు, బెదిరించే గొంతు: ఈటల



మంచుపల్లి/ఇల్లెందు/మణుగూరు: అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ, రేవంత్‌రెడ్డి ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు 420 రకాల పథకాలను విజయవంతంగా అమలు చేస్తే తాను శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ మంత్రి ఈటల రాజేందర్ ప్రకటించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు, కొత్తగూడెం, మణుగూరుల్లో శనివారం నిర్వహించిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనాల్లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నుంచి పోటీలో ఉన్న తీన్మార్ మల్లన్న చెప్పుకుంటున్నట్లు ఆయనది ప్రశ్నించే గొంతు కాదని, బెదిరించే గొంతని ఈటల ఆరోపించారు. బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యం ఓటు వేసి గెలిపించాలని కోరారు. గతంలో కేసీఆర్ ఆచరణ సాధ్యంకాని హామీలివ్వగా ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం చేతకాని హామీలతోనే ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని గెలిపిస్తే పట్టభద్రుల కోసం పైసా పని చేయలేదని మండిపడ్డారు. సమావేశంలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి, ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ అభ్యర్థులు అజ్మీరా సీతారాంనాయక్, వినోద్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

మాకంటే ఎక్కువ ఉద్యోగాలిచ్చుంటే రాజీనామా చేస్తా

దేశంలోని ఏదైనా రాష్ట్రంలో ఇచ్చినట్లు రుజువు చేయండి

- కాంగ్రెస్, బీజేపీ నేతలకు కేటీఆర్ సవాల్
- సోషల్ మీడియాతో యువత మెదళ్లలో అబద్ధాలు నింపారు
- ఉద్యోగాలిచ్చినా చెప్పుకోలేకపోవడం తమ వైఫల్యమేనని వ్యాఖ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ రంగంలో గత పదేళ్లలో 2.36 లక్షల ఉద్యోగాలు తెలంగాణ మినహా దేశంలోని ఏదైనా రాష్ట్రంలో ఇచ్చినట్లు కాంగ్రెస్, బీజేపీ రుజువు చేస్తే తెల్లారే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ చేశారు. తమ పాలనలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో కలిపి 26.30 లక్షల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు 2004-14 మధ్యకాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదికి వేయి చొప్పున కేవలం 10 వేల పోస్టులు భర్తీ చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కంటే 19 రెట్లు ఉద్యోగాలిచ్చినా ప్రజలకు చెప్పుకోలేకపోవడం తనతో సహా తమ పార్టీ నేతల వైఫల్యం అని చెప్పారు. కేటీఆర్ తెలంగాణ భవన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'సోషల్ మీడియా ద్వారా తెలంగాణ యువత మెదడు నిండా అబద్ధాలను నింపి పెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 30 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు ఊదరగొడుతూ సిగ్గు లేకుండా అబద్ధాలు చెబుతోంది. ఆరు నెలల్లో కొత్త ప్రభుత్వం ఒక్క నోటిఫికేషన్ అయినా ఇచ్చిందా? సీఎం స్థాయిలో రేవంత్ ప్రజలకు చెప్తున్న అబద్ధాలు, చేస్తున్న మోసాలు చూస్తే బాధ అనిపిస్తోంది' అని కేటీఆర్ అన్నారు.

95 శాతం రిజర్వేషన్ల ఘనత కేసీఆర్‌దే..

'రాష్ట్రపతి ఉత్తర్వుల ఉల్లంఘన, నాన్ లోకల్ కేటగిరీ పేరిట నాటి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ యువతకు అన్యాయం చేసింది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత కొత్త జోనల్ విధానంతో అటెండర్ నుంచి గ్రూప్-1 దాకా స్థానికులకు 95 శాతం ఉద్యోగాలు వచ్చేలా చేసిన ఘనత కేసీఆర్‌దే. పదేళ్లలో 2.32 లక్షల ఉద్యోగాలకు అనుమతులు ఇచ్చాం. అందులో 2.02 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చి 1.60 లక్షల పోస్టులు భర్తీ చేశాం. మరో 42,652 ఉద్యోగాలు భర్తీ దశలో ఉన్నాయి. విద్యార్థులు, తల్లిదండ్రులు, నిరుద్యోగులు ఇది అర్థం చేసుకోవాలి. గత ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇచ్చి పరీక్షలు నిర్వహించిన 32,517 ఉద్యోగాలను రేవంత్ దుర్మార్గంగా తన ఖాతాలో వేసుకుంటున్నాడు. గ్రూప్-1, డీఎస్సీ నోటిఫికేషన్లు రద్దు చేసి పోస్టులు పెంచకుండానే కొత్త నోటిఫికేషన్ ఇచ్చారు. సీఎం ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌కు అతీగతి లేదు. నిరుద్యోగ భృతి అంటూ ప్రియాంక గాంధీ నోట కూడా అబద్ధాలు చెప్పించారు' అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

రాష్ట్రంలో 'బ్రూ'ట్యాక్స్ మొదలైంది

'రాష్ట్రంలో కాంగ్రెస్ నేతలు అందిన కాడికి దోచుకుంటున్నారు. భట్టి, రేవంత్, ఉత్తమ్ ఎవరి దుకాణం వాళ్లదే అన్నట్లు మొత్తంగా 'బ్రూ (బీఆర్‌యూ)'ట్యాక్స్ మొదలైంది. బిల్డర్లపైనా కూడా ట్యాక్స్ వేస్తూ దోచుకుంటున్నారు. త్వరలో జూపల్లి కృష్ణారావు కూడా కొత్త దుకాణం స్టార్ట్ చేస్తాడు. ఢిల్లీకి కప్పం కట్టేందుకు సామంత రాజులు ట్యాక్స్‌లు వసూలు చేస్తున్నారు. మంత్రి కోమటిరెడ్డి మూర్ఖుడు, జోకర్‌లా తయారయ్యాడు. ప్రైవేటు సెక్టార్‌లో కష్టపడి తెచ్చిన పరిశ్రమలకు కూడా రేవంత్ పాతర వేస్తున్నారు. 5 లక్షల ఉద్యోగాలు వచ్చే ఫార్మాసిటీని రద్దు చేసి రియల్ ఎస్టేట్ చేస్తారట. రూ.3 వేల కోట్ల పెట్టుబడితో 15 వేల ఉద్యోగాల కల్పనకు ముందుకు వచ్చిన కేన్స్ టెక్నాలజీ వెళ్లిపోయింది. రూ.వేయి కోట్ల పెట్టుబడికి ఆసక్తి చూపిన కేన్స్ గుజరాత్‌కు వెళ్లింది. వరంగల్ నుంచి టెక్ మహీంద్రా అనే సంస్థ వెళ్లిపోయే పరిస్థితి వచ్చింది' అని కేటీఆర్ అన్నారు. వరంగల్- ఖమ్మం- నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కేటీఆర్ కోరారు.

కార్యకర్తల సంక్షేమానికి కట్టుబడే పార్టీ బీఆర్‌ఎస్

సాక్షి, హైదరాబాద్: కార్యకర్తల సంక్షేమం కోసం కట్టుబడి ఉండే పార్టీ బీఆర్‌ఎస్ అని, మీరంతా కేసీఆర్ కుటుంబంలో సభ్యులేనని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రమాదాల్లో మృతి చెందిన 200 మంది బీఆర్‌ఎస్ కార్యకర్తల కుటుంబ సభ్యులకు శనివారం తెలంగాణ భవన్‌లో ఇన్సూరెన్స్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కార్యకర్తలకు ఇన్సూరెన్స్ ఇవ్వాలనే ఆలోచన కేసీఆర్ మదిలో నుంచి పుట్టిందని చెప్పారు. బీఆర్‌ఎస్ సభ్యత్వం తీసుకునే ప్రతి కార్యకర్తకు ప్రమాద బీమా కల్పిస్తున్నామని, ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున బీమా మొత్తాన్ని అందిస్తున్నామని కేటీఆర్ వెల్లడించారు. ఇప్పటి వరకు 5,522 మందికి రూ.118 కోట్లకుపైగా బీఆర్‌ఎస్ కార్యకర్తల బీమా కోసం వెచ్చించామన్నారు. అధికారంలో లేనంత మాత్రాన పార్టీ చేసే కార్యక్రమాలేవీ ఆగవని, భవిష్యత్‌లో కూడా కొనసాగుతాయని తెలిపారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా పార్టీని సంప్రదించాలని కేటీఆర్ సూచించారు.

రాష్ట్రంలో మళ్లీ పెరిగిన వేడి

- సాధారణం కంటే అధికంగా 2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు
- జగిత్యాల జిల్లా అల్లీపూర్‌లో అత్యధికంగా 44.09 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు
- మహబూబ్‌నగర్‌లో అత్యల్పంగా 25.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు



శనివారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీల సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం
అదిలాబాద్	44.0
మెదక్	42.7
నిజామాబాద్	42.4
హైదరాబాద్	39.9
హకీంపేట్	39.8
నల్లగొండ	39.5
దుండిగల్	39.5
రామగుండం	38.8
హనుమకొండ	38.0
మహబూబ్‌నగర్	37.5
ఖమ్మం	36.0
భద్రాచలం	31.6

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని శనివారం గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 డిగ్రీల సెల్సియస్ మేర అధికంగా నమోదయ్యాయి. శనివారం నిర్మల్ జిల్లా కుబీర్‌లో అత్యధికంగా 45.6 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. జగిత్యాల జిల్లా అల్లీపూర్‌లో 44.9 డిగ్రీల సెల్సియస్, కామారెడ్డి జిల్లా డోంగ్లి 44.8 డిగ్రీల సెల్సియస్, ఆదిలాబాద్ జిల్లా బేలాలో 44.7 డిగ్రీల సెల్సియస్, నిజామాబాద్ జిల్లా వయల్పూర్ 44.6 డిగ్రీల సెల్సియస్ చొప్పున గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వాతావరణ శాఖ వెల్లడించింది. రానున్న మూడు రోజులు రాష్ట్రవ్యాప్తంగా గరిష్ట ఉష్ణోగ్రతలు పెరుగుతాయని, సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ చొప్పున అధికంగా నమోదయ్యే అవకాశముందని వివరించింది. శనివారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే....గరిష్ట ఉష్ణోగ్రత ఆదిలాబాద్‌లో 44.0 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత నల్లగొండ, మహబూబ్‌నగర్‌లో 25.2 డిగ్రీల సెల్సియస్ చొప్పున నమోదైంది.

తీవ్ర వాయుగుండంగా మారిన వాయుగుండం

మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన వాయుగుండం శనివారం తూర్పు, మధ్య బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండంగా మారింది. ఈ వాయుగుండం ప్రభావం రాష్ట్రంపై లేదని వాతావరణశాఖ స్పష్టం చేసింది. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతున్నట్లు తెలిపింది. రాష్ట్రానికి పశ్చిమ, వాయవ్య దిశల నుంచి బలమైన గాలులు వీస్తున్నట్లు తెలిపింది.

ఎమ్మెల్సీ ఎన్నికలో విజయంపై బీజేపీ ధీమా

- ఈ ఎన్నికలోనూ మోదీ మ్యాజిక్ పనిచేస్తుందని పార్టీ నేతల ఆశాభావం
- ముమ్మరంగా ప్రచారం చేసిన ముఖ్య నాయకులు



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో విజయం సాధించి సత్తా చాటాలని బీజేపీ భావిస్తోంది. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి డబుల్ డిజిట్ సంఖ్యలో సీట్లు సాధిస్తామనే ధీమాతో ఉన్న రాష్ట్ర నాయకత్వం.. ఎమ్మెల్సీ ఎన్నికలోనూ గెలిచి రాష్ట్రంలో బలమైన రాజకీయశక్తిగా మారాలని ఉవ్విళ్లూరుతోంది. పార్లమెంట్ ఎన్నికలు జరిగిన రెండువారాల్లోనే ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ ఉండడం వల్ల.. ఈ ఎన్నికలోనూ ప్రధాని మోదీ మ్యాజిక్ పనిచేస్తుందనే ఆశాభావం పార్టీ నాయకత్వంలో వ్యక్తమవుతోంది. గతేడాది జరిగిన టీచర్స్ ఎమ్మెల్సీల నియోజకవర్గం నుంచి తొలిసారిగా పార్టీ బీఫామ్‌పై పోటీచేసి ఏవీఎన్‌రెడ్డి గెలుపొందిన విషయాన్ని పార్టీ నాయకులు గుర్తుచేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో తాజా ఎన్నికలకు సంబంధించి మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో పార్టీనేతలు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ నెల 27న జరగనున్న ఎన్నికల్లో ఈ మూడుజిల్లాల పరిధిలోని పట్టభద్ర ఓటర్లలో అధికులు తమ పార్టీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి అనుకూలంగా ప్రథమ ప్రాధాన్య ఓటేసి గెలిపిస్తారని బీజేపీ ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ ఎన్నికలకు సంబంధించి ప్రచార పర్వం శనివారంతో ముగిసింది. రాష్ట్ర పార్టీ ముఖ్య నేతలు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ముమ్మరంగా ప్రచారాన్ని నిర్వహించారు. పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ ఉమ్మడి వరంగల్, నల్లగొండ జిల్లాల్లో పట్టభద్రుల ఆత్మీయ సమావేశాల్లో పాల్గొన్నారు. జాతీయ ప్రధానకార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ శుక్ర, శనివారాల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో పలుచోట్ల ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ జాతీయకార్యవర్గసభ్యుడు, మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ విస్తృతంగా మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో పలుచోట్ల ఆత్మీయసమ్మేళనాలు, ఓటర్లతో టిఫిన్ బైటక్‌లు, రిటైర్డ్ ఎంప్లాయీస్ మీట్‌లలో పాల్గొన్నారు. ప్రచారం చివరిరోజున శనివారం ఈటల రాజేందర్ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఇల్లెందు, కొత్తగూడెం, మణుగూరులలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్ కూడా ప్రచారంలో పాల్గొన్నారు.

బిట్స్ పిలానీలో చదివిన వారినే ఓట్లడగండి

- కేటీఆర్ వ్యాఖ్యలు పట్టభద్రులకు అవమానకరం: మాజీ ఎంపీ మల్లురవి
- కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలని సీఈవోకు ఫిర్యాదు



సీఈవో వికాస్‌రాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎంపీ మల్లు రవి తదితరులు

సాక్షి, హైదరాబాద్: 'ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి బిట్స్ పిలానీ అయితే, కాంగ్రెస్ అభ్యర్థి పల్లి బఠాణీ'అన్న మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలపై టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లురవి ఫైర్ అయ్యారు. కేటీఆర్ వ్యాఖ్యలు ఉస్మానియా, కాకతీయ లాంటి ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో చదువుకున్న పట్టభద్రులను అవమానపరిచే విధంగా ఉన్నాయని, ఆయనపై కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. శనివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ నేత ఒబేదుల్లా కొత్వాల్, ఇతర మైనార్టీ నేతలతో కలిసి ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అభ్యర్థి బిట్స్ పిలానీలో చదివితే, కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాల్లో చదువుకున్నారని అన్నారు. ఉస్మానియా, కాకతీయల్లో చదువుకున్న పట్టభద్రులు తమకు ఓట్లు వేస్తారని, బిట్స్ పిలానీలో చదువుకున్న పట్టభద్రులను మాత్రమే బీఆర్‌ఎస్ నేతలు ఓట్లడగాలని ఎద్దేవా చేశారు. కేటీఆర్ మాట్లాడుతున్న తీరు ఎమ్మెల్సీ ఎన్నికలనే అవమానపర్చే విధంగా ఉందని వెంటనే ఆయన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల్లోని పట్టభద్రులంతా తీన్మార్ మల్లన్నకు ఓట్లు వేసి గెలిపించాలని, మల్లన్న గెలిస్తే పట్టభద్రులు, నిరుద్యోగులు, మహిళల గురించి తన గళాన్ని వినిపిస్తారని చెప్పారు.

ఈసీకి ఫిర్యాదు

కాగా, కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ మల్లురవి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. శనివారం సాయంత్రం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్‌కౌశిక్ యాదవ్, కార్యదర్శి మామిడి గోపిలతో వెళ్లి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్‌మల్లన్నను కించపరిచే విధంగా మాట్లాడిన కేటీఆర్‌పై తీవ్ర చర్యలు తీసుకోవాలని మల్లురవి కోరారు.

నిరుద్యోగులను తప్పుదోవ పట్టిస్తున్నారు

కేటీఆర్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: మాజీమంత్రి కేటీఆర్ నిరుద్యోగులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆరోపించారు. రాష్ట్రంలోని నిరుద్యోగుల గురించి మాట్లాడే అర్హత కేటీఆర్‌కు లేదని వ్యాఖ్యానించారు. శనివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, ఇతర నేతలతో కలిసి ఆయన మాట్లాడుతూ పదేళ్లు అధికారంలో ఉండగా నిరుద్యోగుల గురించి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. అసలు పదేళ్లలో ఎప్పుడైనా విద్యార్థులను ప్రభుత్వ పెద్దలు కలిశారా అని ప్రశ్నించారు. పోలీసు ఉద్యోగాలకు సంబంధించి జీవో46 తీసుకువచ్చినప్పుడే తాము దాన్ని వ్యతిరేకించామని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే దీనిపై కేబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు చేశామని, ఎన్నికల కోడ్ ముగియగానే జీవో 46తో పాటు 317 విషయంలో చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల కోడ్ కారణంగా జాబ్ కేలండర్ విడుదల చేయలేకపోయామని, కోడ్ ముగిసిన వెంటనే జాబ్ కేలండర్ విడుదల చేస్తామని తెలిపారు. స్టాఫ్ నర్సులకు సాంకేతిక కారణాల కారణంగానే వేతనాలు రాలేదని, అసలు ఈ సమస్య రావడానికి కూడా బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాలే కారణమని చెప్పారు. గత పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగుల కోసం ఏం చేసిందో, మూడు నెలల కాలంలో తామేం చేశామో చర్చకు తాను సిద్ధమని, ఏ యూనివర్సిటీలోనైనా తనతో చర్చకు రావాలని ఆయన బీఆర్‌ఎస్ నేతలకు సవాల్ విసిరారు.

రాష్ట్ర గీతానికి పక్క రాష్ట్రం వారు సంగీతం అందించడమా?

సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించిన రాష్ట్ర సినీ మ్యుజీషియన్స్ అసోసియేషన్

సాక్షి, హైదరాబాద్: అందెశ్రీ రచించిన 'జయ జయహే తెలంగాణ'పాటకు పక్క రాష్ట్రానికి చెందిన సంగీత దర్శకుడు కీరవాణిని సంగీతాన్ని అందించమని సీఎం రేవంత్‌రెడ్డి కోరడం చారిత్రక తప్పిదమవుతుందని తెలంగాణ సినీ మ్యుజీషియన్స్ అసోసియేషన్ పేర్కొంది. ఈ మేరకు శనివారం సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ సినీ మ్యుజీషియన్స్ అసోసియేషన్ లేఖ రాసింది. 'సకల జనుల సహకారంతో ఎంతో మంది అమరవీరుల త్యాగ ఫలంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర గీతానికి పక్క రాష్ట్రం మ్యూజిక్ డైరెక్టర్‌ను సంగీతం అందించమనడం ఏంటని ప్రశ్నించింది. తెలంగాణ అస్తిత్వం మీకు తెలియంది కాదు. తెలంగాణ ఉద్యమం ఎందుకు వచ్చిందో మీకు తెలియంది కాదు. మన ఉద్యోగాలు మనకే రావాలి, మన అవకాశాలు మనకే కావాలి అనే నినాదంతో ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసింది. ఇవన్నీ తెలిసి కూడా పక్క రాష్ట్రం వాళ్లకు తెలంగాణ పాటకు సంగీతాన్ని అందించాలని కోరడం ఏంటి? అలా చేయడం అంటే మన తెలంగాణ కళాకారులను అవమానించడమే. ఎందరో ప్రతిభావంతులు తెలంగాణలో ఉన్నారు. ఈ గొప్ప అవకాశాన్ని ఇచ్చి తెలంగాణ కళాకారులకు గౌరవం ఇస్తారని ఆశిస్తున్నాం' అని సీఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు.

మెడికల్ సీట్లలో ఈడబ్ల్యూఎస్ కోటాతో | ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం

- ఇదివరకు అదనంగా 10 శాతం సీట్లు సూపర్ న్యూమరరీ కోటాలో కేటాయించారు
- ఇప్పుడు సూపర్ న్యూమరరీ లేకుండా అందుబాటులో ఉన్న సీట్లలో కోత పెడుతున్నారు
- రాహుల్ గాంధీ జాతి గణన చేయాలని డిమాండ్ చేస్తున్నాడు
- ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వం ఆ విషయాన్ని పట్టించుకోకుండా రిజర్వేషన్లు తగ్గిస్తోంది
- దీనిపై ప్రభుత్వం వెనక్కి తగ్గకుంటే బీసీ, ఎస్సీ, ఎస్టీలతో యుద్ధం చేస్తాం
- 'సాక్షి'తో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన న్యాయమూర్తి, ఎన్సీబీసీ మాజీ చైర్మన్ జస్టిస్ వి. ఈశ్వరయ్య

సాక్షి, హైదరాబాద్: 'వైద్య విద్య సీట్ల భర్తీలో ఆర్థికంగా బలహీనమైన వర్గాల (ఈడబ్ల్యూఎస్) రిజర్వేషన్లు అమలు చేస్తే ఎక్కువగా నష్టపోయేది బీసీలు, ఆ తర్వాత ఎస్సీ, ఎస్టీలు. వాస్తవానికి ఈడబ్ల్యూఎస్ కోటా అనే అంశానికి ఎలాంటి శాస్త్రీయత లేదు. కేవలం రాజ్యాంగ సవరణ ద్వారా కేంద్రం చేసిన ఈ ప్రక్రియకు సుప్రీంకోర్టులో ముగ్గురు జడ్జీల ఆమోదం దక్కడంతో నిలబడింది. ఈడబ్ల్యూఎస్‌కు 10 శాతం కోటా కచ్చితంగా అమలు చేయాలని కేంద్రం చెప్పలేదు. ఆ కోటాపై ఆసక్తి ఉన్న రాష్ట్రాలు 10 శాతం కోటాను అమలు చేస్తున్నాయి. తమిళనాడుతోపాటు చాలా రాష్ట్రాలు ఈడబ్ల్యూఎస్ కోటా అమలు చేయడం లేదు'అని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన న్యాయమూర్తి, ఎన్సీబీసీ మాజీ చైర్మన్ జస్టిస్ వి.ఈశ్వరయ్య వివరించారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో చెబుతున్న విధానం.. ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాన్ని పోలుస్తూ జస్టిస్ వి.ఈశ్వరయ్య పలు అంశాలను 'సాక్షి'తో పంచుకున్నారు. అవి ఆయన మాటల్లోనే...



ఈడబ్ల్యూఎస్‌తో ఓపెన్ కేటగిరీలో సీట్లు తగ్గుతాయి

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం యూజీ, పీజీ మెడికల్ సీట్ల భర్తీలో ఈడబ్ల్యూఎస్‌కు 10 శాతం కోటా అమలు చేయాలని ప్రాథమికంగా తీసుకున్న నిర్ణయం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. వైద్య విద్యలో నేరుగా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేస్తే ఓపెన్ కేటగిరీలో సీట్లు తగ్గుతాయి. ఈ ప్రభావం ఎక్కువగా బీసీలు, ఎస్సీలు, ఎస్టీలపై పడుతుంది. జనాభా ప్రాతిపదికన ఎక్కువ సంఖ్యలో ఉన్న బీసీలకు సరైన వాటా దక్కడం లేదనే వాదన ఉండగా... ఇప్పుడు పరోక్షంగా మరింత అన్యాయం జరుగుతుంది.

సూపర్ న్యూమరరీ కోటా ఉంటేనే ఈడబ్ల్యూఎస్

ఈడబ్ల్యూఎస్‌కు 10 శాతం రిజర్వేషన్ అమలు చేసేట్లయితే.. చట్టం ప్రకారం 10 శాతం సూపర్ న్యూమరరీ కోటాను ఇవ్వాలనే స్పష్టమైన విధానం ఉంది. ఇప్పటివరకు నీట్ పరీక్ష అనంతరం యూజీ, పీజీ మెడికల్ సీట్ల భర్తీలో 10 శాతం సూపర్ న్యూమరీ సీట్లు కేటాయిస్తూ వచ్చారు. ఆ మేరకు 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేశారు. ఇప్పుడు సూపర్ న్యూమరరీ కోటా లేదంటూ కాలేజీ వారీగా మంజూరు చేసిన సీట్లలోనే 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించినట్లు వార్తలు వస్తున్నాయి. నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) ఆదేశాలకు అనుగుణంగా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారనే ప్రచారం జరుగుతోంది. సూపర్ న్యూమరరీ కోటా ఇవ్వమని చెప్పడానికి ఎన్ఎంసీకి అధికారం లేదు. అలాంటప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఎలా నిర్ణయం తీసుకుంటుంది. సూపర్ న్యూమరరీ కోటా లేకుండా ఈడబ్ల్యూఎస్ కోటా అమలు చేస్తే బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు దాదాపు 350 సీట్లు నష్టపోతారు.

రాహుల్ చెప్పిందేంటి.. రేవంత్ చేస్తున్నదేంటి?

దేశవ్యాప్తంగా జాతి గణన (కులగణన) చేయాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పారు. పార్లమెంటు ఎన్నికల మేనిఫెస్టోలో కూడా కాంగ్రెస్ జాతిగణనను పొందుపర్చింది. జనాభా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాల్సిన అవసరాన్ని కూడా రాహుల్ చెబుతోంటే.. అందుకు విరుద్ధంగా సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకుంటున్నట్లు కనిపిస్తోంది. సూపర్ న్యూమరరీ సీట్లు లేకుండా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతాం. ఇప్పటికే బీసీ సంఘాలతో ఈ అంశంపై చర్చలు చేశాం. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు బీసీల ప్రతినిధిగా ఎంతో కష్టపడ్డాను. బీసీలకు అన్యాయం జరిగేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే సహించం. అన్ని వర్గాలను కూడగట్టుకుని ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం.

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో నీట్-పీజీ మాక్ టెస్ట్!


సాక్షి, హైదరాబాద్: జనరల్ మెడిసిన్, రేడియాలజీ, పీడియాట్రిక్స్, డెర్మటాలజీ, జనరల్ సర్జరీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్స్, ఆప్తాల్మాలజీ, సైకియాట్రీ, అనస్థీషియాలజీ మొదలైన స్పెషలైజేషన్లలో వారి భవిష్యత్ కెరీర్‌లకు పునాది వేయడానికి ఔత్సాహిక వైద్యులకు నీట్-పీజీ చాలా కీలకమైన పరీక్ష.

పీజీ మెడికల్ స్టడీస్ ప్రాముఖ్యతను గుర్తిస్తూ, సాక్షి మీడియా గ్రూప్ జూన్ 16, 2024న.. విద్యార్థులకు చేయూతనిచ్చేలా నిపుణుల ఆధ్వర్యంలో నీట్-పీజీ మాక్ పరీక్షను నిర్వహిస్తోంది. పరీక్షకు కొద్ది రోజుల ముందు వాస్తవ పరీక్షలాంటి వాతావరణంలో జరిగే సాక్షి మాక్ టెస్టులు రాయడం ద్వారా విద్యార్థులు తమ ప్రిపరేషన్ స్థాయిని అంచనా వేసుకుని, మరింత మెరుగుపరుచుకోవచ్చు. ఈ మాక్ టెస్ట్ క్లినికల్ నాలెడ్జ్, ఎగ్జామ్-టేకింగ్ స్ట్రాటజీలను పదును పెట్టడంలో సహాయపడటమే కాకుండా, నిజమైన నీట్-పీజీలో రాణించడానికి అభ్యర్థుల సన్నద్ధతను నిర్ధారిస్తుంది. ఈ మాక్ పరీక్షకు 'మై ర్యాంక్'టెక్నాలజీ పార్టనర్‌గా వ్యవహరిస్తోంది. ఆసక్తి గల అభ్యర్థులు రూ. 500 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి https:// www. arenaone.in/mock/neetpg ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. లాగిన్ హాల్ టికెట్ నెంబర్, పాస్వర్డ్ పరీక్షకు రెండు రోజుల ముందు అభ్యర్థి రిజిస్టర్ చేసుకున్న ఈ-మెయిల్ ఐడీ/ఫోన్ నెంబర్‌కు మెసేజ్ వస్తుంది. మాక్ పరీక్ష ఆన్‌లైన్‌లో https://sakshimocktest.myrank.co.inలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎప్పుడైనా లాగిన్ అయి రాసుకోవచ్చు. పరీక్ష సమయం మూడు గంటల 30 నిమిషాలు. అలాగే పరీక్ష ముగిసిన వెంటనే మీ స్కోర్‌ను కూడా చూసుకోవచ్చు. పూర్తి వివరాలకు సంప్రదించాల్సిన నెంబర్లు: 99126 71555, 96660 13544, 96665 72244.

కన్వీనర్ కోటా 100 శాతం తెలంగాణ విద్యార్థులకే దక్కాలి

మెడికల్ కాలేజీల్లో సీట్లపై మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్

- 20 పాత మెడికల్ కాలేజీల్లో ఇప్పటివరకు ఏపీ విద్యార్థులకు సైతం పోటీపడే అవకాశం
- జూన్ 2తో విభజన చట్టానికి కాలం చెల్లుతుండటంతో సర్కార్ స్పందించాలి
- వైద్య విద్య ప్రవేశాల్లో స్థానికతపై స్పష్టత ఇవ్వాలి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై పదేళ్లు పూర్తికాబోతున్న నేపథ్యంలో మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటా సీట్లు 100 శాతం తెలంగాణ విద్యార్థులకే దక్కేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే వైద్య విద్య ప్రవేశాలకు సంబంధించి స్థానికత అంశంపై స్పష్టత ఇవ్వాలన్నారు. ఈ మేరకు వైద్య విద్యకు సంబంధించి పలు అంశాలను 'ఎక్స్'వేదికగా ప్రస్తావించారు. జూన్ మూడో వారంలో మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్ల ప్రక్రియ మొదలవుతున్న క్రమంలో ప్రభుత్వం తక్షణం స్పందించి తగిన ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. లేదంటే వైద్య విద్య చదివే అవకాశాలను తెలంగాణ విద్యార్థులు కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పాటుకు ముందున్న 20 మెడికల్ కాలేజీల్లోని 2,850 సీట్లలో కాంపిటెంట్ అథారిటీ కోటా కింద 1,900 సీట్లు ఉన్నాయి. ఇందులో 15 శాతం అన్‌రిజర్వుడు కోటా అంటే 280 సీట్లు తెలంగాణ విద్యార్థులు నష్టపోతారని తెలిపారు. దీంతోపాటు నిమ్స్ సహా ఇతర మెడికల్ కాలేజీల్లోని దాదాపు 150 పీజీ సీట్లు కోల్పోతారన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంతో అదనంగా సీట్లు

రాష్ట్ర పునర్విభజన చట్టం కింద 2014 నుంచి కన్వీనర్ కోటాలో 15 శాతం సీట్లకు తెలంగాణతోపాటు, ఏపీ విద్యార్థులు సైతం పోటీపడే వెసులుబాటు లభించిందని హరీశ్‌రావు చెప్పారు. ఇదే విధానం కొనసాగితే, 2014 తర్వాత ఏర్పాటైన కొత్త మెడికల్ కాలేజీల్లోనూ 15 శాతం అన్ రిజర్వుడు కోటా అమలు చేయాల్సి ఉంటుందన్నారు. దీనివల్ల దాదాపు 520 సీట్లు తెలంగాణ విద్యార్థులు కోల్పోవాల్సి వస్తుందని, దీన్ని నివారించేందుకు అప్పటి తెలంగాణ ప్రభుత్వం అన్ రిజర్వుడు కోటాను కేవలం పాత 20 మెడికల్ కాలేజీలకే పరిమితం చేసిందని తెలిపారు. ఇందుకోసం ఏపీ రీఆర్గనైజేషన్ యాక్ట్, ఆర్టికల్ 371డీ నిబంధనలకు లోబడి తెలంగాణ స్టేట్ మెడికల్/డెంటల్ కాలేజెస్ అడ్మిషన్ రూల్స్‌ను సవరిస్తూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దీని ప్రకారం 2014 జూన్ 2 తర్వాత ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీల్లోని కాంపిటేటివ్ అథారిటీ కోటాలోని 100 శాతం సీట్లను తెలంగాణ విద్యార్థులకే రిజర్వ్ చేయడం వల్ల తెలంగాణ విద్యార్థులకు 520 మెడికల్ సీట్లు అదనంగా లభించాయని పేర్కొన్నారు. వచ్చే జూన్ 2తో విభజన చట్టానికి కాలం చెల్లుతుండటంతో పాత మెడికల్ కాలేజీల్లోని 100 శాతం కన్వీనర్ కోటా సీట్లను కూడా తెలంగాణ విద్యార్థులకు దక్కేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు ప్రభుత్వ, ప్రైవేటులో కలిపి రాష్ట్రంలో 20 మెడికల్ కాలేజీలుంటే, ఇప్పుడు ఆ సంఖ్య 56కు చేరడానికి బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని చెప్పారు. దీంతో తెలంగాణలో 2,850 ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య ఇప్పుడు 8,340కి పెరిగిందన్నారు.





ఆరోగ్యశ్రీ రోగులకు కుళ్లిన గుడ్లు, పురుగుల అన్నం

- నిజామాబాద్ జిల్లా జనరల్ ఆస్పత్రిలో దుస్థితి
- సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు, వీడియో వైరల్

నిజామాబాద్ (నాగారం): కుళ్లిన గుడ్లు, పురుగుల అన్నమే ఆరోగ్యశ్రీ రోగులకు దిక్కయింది. నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లో శనివారం వడ్డించిన భోజనం ఫొటోలు, వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ప్రభుత్వం ఆరోగ్యశ్రీ రోగుల డైట్‌కు సంబంధించి రూ.లక్షల్లో బిల్లులు అందిస్తుంది. అయితే పర్యవేక్షణ చేయాల్సిన జీజీహెచ్ అధికారులు చోద్యం చూడటంతో కాంట్రాక్టర్ రోగులకు అధ్వానమైన ఆహారం అందిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. గత కొన్ని రోజులుగా కుళ్లిన గుడ్లు అందిస్తున్నారని ఆరోగ్యశ్రీ రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి ఆహారాన్ని ఎవరైనా తినగలరా అంటూ ప్రశ్నిస్తున్నారు. నాసిరకం భోజనంపై ప్రశ్నిస్తే భోజనం నిర్వాహకులు ఇష్టం ఉంటే తినండి లేదంటే లేదంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆధారాల్లేకుండా ధిక్కార కేసు వేయడం చట్టవిరుద్ధం

సాక్షి, హైదరాబాద్: ఎలాంటి ఆధారాలు, మెటీరియల్ లేకుండా కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేయడం చట్టవిరుద్ధమని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఈ మేరకు ఓ సివిల్ కేసులో పిటిషన్ వేసిన వ్యక్తికి రూ.25 వేల జరిమానా విధించింది. ఇలాంటి పిటిషన్ వేసి ప్రత్యర్థి కక్షిదారులను బెదిరించే ప్రయత్నం చేశారని అభిప్రాయపడింది. హైదరాబాద్ ట్రూప్ బజార్‌లోని ఓ భూమిని 2001లో నవేదిత మాన్వికర్ నుంచి వ్యాపారవేత్త మహ్మద్ నయీమ్ అద్దెకు తీసుకున్నారు. ఆ తర్వాత ఫోర్జరీ డాక్యుమెంట్లలో భూమి యాజమాన్య హక్కులు పొందే ప్రయ త్నం చేశారు. దీని కోసం సివిల్ కోర్టులో పిటిషన్ వేశారు. విచారణ చేపట్టిన కోర్టు పిటిషన్‌ను 2017లో కొట్టివేసింది. తర్వాత వివాదం హైకోర్టుకు చేరింది. తుది తీర్పు వెలువడే వరకు భూమిని ఎవరికీ విక్రయించరాదని మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. అయితే నవేదిత ఆస్తిని విక్రయించే ప్రయత్నం చేస్తున్నారంటూ నయీమ్ ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ విచారణ చేపట్టారు. విక్రయానికి సంబంధించి నయీమ్ ఎలాంటి ఆధారాలు సమర్పించకపోవడంతో పిటిషన్‌ను డిస్మిస్ చేశారు. అలాగే విలువైన కోర్టు సమయాన్ని వృథా చేసినందుకు నయీమ్‌కు జరిమానా విధిస్తూ, ఈ మొత్తాన్ని రెండు వారాల్లో రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీకి జమ చేయాలని ఆదేశించారు.

న్యూస్ పేపర్ హ్యాకర్స్‌ను ప్రభుత్వం ఆదుకోవాలి

హైదరాబాద్: న్యూస్‌పేపర్స్ హ్యాకర్స్‌కు ప్రభుత్వం చేయూతనివ్వాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి తెలంగాణ రాష్ట్ర ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. శనివారం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల సత్యం, ప్రధాన కార్యదర్శి కూడలి రాంప్రసాద్‌రావు, కోశాధికారి ఉప్పు రాజేందర్, ప్రతినిధులు మధుసూదన్ రెడ్డి తదితరులు వేం నరేందర్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి ఏళ్ల తరబడి హ్యాకర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ప్రజలకు ఉదయాన్నే వార్తా పత్రికలు అందించే తమకు రూ.20 లక్షల ఆరోగ్య బీమా, రూ.50 లక్షల ప్రమాద బీమా కల్పించాలని, 80 శాతం రాయితీతో ఎలక్ట్రానిక్ వాహనాలు మంజూరు చేయాలని కోరారు. ఆయా ప్రాంతాల్లో దిన పత్రికల కోసం షెడ్లు, సమావేశ మందిరాన్ని ఏర్పాటు చేయాలన్నారు.



ఆయనలో జీవముండెను మరియు ఆ జీవము సమస్త మానవాళికి వెలుగై ఉండెను.
- క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం,
తిథి: బ.తదియ సా.5.54 వరకు, తదుపరి చవితి
నక్షత్రం: మూల ఉ.10.44 వరకు, తదుపరి పుర్వాషాఢ, **వర్జ్యం:** ఉ.9.07 నుండి 10.43 వరకు, తదుపరి రా.8.12 నుండి 9.47 వరకు
దుర్ముహూర్తం: సా.4.42 నుండి 5.34 వరకు
అమృతఘడియలు: లేవు.

సూర్యోదయం : 5.30
సూర్యాస్తమయం : 6.23
రాహుకాలం : సా.4.30 నుండి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుండి 1.30 వరకు

విక్రమాదిత్య సింగ్ (కంగన ప్రత్యర్థి)

రాయని డైరీ


మాధవ్ శింగరాజు

ఓటమే కాదు, కొన్నిసార్లు గెలుపు కూడా గుణపాఠాలు నేర్పుతుంది. జూన్ 1న జరిగే 'మండీ' లోక్ సభా స్థానం ఎన్నికల్లో ఒకవేళ నేను గెలిస్తే... 'గెలుపు కోసం ప్రత్యర్థి గురించి తప్పుగా మాట్లాడటం ఓటమి కన్నా తక్కువేం కాదు'... అన్నదే బహుశా నేను నేర్చుకునే మొదటి గుణపాఠం అవుతుంది!

రాజకీయంగా ఎన్నైనా ఉండొచ్చు, అవి రాజకీయంగానే ఉండాలి. వ్యక్తిగత స్థాయికి దిగకూడదు. దిగజార కూడదు.

కంగనకు, నాకు మధ్య ఏం లేదు. ఆమె బీజేపీ, నేను కాంగ్రెస్. సినిమాల్లో ఆమె 'క్వీన్', సిమ్లా వాళ్లకు నేను 'కింగ్'. ఇద్దరం ఒకింట్లో పుట్టుంటే ఆమె అక్క, నేను తమ్ముడు. కానీ ప్రచారంలో ఆమెను ఎన్నిమాటలన్నాను! అన్నానా? అనవలసి వచ్చిందా? అనవలసి వచ్చినా అది అన్నట్లే!

కంగనకు, నాకు మధ్య ఏం లేకుండానూ లేదు. మంచి నటిగా ఆమెను నేను అభిమానిస్తాను. కనుక నేను ఆమె అభిమానిని అన్నట్లే! మా మధ్య సినీతారకు–సినీ అభిమానికి మధ్య



ఉండే అనుబంధం ఉన్నట్లే!

'క్వీన్' సినిమాలో చూడాలి కంగనను. 'క్వీన్ ఆఫ్ ఝాన్సీ' సినిమా కాదు. 'క్వీన్' సినిమా. అమాయకురాలైన అమ్మాయి. ఆత్మాభిమానం కల అమ్మాయి. ప్రతికూల పరిస్థితుల్ని చేతుల్లోకి తీసుకుని రాణిలా ఏలిన అమ్మాయి. మధురం, సున్నితం, ఆహ్లాదకరం... 'క్వీన్' లో కంగన నటన. అందులో అనే ఏముందీ! ప్రతి చిత్రంలోనూ!

రొమాంటిక్ థ్రిల్లర్ 'గ్యాంగ్‌స్టర్' తో మొదలు పెట్టి రాజకీయాల్లోకి వచ్చి పడ్డారు కంగన. ఇక్కడ ఆమె తొలి చిత్రం 'మండీ'. దర్శకత్వం బీజేపీ. అందులో విలన్... ఇంకెవరు? నేనే.

బీజేపీ నుంచి కంగన, కాంగ్రెస్ నుండి నేను మండీ నుంచి పోటీ పడుతున్నాం. మాటలూ పడుతున్నాం!

ఎన్నెన్ని మాటలు! ఎంతెంత మాటలు! అర్థం లేనివి, అనవసరమైనవీ, అసహ్యకరమైనవి, రాజకీయాలకు ఏ మాత్రం సంబంధం లేనివి! ఆమె బీఫ్ తిన్నారని అన్నాను. ఆమె దర్శించిన దేవాలయాలను శుద్ధి చేయాలని అన్నాను. తిరిగి ఆమె నన్ను 'మహా చోర్' అన్నారు. 'ఛోటా పప్పు' అన్నారు. కానీ స్త్రీ... పురుషుడిని అనడం వేరు. పురుషుడు స్త్రీని అనడం వేరు.

అమ్మ స్టేట్ కాంగ్రెస్ ప్రెసిడెంట్. 'మండీ' సిటింగ్ ఎంపీ. అమ్మ కాంగ్రెస్‌లో ఉండి కూడా... రామాలయం నిర్మించినందుకు మోదీజీని ధైర్యంగా ప్రశంసించగలిగారు! అయోధ్యలో ప్రతిష్ఠాపన కార్యక్రమానికి వెళ్ల కూడదని కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయించిన తర్వాత కూడా మోదీని అమ్మ బహిరంగంగా అభినందించారు.

అందుకు ఒకవేళ కాంగ్రెస్ పార్టీ... "ప్రతిభాసింగ్‌జీ! మీరు పార్టీ నియమాలను ఉల్లంఘించారు..." అని అమ్మను బహిష్కరించి, "ప్రతిభాసింగ్‌జీ! మీరు మా పార్టీలోకి వచ్చేయండి..." అని బీజేపీ అమ్మను ఆహ్వానించి, అమ్మ బీజేపీలో చేరి, ఇప్పుడు ఇదే 'మండీ' నుంచి నాకు పోటీగా నిలబడి ఉంటే అమ్మను కూడా కంగనను అన్నట్లే అన్నేసి మాటలు అనవలసి వచ్చేదా? మాటలు అనవలసి వస్తే అసలు అమ్మకు పోటీగా నిలబడేవాడినా? "కంగనకు బుద్ధి ప్రసాదించమని ఆ శ్రీరాముడిని వేడుకుంటున్నాను" అని కూడా నేను కంగన గురించి అన్నాను.

అందుకు కంగన – "వీరభద్రసింగ్‌జీ ఈరోజు జీవించి ఉంటే కనుక నా గురించి అగౌరవంగా మాట్లాడినందుకు తన కొడుకు విక్రమాదిత్యను మందలించి, 'వెళ్లి ఆమెకు క్షమాపణ చెప్పు' అని ఉండేవారు..." అన్నారు.

ఆ మాట నిజమే కావచ్చు.

కానీ, కొన్నిసార్లు క్షమాపణ కోరటం కూడా అభిమానాన్ని ప్రదర్శించుకోవటమే అవుతుంది. అభిమానం అన్నది గుండెల్లో ఉంటేనే మనల్ని సాకర్యవంతంగా ఉంచుతుంది.

అయినా అందరికీ అమ్మకు ఉన్నంత ధైర్యం ఉంటుందా?! రాజకీయ ప్రత్యర్థిని అభినందించేంత ధైర్యం!

బొటాబొటిగా జాతీయం!





జనతంత్రం

వర్ధెల్లి మురళి

చండీగఢ్ టూ పట్నా. జాతీయ రాజకీయాలకు ఆయువుపట్టు. సారవంతమైన గంగా–యమునల మైదాన ప్రాంతం ఇదే. కొద్దిగా సింధూ బేసిన్ కూడా ఇందులో చేరి ఉండవచ్చు. కాస్త విస్తరిస్తే 'కౌబెల్ట్' అని కూడా పిలుస్తాము. మనం ఏ రకమైన మాంసం తినాలో, ఏ రకమైనది తినకూడదో తెలియజెప్పే కౌబాయ్స్‌కు ఇది పరమ పూజనీయమైన ప్రాంతం. అనాదిగా పిలుచుకుంటున్నట్టు 'ఆర్యావర్తం' కూడా ఇదే! ఈ ప్రాంతం మీద పట్టు సాధించకుండా దేశంలో రాజ్యాధికారాన్ని సంపాదించడం చాలా కష్టం.

మొదటి ఐదు సాధారణ ఎన్నికల్లో ఆర్యావర్తం, ద్రవిడదేశం అనే తేడాల్లేకుండా దేశంలోని అన్ని ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యత కనబరిచింది. ఆరోసారి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ జైత్రయాత్రకు కళ్లెం వేసిన జనతా పార్టీ మాత్రం అచ్చంగా ఉత్తరాది పార్టీయే! అప్పుడు జనతా పార్టీకి 295 లోక్‌సభ స్థానాలు దక్కాయి. ఇందులో వింధ్య పర్వతాలకు దిగువన గెలిచిన సీట్లు రెండు డజన్లు దాటలేదు. అవి కూడా ప్రధానంగా మహారాష్ట్రలో గెలిచినవే!

భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి గడచిన పదేళ్లుగా అధికారంలో ఉన్నది. అయినప్పటికీ ఒక్క కర్ణాటక మినహా మిగిలిన దక్షిణాదిలో పెద్దగా ప్రభావం చూపలేకపోతున్నది. ఈసారి అదనంగా తెలంగాణపై కూడా ఆశలు పెట్టుకున్నది. కానీ, మూడోసారి వరసగా అధికారాన్ని చేపట్టాలంటే కచ్చితంగా గోమాత ప్రాంతమే కాషాయ దళాన్ని కరుణించి కాపాడాలి. గత ఎన్నికల్లో భారీ సీట్లను ప్రసాదించిన ఈ ప్రాంతంలో బలమైన గండి పడితే మాత్రం ఇతర ప్రాంతాలు పూడ్చగలిగే పరిస్థితి కనిపించడం లేదు. మరి ఈసారి కూడా ఆర్యావర్తం బీజేపీని గట్టెక్కిస్తుందా లేదా అన్నదే ముఖ్యమైన ప్రశ్న.

చండీగఢ్ నుంచి హర్యానా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌ల మీదుగా బీహార్‌లోని పట్నా వరకు మొత్తం 157 స్థానాలను అప్పట్లో జనతా పార్టీ క్లీన్‌స్వీప్ చేసింది. ఇప్పటికీ అదే రికార్డు. ఇందిరా గాంధీ హత్యానంతరం వెల్లువెత్తిన సానుభూతి ప్రభంజనం (1984)లో కూడా ఈ రికార్డు చెక్కుచెదరలేదు. అప్పుడు యూపీ, బీహార్‌లలో ఎనిమిదిమంది ఇతర పార్టీల వారు గెలిచారు. కొత్త రాష్ట్రాలుగా అవతరించిన ఉత్తరాఖండ్, జార్ఖండ్‌లను కూడా కలుపుకొంటే ఇదే ప్రాంతంలో బీజేపీకి 2019లో 113 సీట్లు దక్కాయి. ఎన్డీఏ భాగస్వాములతో కలిసి 131 సీట్లలో గెలిచారు.

ఇప్పుడా సంఖ్యను బీజేపీ నిలబెట్టుకోగలదా? రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హిమాచల్‌లను కూడా కలిపి చూస్తే కౌబెల్ట్ పూర్తవుతుంది. ఇందులో రాజస్థాన్ (25), గుజరాత్ (26), హిమాచల్ (4)లో అప్పుడు బీజేపీ క్లీన్ స్వీప్ చేసింది. మధ్యప్రదేశ్ (29)లో 28, ఛత్తీస్‌గఢ్ (11)లో 9 సీట్లను గెలుచుకున్నది. ఈ దూకుడును ఇప్పుడు కూడా ప్రదర్శించగలుగుతుందా? దాదాపు 90 శాతం స్ట్రయిక్ రేట్‌తో విజృంభిస్తేనే కౌబెల్ట్‌లో బీజేపీ తన బలాన్ని నిలబెట్టుకోగలుగుతుంది.

ఈ ప్రాంతంలో బలమైన సామాజిక వర్గాలుగా పేరున్న రాజ్‌పుత్, జాట్, యాదవ కులాలు బీజేపీకి వ్యతిరేకంగా పని చేస్తున్నాయనే వార్తలు వస్తున్నాయి. ఓబీసీ రిజర్వేషన్ల కోసం డిమాండ్ చేస్తున్న జాట్ నాయకులు రాజస్థాన్, హర్యానాల్లో ఇప్పటికే 'ఇండియా' కూటమికి మద్దతు ప్రకటించారు. పశ్చిమ యూపీలోని జాట్లు మాత్రం చరణ్‌సింగ్ పరివారానికి చెందిన ఆర్‌ఎల్‌డీతోనే ఉన్నట్టు కనిపిస్తున్నది. ఈ పార్టీ ఎన్డీఏలో చేరినందువల్ల యూపీ జాట్ల మద్దతు బీజేపీకి లభించవచ్చు.

ఉత్తరాదిలో తొలి నుంచీ బీజేపీకి వెన్నుదన్నుగా ఉన్న రాజ్‌పుత్‌ల తాజా వైఖరి ఆ పార్టీని కొంత కలవరపరుస్తున్నది. ఈ వర్గానికి ప్రాతినిధ్యం వహించే కర్ణిసేన సభ్యులు బహిరంగ సభలు పెట్టి మరీ బీజేపీకి వ్యతిరేకంగా ఓటేయాలని పిలుపునిస్తున్నారు. రాజ్‌పుత్ వర్గం మీద వీరి పిలుపు ప్రభావం చూపితే ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌లలోని కనీసం 30 నియోజకవర్గాల్లో బీజేపీకి నష్టం జరిగే అవకాశం ఉన్నది. రాజ్‌పుత్ వర్గానికి చెందిన యోగీ బాబానే యూపీ సీఎంగా ఉన్నందువలన ఆ రాష్ట్రంలో పెద్దగా భయపడవలసిన అవసరం లేదని బీజేపీ భావిస్తున్నది.

యూపీ, బీహార్‌లలో గణనీయమైన సంఖ్యలో ఉన్న యాదవులు చాలాకాలంగా ఎస్పీ, ఆర్జేడీల వెనుకనే సమీకృతమై ఉన్నారు. ఇప్పుడీ సమీకరణ మరింత సంఘటితంగా ఉన్నట్టు సమాచారం. అఖిలేశ్, తేజస్వీ యాదవ్‌లను వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రులను చేయాలనే పట్టుదల యువతలో కనిపిస్తు

వాజ్‌పేయి హయాంలోని ఎన్డీఏ సర్కార్ చేసుకున్న 'షైనింగ్ ఇండియా' ప్రచారం వికటించినట్టుగానే మోదీ సర్కార్ చేస్తున్న 'వికసిత భారత్' కూడా వికటిస్తున్నట్టుగానే కనిపిస్తున్నది. ఉపాధి రంగం దారుణంగా దెబ్బతిన్నది. పెద్దనోట్ల రద్దు, కోవిడ్ వరస దెబ్బలతో కుదేలైన చిన్న వర్తకులు ఇప్పటికీ కోలుకోలేదు. నిరుద్యోగిత రేటుపై నిన్ననే విడుదలైన పీరియాడిక్ లేబర్ శాంపుల్ సర్వే నివేదిక నిరాశాజనకంగానే ఉన్నది. ప్రతిష్ఠాత్మకమైన ఐఐటీల్లో చదువుకున్న ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లలో 38 శాతం మందికి క్యాంపస్ ప్లేస్‌మెంట్లు లభించలేదని వచ్చిన తాజా వార్త పరిస్థితికి అద్దం పడుతున్నది.
ఉత్తరాది రాష్ట్రాల్లోని నిరుద్యోగ యువతకు సైనిక బలగాల్లో చేరడం ఒక ప్రత్యామ్నాయం. అందులో ఎన్డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన 'అగ్నివీర్' పథకం ఈ యువతను తీవ్రంగా నిరాశపరిచింది. దేశంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలపై ప్రపంచస్థాయి ఆర్థికవేత్తలందరూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆక్స్‌ఫామ్ వంటి సంస్థలు క్రమం తప్పకుండా ఇచ్చే నివేదికల్లో ఈ అన్యాయాన్ని ఎత్తిచూపుతున్నాయి. ఒకే దేశంలోని మనుషుల మధ్య వంద రెట్లు, వేయి రెట్లు కాదు లక్షల రెట్ల ఆర్థిక తారతమ్యాలు వెక్కిరిస్తున్నాయి.
2012 నుంచి 2021 మధ్యకాలంలో భారత జాతి సృష్టించిన సంపదలో నలభై శాతం సొత్తు జనాభాలోని ఒకే ఒక్క శాతం కుబేరుల జేబుల్లోకి వెళ్లింది. యాభై శాతం మంది అడుగు జనాభా దోసిళ్లలో ఎంగిలి మెతుకులు రాలిపడ్డట్టు ఒకే ఒక్క శాతం సొమ్ము ఉమ్మడిగా జారిపడింది. దీన్నే కొందరు 'ట్రికిల్ డౌన్ థియరీ'గా పిలుచుకుంటున్నారు. ఈ రకమైన ఆర్థిక విధానాలతో ఎన్డీఏ రాజ్యమేలుతున్నది. ఇటువంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకునే శామ్ పిట్రోడాతో సహా పలువురు ఆర్థికవేత్తలు కూడా దేశంలో వారసత్వ పన్ను విధించాలన్న ప్రతిపాదన చేస్తున్నారు.

న్నది. యాదవ వర్గం వ్యతిరేకతకు విరుగుడుగా యాదవేతర ఓబీసీలను మచ్చిక చేసుకుంటూ బీజేపీ ఇన్నాళ్లుగా నెట్టుకొస్తున్నది. బీజేపీ అధికారంలోకి వస్తే ఈసారి రిజర్వేషన్లు ఎత్తివేస్తారని జరిగిన ప్రచారం వల్ల ఈ వర్గం మద్దతును కూడా ఎంతోకొంత బీజేపీ కోల్పోవచ్చనే అభిప్రాయం బలపడుతున్నది. రిజర్వేషన్లు ఎత్తివేసే ఆలోచన తమకు లేదని ప్రధాని సహా పలువురు నేతలు వివరణ ఇచ్చినప్పటికీ జరగాల్సిన నష్టం జరిగిపోయిందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

వాజ్‌పేయి హయాంలోని ఎన్డీఏ సర్కార్ చేసుకున్న 'షైనింగ్ ఇండియా' ప్రచారం వికటించినట్టుగానే మోదీ సర్కార్ చేస్తున్న 'వికసిత భారత్' కూడా వికటిస్తున్నట్టుగానే కనిపిస్తున్నది. ఉపాధి రంగం దారుణంగా దెబ్బతిన్నది. పెద్దనోట్ల రద్దు, కోవిడ్ వరస దెబ్బలతో కుదేలైన చిన్న వర్తకులు ఇప్పటికీ కోలుకోలేదు. నిరుద్యోగిత రేటుపై నిన్ననే విడుదలైన పీరియాడిక్ లేబర్ శాంపుల్ సర్వే నివేదిక నిరాశాజనకంగానే ఉన్నది. ప్రతిష్ఠాత్మకమైన ఐఐటీల్లో చదువుకున్న ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లలో 38 శాతం మందికి క్యాంపస్ ప్లేస్‌మెంట్లు లభించలేదని వచ్చిన తాజా వార్త పరిస్థితికి అద్దం పడుతున్నది.

ఉత్తరాది రాష్ట్రాల్లోని నిరుద్యోగ యువతకు సైనిక బలగాల్లో చేరడం ఒక ప్రత్యామ్నాయం. అందులో ఎన్డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన 'అగ్నివీర్' పథకం ఈ యువతను తీవ్రంగా నిరాశపరిచింది. దేశంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలపై ప్రపంచ స్థాయి ఆర్థికవేత్తలందరూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆక్స్‌ఫామ్ వంటి సంస్థలు క్రమం తప్పకుండా ఇచ్చే నివేదికల్లో ఈ అన్యాయాన్ని ఎత్తిచూపుతున్నాయి. ఒకే దేశంలోని మనుషుల మధ్య వంద రెట్లు, వేయి రెట్లు కాదు లక్షల రెట్ల ఆర్థిక తారతమ్యాలు వెక్కిరిస్తున్నాయి.

2012 నుంచి 2021 మధ్యకాలంలో భారత జాతి సృష్టించిన సంపదలో నలభై శాతం సొత్తు జనాభాలోని ఒకే ఒక్క శాతం కుబేరుల జేబుల్లోకి వెళ్లింది. యాభై శాతం మంది అడుగు జనాభా దోసిళ్లలో ఎంగిలి మెతుకులు రాలిపడ్డట్టు ఒకే ఒక్క శాతం సొమ్ము ఉమ్మడిగా జారిపడింది. దీన్నే కొందరు 'ట్రికిల్ డౌన్ థియరీ'గా పిలుచుకుంటున్నారు. ఈ రకమైన ఆర్థిక విధానాలతో ఎన్డీఏ రాజ్యమేలుతున్నది.

ఇటువంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకునే శామ్ పిట్రోడాతో సహా పలువురు ఆర్థికవేత్తలు కూడా దేశంలో వారసత్వ పన్ను విధించాలన్న ప్రతిపాదన చేస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దడానికి ఇటువంటి సూచనలపై విస్తృతమైన చర్చను ఆహ్వానించడం అవసరం. కానీ, పిట్రోడాకు ఉన్న కాంగ్రెస్ సంబంధాలను ఆసరా చేసుకొని స్వయంగా ప్రధానమంత్రే ఎదురుదాడికి పూనుకున్నారు. 'ప్రతిపక్షం అధికారంలోకి వస్తే మీరు సంపాదించుకున్న సొమ్మును లాగేసుకుంటారట' అంటూ రెచ్చగొట్టే ఉపన్యాసాలు చేశారు. ఈ ప్రచారం బీజేపీకి మేలు చేసిందా... కీడు చేసిందా అనే విషయం ఓట్ల లెక్కింపు తర్వాత తేలిపోనున్నది.

ఈ రకమైన సామాజిక – ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ తన కంచుకోటలను ఏ మేరకు కాపాడుకోగలదన్న చర్చ జరుగుతున్నది. ప్రభుత్వానికి అనుకూలంగా గానీ, వ్యతిరేకంగా గానీ ఎటువంటి గాలి లేదని అభిప్రాయపడిన పక్షంలో గుజరాత్, రాజస్థాన్, హర్యానా, ఢిల్లీ, యూపీ, బీహార్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో కలిపి సుమారు 50 స్థానాలను బీజేపీ చేజార్చుకోవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. వీటితోపాటు మహారాష్ట్ర, కర్ణాటకల్లో కూడా గత ఎన్నికల్లో బీజేపీ మంచి ఫలితాలనే సాధించింది. ఈసారి రెండు రాష్ట్రాల్లో కనీసం 15 స్థానాల వరకు ఆ పార్టీ పోగొట్టుకోవచ్చనే అంచనాలున్నాయి.

శరద్ పవార్, బాల్‌థాక్రేలు స్థాపించిన పార్టీలను చీల్చడం బీజేపీకి కలిసివచ్చే అంశం కాదనే అభిప్రాయం మహారాష్ట్రలో ఉన్నది. ఎన్నికల హామీల అమలులో చతికిలబడ్డ కర్ణాటక కాంగ్రె

'ప్రతిపక్షం అధికారంలోకి వస్తే మీరు సంపాదించుకున్న సొమ్మును లాగేసుకుంటారట' అంటూ స్వయంగా ప్రధానమంత్రే రెచ్చగొట్టే ఉపన్యాసాలు చేశారు. ఈ ప్రచారం బీజేపీకి మేలు చేసిందా... కీడు చేసిందా అనే విషయం ఓట్ల లెక్కింపు తర్వాత తేలిపోనున్నది.
ఈ రకమైన సామాజిక – ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ తన కంచుకోటలను ఏ మేరకు కాపాడుకోగలదన్న చర్చ జరుగుతున్నది. ప్రభుత్వానికి అనుకూలంగా గానీ, వ్యతిరేకంగా గానీ ఎటువంటి గాలి లేదని అభిప్రాయపడిన పక్షంలో గుజరాత్, రాజస్థాన్, హర్యానా, ఢిల్లీ, యూపీ, బీహార్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో కలిపి సుమారు 50 స్థానాలను బీజేపీ చేజార్చుకోవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. వీటితోపాటు మహారాష్ట్ర, కర్ణాటకల్లో కూడా గత ఎన్నికల్లో బీజేపీ మంచి ఫలితాలనే సాధించింది. ఈసారి రెండు రాష్ట్రాల్లో కనీసం 15 స్థానాల వరకు ఆ పార్టీ పోగొట్టుకోవచ్చనే అంచనాలున్నాయి.
శరద్ పవార్, బాల్‌థాక్రేలు స్థాపించిన పార్టీలను చీల్చడం బీజేపీకి కలిసివచ్చే అంశం కాదనే అభిప్రాయం మహారాష్ట్రలో ఉన్నది. ఎన్నికల హామీల అమలులో చతికిలబడ్డ కర్ణాటక కాంగ్రెస్‌కు బీజేపీ మిత్రపక్షం జేడీఎస్ మళ్లీ ఊపిరిపోసింది. దేవెగౌడ పౌత్రరత్నం చేసిన నిర్వాకంపై కన్నడిగులు మండిపడుతున్నారు. ఇక బెంగాల్, ఒడిషా, తెలంగాణ తదితర రాష్ట్రాల్లో ఓ పదిహేను స్థానాలను బీజేపీ అధికంగా సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంటే కోల్పోయే అవకాశం ఉన్న సీట్లు 65 అనుకుంటే, అదనంగా తెచ్చుకునే సీట్లు పదిహేను వరకు ఉండవచ్చని అంచనా. అంటే కనీసం యాభై సీట్లను బీజేపీ నికరంగా కోల్పోతుంది.

స్‌కు బీజేపీ మిత్రపక్షం జేడీఎస్ మళ్లీ ఊపిరిపోసింది. దేవెగౌడ పౌత్రరత్నం చేసిన నిర్వాకంపై కన్నడిగులు మండిపడుతున్నారు. ఇక బెంగాల్, ఒడిషా, తెలంగాణ తదితర రాష్ట్రాల్లో ఓ పదిహేను స్థానాలను బీజేపీ అధికంగా సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంటే కోల్పోయే అవకాశం ఉన్న సీట్లు 65 అనుకుంటే, అదనంగా తెచ్చుకునే సీట్లు పదిహేను వరకు ఉండవచ్చని అంచనా. అంటే కనీసం యాభై సీట్లను బీజేపీ నికరంగా కోల్పోతుంది.


వ్యతిరేక గాలి బలంగా లేకపోతేనే గత ఎన్నికలతో పోలిస్తే యాభై స్థానాలను బీజేపీ కోల్పోవచ్చు. కూటమిలోని మిత్రపక్షాలన్నీ ఉమ్మడిగా మరో పాతిక, ముప్పయ్ సీట్లను గెలవచ్చు. ఇది దాదాపు తొంభై శాతం స్థానాలకు పోలింగ్ పూర్తయిన తర్వాత పరిశీలకుల్లో నెలకొని ఉన్న అభిప్రాయం. అంటే బొటాబొటి మెజారిటీతో ఎన్డీఏ మూడోసారి గద్దెనెక్కడానికి అవకాశాలు ఉన్నాయనుకోవాలి. బీజేపీకి సొంతంగా 370 సీట్లు కావాలనీ, కూటమికి 400 సీట్లు కావాలని ప్రధానమంత్రి చేసిన అభ్యర్థనను జనం పట్టించుకోలేదు. మూడింట రెండొంతుల మెజారిటీ లభిస్తే ఈ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని మార్చడానికి వెనకాడదనే వాదనను జనం విశ్వసిస్తున్నారనే అనుకోవాలి.

విశ్వసనీయమైన ప్రత్యామ్నాయం, సమర్థవంతమైన నాయకత్వం అందుబాటులో ఉండి ఉంటే ఇప్పుడున్న ప్రభుత్వాన్ని ప్రజలు కచ్చితంగా ఓడించేవారే. ప్రజల ఆకాంక్షలకు, ప్రభుత్వ విధానాలకు మధ్యన ఓ పెద్ద అగాధమే ఉన్నది. కానీ, ఇండియా కూటమిలో పెద్ద పార్టీగా ఉన్న కాంగ్రెస్ పార్టీ కొన్ని రాష్ట్రాలకే పరిమితమైన పార్టీగా మిగిలిపోయింది. సాధారణ మెజారిటీకి అవసరమైన 272 స్థానాల్లో కనీసం సగం సీట్లను కూడా కాంగ్రెస్ గెలవగలదన్న నమ్మకం ఎవరికీ లేదు. ఈ పరిస్థితుల్లో అతుకుల బొంతతో అస్థిర ప్రభుత్వ ప్రయోగాలకు మెజారిటీ ప్రజలు సిద్ధపడకపోవచ్చు. పార్టీ అధ్యక్షుడు ఖర్గేను ప్రధాని పదవికి ప్రతిపాదించి ఉంటే కూటమి సభ్యుల ఆమోదం లభించేది. సాహసోపేతమైన ఈ ప్రయోగాన్ని దేశ ప్రజలు స్వాగతించేవారు. కానీ రాహుల్‌గాంధీ మాటల్లో కనిపించేంత ఔదార్యం, అభ్యుదయం చేతల్లో కనిపించవు. అదే విషాదం. ఎట్టకేలకు కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభలో సెంచరీ కొట్టే ఒక మంచి అవకాశం దొరికింది. దాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆశిద్దాం.

vardhelli1959@gmail.com

ప్రశ్నించడం నేర్పిన తొలి మేధావులు


సందర్భం




డాక్టర్ దేవరాజు మహారాజు

'దేవుడు చెడును ఆపాలని కోరుకుంటున్నా ఆపలేకపోతున్నాడా? అలా అయితే, అతను సృష్టిలయలను తన అధీనంలో ఉంచుకున్నవాడు కాదు. అతను సమర్థుడే, కానీ ఆపాలని కోరుకోవడం లేదా? అయితే అతను పగ, ద్వేషమూ గలవాడన్న మాట! అతను చెడును ఆపాలని కోరుకునేవాడు, పైగా సమర్థుడూ అయితే... మరి చెడు ఎందుకు రాజ్యమేలుతోంది?– సమాధానం కావాలి! పోనీ, అతను చెడును ఆపాలని కోరుకోవడమూ లేదు – పైగా సామర్థ్యమూ లేదా? ఇక ఎందుకండీ ఆయనకు ఆ దేవుడనే బిరుదూ?' అని ప్రశ్నించాడు ఎపిక్యూరస్ (క్రీస్తు పూర్వం 341–270) అనే పురాతన గ్రీకు తత్త్వవేత్త. 'ఎపిక్యూరిజమ్'కు ఆయనే సిద్ధాంతకర్త. ఆయన రచనలు సుమారు మూడు వందల రాత ప్రతులున్నట్లు తెలిసింది. ఆయనపై డెమోక్రైటస్ అరిస్టిప్పస్, పైరో లాంటి వారి ప్రభావం ఉంది. ఎపిక్యూరస్ బోధనలు తొలి దశలో సైన్సుకు ఆధారమయ్యాయి. ఎందుకంటే ఆయన రుజువుల్ని యథార్థాలనే నమ్మాలన్నాడు. క్రీ.పూ. 800–200 మధ్య కాలాన్ని ఏగియల్ యుగంగా పరిగణించారు. ఆ యుగంలో వైజ్ఞానిక ధోరణితో ఆలోచించి శాస్త్రయుగ కర్తగా నిలిచినవాడు ఎపిక్యూరస్! గ్రీస్‌లో లాగానే ఇలాంటి ఆలోచనా ధోరణి గల వారు ఇండియా, చైనా, ఇరాన్ లాంటి దేశాల్లో ఉన్నారని కార్ల్ జాస్పర్స్ (1883–1969) అనే జర్మనీ తత్వవేత్త పరిశీలనలో తేలింది. ఆయన పరిశీలనల్లో వాస్తవం ఉందనిపిస్తుంది. ఎందుకంటే సాధారణ శకానికి పూర్వమే మన భారత్‌లో చార్వాకులు, హేతువాదులు విస్తరించి ఉన్నారు. సమాజానికి ప్రశ్నించడం నేర్పారు.

ఎపిక్యూరస్ ఆనాటి మేధావులందరితో విభేదించినా, డెమోక్రైటస్ (క్రీ.పూ. 460–370) వెలుగులోకి తెచ్చిన అటమిక్ థియరీని బలపరిచాడు. ఈ విశ్వం అతి సూక్ష్మమైన అణువులతో రూపొందిందనీ, అవి ఒకదానితో ఒకటి ఢీ-కొట్టుకుంటూ, విడిపోతూ, మళ్ళీ దగ్గరవుతూ ఉంటాయనీ, ఇవి నాశనం కావనీ, వీటి వల్లనే 'పదార్థం' ఏర్పడుతుందనీ డెమోక్రైటస్ భావించాడు. ఈ 'ఆటమిక్ థియరీ'ని ఎపిక్యూరస్ గట్టిగా నమ్మాడు. అయితే డెమోక్రైటస్ ఈ సిద్ధాంతం తనదని చెప్పుకోలేదు. తనకు గురుతుల్యుడైన లుసిప్పస్ (క్రీ.పూ. 5వ శతాబ్దం) ప్రతిపాదించాడనీ, తను కేవలం ఆ అటమిక్ థియరీని వెలుగులోకి తెచ్చానన్నాడు. లుసిప్పస్ తత్వవేత్త. మెటాఫిజిస్ట్ ఆటమిక్ థియరీ ఎవరిదైనా కావచ్చు. కానీ అది వాస్తవం! ఆనాడు డెమోక్రైటస్ ప్రభావం ఎపిక్యూరస్ పైనే కాదు, ఆధునిక కాలపు కార్ల్ మార్క్స్‌పైనా ఉంది.



ఎపిక్యూరస్



సోక్రటీస్

ఎపిక్యూరస్‌కు కొంచెం అటు ఇటుగా దృష్టి సారిస్తే, మనకు మిలోస్‌కు చెందిన డయగోరస్, సైరిన్‌కు చెందిన థియడోరస్‌లు కనిపిస్తారు (క్రీ.పూ. 5వ శతాబ్దం) వీరిలో డయగోరస్ గ్రీకు కవి, హేతువాది. థియడోరస్ నాటి గ్రీకు గణిత శాస్త్రవేత్త. ఆయన పేరుతోనే 'స్పైరల్ ఆఫ్ థియడోరస్' అనే గణిత సూత్రం ఉంది.

పశ్చిమాన పరిస్థితి అలా ఉంటే, మన తూర్పు దేశాల్లో బౌద్ధం, జైనం, టోయిజం వంటివి వ్యాపించి విగ్రహారాధనను నిరసించాయి. డయగోరస్ తర్వాత– థియడోరస్, యుధిమిరస్ వెలుగులోకి వచ్చారు. గ్రీస్‌లో నిరీశ్వర వాదం ఆ రోజుల్లో పెద్ద నేరం! తత్త్వవేత్త సోక్రటీస్ (క్రీ.పూ. 399)కు శిక్ష పడింది కూడా ఆ విషయం గురించే! నాటి సమాజం గుడ్డిగా నమ్ముతున్న దేవుళ్ళను సోక్రటీస్ తిరస్కరించాడు. అతని ప్రభావంలో పడి యువత చెడిపోతోందని పాలకులు అతనికి మరణశిక్ష విధించారు. ఆ ఆ శిక్షను నింపాదిగా, నిబ్బరంగా స్వీకరించాడు.

ఫ్రెంచ్ విప్లవ నేపథ్యంలో యూరోప్‌లో హేతువాదం బాగా పుంజుకుంది. ఫ్రెంచ్ విప్లవ ప్రభావం యూరోప్ సమాజంపై బాగా పడిన తర్వాత, విశ్వాసానికి – విశ్వసనీయతకు ఘర్షణ జరిగింది. క్రైస్తవ రహిత సమాజం రూపుదిద్దుకో నారంభించింది.


అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో 19వ శతాబ్దంలో వచ్చిన సామాజిక ఉద్యమాల వల్ల అక్కడి సమాజంలో 'స్వేచ్ఛాలోచన' బాగా స్థిరపడింది. కేంబ్రిడ్జి యూనివర్సిటీ అధ్యయనం ప్రకారం 1917 రష్యా విప్లవం ప్రభావంతో సమాజంలో హేతువాదం బాగా పెరిగింది. అందువల్ల మార్క్సిస్టు – లెనినిస్టుల ప్రభుత్వం ఏర్పడింది.

సమాజంలో హేతుబద్ధత పెంచాలంటే, లక్షల సంఖ్యలో కార్యకర్తలు నడుం బిగించాలి. వేల సంఖ్యలో రచయితలు కలాలు పట్టాలి. అప్పుడు గానీ, వైజ్ఞానిక స్పృహ గల ప్రభుత్వాలు ఏర్పడవు. అమాయకులంతా మాయ మాటలు చెప్పే మోసగాళ్ళనే నమ్ముతారు. దీనికి పరిష్కారమెక్కడుందీ? వాస్తవాలు తెలుసుకోవడంలో ఉంది. నిజాల్ని జీర్ణించుకోవడంలో ఉంది.

వ్యాసకర్త సాహిత్య అకాడెమీ అవార్డ్ గ్రహీత

ముక్కలైన దేహానికి పాతికేళ్లు

పాటనే జీవితంగా మలుచుకొని చివరి శ్వాస వరకు తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమించింది తెలంగాణ గానకోకిల బెల్లి లలిత. 1972 ఏప్రిల్ 29న భువనగిరిలో నిరుపేద కుటుంబంలో జన్మించింది. చదువులేని ఆమె పొట్టకూటి కోసం స్థానిక కాటన్ స్పిన్నింగ్ మిల్లులో కార్మికురాలిగా చేరింది. ఈ క్రమంలోనే సీఐటీయూలో సభ్యత్వం తీసుకొని కార్మిక హక్కుల సాధన కోసం పోరాడింది. అనంతరం 'భువనగిరి సాహిత్య మిత్ర మండలి'లో చేరి ప్రజా సమస్యల పరిష్కారానికి పాటను తన అస్త్రంగా మార్చుకుంది. 'తాగబోతే నీళ్ల లేవూ తుమ్మెదాలో... తడి గొంతూ లారిపాయే తుమ్మెదాలో!' అంటూ ఫ్లోరైడ్ నీటి సమస్యలపై గళమెత్తింది. 1996లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనే లక్ష్యంగా ప్రొఫెసర్ జయశంకర్ 'తెలంగాణ ఐక్య వేదిక' ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో 1997 మార్చి 8న భువనగిరిలో జరిగిన 'దగాపడ్డ తెలంగాణ' సభలో బెల్లి లలిత కీలక భూమిక పోషించింది. ఆ తర్వాత 1997 ఆగస్టు 11న బహుజన నేత మారోజు వీరన్న సూర్యాపేటలో నిర్వహించిన 'తెలంగాణ మహాసభ'తో పాటు 1997 డిసెంబర్ 28న వరంగల్‌లో జరిగిన బహిరంగ సభలో లలిత తన గానంతో గర్జన చేసింది. పీపుల్స్‌వార్ సానుభూతిపరుల 'తెలంగాణ జనసభ' అనుబంధ విభాగమైన 'తెలంగాణ కళా సమితి' కన్వీనర్‌గా ఊరూరా తిరిగి ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకత వివరించింది.



బెల్లి లలిత

తెలంగాణ రాష్ట్ర డిమాండ్ ఉద్ధృతం అవుతుండటం ఆనాటి సమైక్య పాలకులు జీర్ణించుకోలేకపోయారు. అప్పటికే ప్రజా గాయకుడు గద్దర్‌పై కాల్పులు జరిపి, బహుజన నేత మారోజు వీరన్నను పొట్టన పెట్టుకున్నారు. ఈ తరుణంలో1999 మే 26న ఇంటి నుండి వెళ్ళిన లలిత తిరిగిరాలేదు. 1999 మే 29న దర్గాబావిలో శరీర భాగాలు ఉన్నాయన్న వార్తతో భువనగిరి ఉలిక్కి పడింది. పదమూడు రోజులు గాలించగా పలు బావులు, చెరువుల్లో 17 ముక్కలైన లలిత శరీర భాగాలు లభ్యమయ్యాయి. 1999 జూన్ 11న జరిగిన అంత్యక్రియలకు ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. నాటి పాలకులే... మాజీ నక్సలైట్‌ను ఆయుధంగా మార్చుకొని లలితను పాశవికంగా హత్య చేయించారని ప్రజా సంఘాలు నిరసించాయి. ఆరు దశాబ్దాల ఆకాంక్షకై 17 ముక్కలైన లలిత అమరత్వానికి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలోనూ కనీస గౌరవం దక్కలేదు.

– పి. నరేష్, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి

(నేడు బెల్లి లలిత 25వ వర్ధంతి)

క్లుప్తంగా...

చేనేత కార్మికుల దీర్ఘకాలిక లబ్ధికి చర్యలు



సాక్షి, హైదరాబాద్: చేనేత కార్మికులకు దీర్ఘకాలిక లబ్ధి చేకూరే పథకాల అమలు కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. 2018లో పవర్ లూమ్ కార్మికులకు ఇన్పుట్ సబ్సిడీ లింక్డ్ వేతనాల పరిహార పథకాన్ని గత ప్రభుత్వం ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించినప్పటికీ, కేబినెట్ ఆమోదం లేక ఇప్పటి వరకు నిధులు విడుదల కాలేదని శనివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకు రూ.33.23 కోట్ల నిధులను నేత కార్మికులకు 10 శాతం యార్న్ సబ్సిడీ రూపంలో టెస్కో నిధుల నుంచి విడుదల చేసినట్లు వెల్లడించారు. మరమగ్గాలు, చేనేత మగ్గాల ఆధునీకరణకు బీసీ సంక్షేమ శాఖ ద్వారా నేతన్నలకు సహాయం చేసేందుకు 2024–25 బడ్జెట్ నుంచి రూ. 400 కోట్లను వినియోగించేందుకు ముఖ్యమంత్రి అంగీకరించినట్టు తెలిపారు. కాగా, రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా చేపట్టిన ఆయిల్ పామ్ సాగు కోసం డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను పంపిణీ చేస్తునట్లు మంత్రి వెల్లడించారు.

వరివేస్తే ఉరి అన్నది మీరు కాదా?

'వరివేస్తే ఉరి తప్పదు అన్నది మీరు కాదా? సన్నాలు సాగు చేయాలని తర్వాత రైతుల నడ్డి విరిచింది మీరు కాదా? రైతుబంధును మధ్య మధ్యలో ఆపింది మీరే కదా'అని బీఆర్ఎస్ నాయకులపై మంత్రి తుమ్మల తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. పచ్చిరొట్ట విత్తనాల సబ్సిడీ కూడా విడుదల చేయకుండా బకాయిలు పెడ్తే, ఇప్పుడు తాము వాటిని సరిచేస్తున్నామని, దీనిపైనా బీఆర్ఎస్ నాయకులు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని మండిపడ్డారు.

5 నెలల్లో రేవంత్ చేసిందేమీ లేదు

- ఆవిర్భావ వేడుకలకు బలి దేవతను పిలుస్తారా?



గ్యాదరి కిశోర్

సాక్షి, హైదరాబాద్: మాజీ సీఎం కేసీఆర్‌ను దూషించి పబ్బం గడుపుకోవడం తప్ప గడిచిన ఐదు నెలల్లో సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి చేసిందేమీ లేదని మాజీ ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్ విమర్శించారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి రైతులు, మహిళలు, నిరుద్యోగులు సహా అందరినీ కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. తెలంగాణ భవన్‌లో శనివారం కిశోర్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2004–14 మధ్యకాలంలో కేవలం 10 వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చిన కాంగ్రెస్ తప్పుడు ప్రచారంతో నిరుద్యోగులను రెచ్చగొట్టిందన్నారు. నిరుద్యోగులు వాస్తవాలు గ్రహించి ఎమ్మెల్సీ ఉపఎన్నికలో కాంగ్రెస్ మోసాలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. గతంలో సోనియాను బలి దేవత అన్న.. రేవంత్ ఆమెను రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు పిలుస్తున్నారా? అని ప్రశ్నించారు.

తెలంగాణ దేవత సోనియానే..

- ప్రభుత్వ విప్ అయిలయ్య



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన దేవత కాబట్టే సోనియా గాంధీని దశాబ్ది ఉత్సవాలకు ఆహ్వానిస్తున్నామని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానం మేరకు సోనియా ఈ ఉత్సవాలకు తప్పకుండా హాజరవుతారని చెప్పారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. దశాబ్ది ఉత్సవాలకు సోనియాను ఎలా పిలుస్తారంటూ మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మతిలేని మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇవ్వకపోతే కేసీఆర్, జగదీశ్‌రెడ్డిలకు పదవులు ఎలా వచ్చేవని ప్రశ్నించారు. రాష్ట్రం వచ్చినప్పుడు కేసీఆర్, ఆయన కుటుంబం సోనియా కాళ్ల మొక్కి.. పార్టీని విలీనం చేస్తామని చెప్పిన విషయాన్ని జగదీశ్‌రెడ్డి మర్చిపోయారా? అని ప్రశ్నించారు. సోనియాను విమర్శిస్తే బీఆర్ఎస్ నేతలను ప్రజలు తరిమికొడతారని అయిలయ్య హెచ్చరించారు.

'ఉప్పల్ స్టేడియంలో రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టాలి'

సాక్షి, హైదరాబాద్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఉప్పల్ స్టేడియంలో నెలకొల్పేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు కోరారు. ఆగస్టు 20 రాజీవ్‌గాంధీ జయంతి రోజున ఈ విగ్రహావిష్కరణను ఆయన కుమార్తె ప్రియాంకాగాంధీ చేతుల మీదుగా చేయించాలన్నది తన కోరిక అని వెల్లడించారు. శనివారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ప్రతినిధులు శివలాల్‌యాదవ్, శేషునారాయణ, విజయానంద్, అమర్‌నాథ్, భాస్కర్‌లతో కలిసి వీహెచ్ మాట్లాడారు. ఉప్పల్‌స్టేడియంకు రాజీవ్‌గాంధీ పేరు పెట్టాలని సలహా ఇచ్చింది తానేనని, తన విజ్ఞప్తి మేరకే సోనియా గాంధీ అంగీకరించారని చెప్పారు. రాజీవ్ పేరు స్టేడియంకు పెట్టారు కానీ ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించలేదని, అందుకే తన సొంత నిధులతో వెయ్యి కిలోల బరువున్న 13 అడుగుల ఎత్తు విగ్రహాన్ని తయారు చేయించానని వీహెచ్ తెలిపారు.



ఈ చిత్రాన్ని చూసి ఏ పొలమో.. పార్కో అనుకుంటే పప్పులో కాలేసినట్టే. సిద్దిపేట పట్టణ శివారు చింతల్ చెరువు గుర్రపు డెక్క ఆకుతో నిండిపోయింది. నీటితో కళకళలాడాల్సిన చెరువు పచ్చని తివాచీలా కనిపిస్తున్నా.. ఎవరైనా ఆదమరిచి లోపలికి వెళ్తే ప్రమాదాల బారిన పడాల్సిందే.
– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

ఏడో బ్లాక్ మినహా.. మేడిగడ్డ సేఫ్!

- బ్యారేజీలోని ఏడో బ్లాక్ కింద మాత్రమే కొట్టుకుపోయిన ఇసుక
- మిగతా బ్యారేజీకి ప్రస్తుతం ఎలాంటి ఉపద్రవం లేనట్టే!
- గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ పరీక్షలో ఎల్అండ్‌టీ నిర్ధారణ
- ఏడో బ్లాక్ కింద బుంగను పూడ్చేందుకు 10 వేల క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరమని అంచనా
- డ్రెడ్జర్ వంటి పరికరంతో వేగంగా ఇసుక ఫిల్లింగ్ చేయాలని నిర్ణయం
- మొరాయించిన 7 గేట్లలో మూడింటిని పైకి ఎత్తే అవకాశం
- మిగతా 4 గేట్లను కట్ చేసి తొలగించాలని నిర్ణయం
- బ్యారేజీలకు అత్యవసర పనులపై ఈఎన్‌సీల కమిటీ సమావేశం



మేడిగడ్డ బ్యారేజీ 7వ బ్లాకులోని 20వ గేటును శనివారం ఆర్క్ గ్రాగింగ్‌తో కట్ చేస్తున్న దృశ్యం

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీ నిర్వహించిన గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ (జీపీఆర్) పరీక్షలో అత్యంత కీలక సమాచారం లభించింది. బ్యారేజీలో కుంగిన ఏడో బ్లాకు కింద మినహా ఇతర బ్లాకుల కింద ఎలాంటి బుంగలు/బొరియలు ఏర్పడలేదని ఈ పరీక్షల్లో నిర్ధారించారు. బ్యారేజీలోని మిగతా ఏడు బ్లాకులకు ప్రస్తుతానికి ఎలాంటి ఉప ద్రవం లేదని తేల్చారు. ఏడో నంబర్ బ్లాకు కింద బుంగలను పూడ్చివేయడానికి కనీసం 10 వేల క్యూబిక్ మీటర్ల ఇసుకను వేయాల్సి ఉంటుందని అంచనాకు వచ్చారు. వేగంగా ఇసుకను పంపింగ్ చేసే డ్రెడ్జర్ వంటి పరికరాన్ని వినియోగించాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ ఈఎన్సీ అనిల్‌కుమార్ నేతృత్వంలోని కమిటీ శనివారం నిర్మాణ సంస్థను ఆదేశించింది. ఎన్డీఎస్ఏ మధ్యంతర నివేదిక అమలుకు ఏర్పాటైన ఈ కమిటీ శనివారం జలసౌధలో సమావేశమైంది. బ్యారేజీల వద్ద చేపట్టాల్సిన అత్యవసర పనులపై చర్చించింది.

బుంగల పూడ్చివేతపై ఎన్డీఎస్ఏ అనుమతి కోసం..

మేడిగడ్డ బ్యారేజీలో ఏర్పడిన బుంగలతోపాటు బ్యారేజీ పునాదుల కింద ఏర్పాటు చేసిన సెకెంట్ పైల్స్ వద్ద లీకేజీలను ఇసుకతో పూడ్చివేయాలని... ఇందుకోసం ఎన్డీఎస్ఏ నుంచి అనుమతి తీసుకోవాలని కమిటీ నిర్ణయం తీసుకుంది. ఈ అంశాలపై ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ ఎలాంటి సిఫారసులు చేయని నేపథ్యంలో.. అనుమతి కోరనుంది. ఇక బ్యారేజీల పరిరక్షణను అత్యంత ప్రాధాన్య అంశంగా తీసుకుని వానాకాలం ప్రారంభానికల్లా అత్యవసర పనులు పూర్తి చేయాలని నిర్ణయించింది. బుంగలు పూడ్చడంతోపాటు, గేట్లన్నీ ఎత్తడం, బ్యారేజీల ఎగువన, దిగువన రక్షణ కోసం చేసిన ఆప్రాన్, సీసీ బ్లాకులు వంటి నిర్మాణాలను పునరుద్ధరించడం వంటివి చేపట్టాలని బ్యారేజీల ఇంజనీర్లు, నిర్మాణ సంస్థలను ఆదేశించింది.

జీతాలిచ్చేందుకూ కటకట.. బిల్లులు ఇవ్వండి!

సుందిళ్ల బ్యారేజీకి అత్యవసర మరమ్మతులను వేగిరం చేసి వానాకాలం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని నిర్మాణ సంస్థ నవయుగ కన్‌స్ట్రక్షన్స్‌ను ఈఎన్‌సీ (జనరల్) అనిల్‌కుమార్ ఆదేశించారు. మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల వద్ద అత్యవసర పనులు వేగం పుంజుకోగా.. సుందిళ్ల వద్ద నత్తనడకన జరుగుతున్నాయని పేర్కొన్నారు. దీంతో తమ వద్ద నిధులు లేవని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని నవయుగ కంపెనీ ప్రతినిధులు కోరినట్టు తెలిసింది. తమ సిబ్బందికి జీతాలు కూడా చెల్లించలేకపోతున్నామని పేర్కొన్నట్టు సమాచారం.

మంగళవారం మేడిగడ్డను సందర్శించనున్న సీఎం!

సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను సందర్శించి అత్యవసర మరమ్మతుల పనులను పరిశీలించే అవకాశం ఉంది. దీనిపై కమిటీ సమావేశంలో చర్చించినట్టు సమాచారం. ఈ సమావేశంలో సభ్యులు ఈఎన్సీ (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) బి.నాగేంద్రరావు, సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో) చీఫ్ ఇంజనీర్ మోహన్ కుమార్, మెంబర్ కన్వీనర్/ రామగుండం చీఫ్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేడిగడ్డ బ్యారేజీలో మొరాయించిన ఏడు గేట్లలో మూడింటిని మాత్రమే పైకి ఎత్తడం సాధ్యమని నీటిపారుదల శాఖ నిర్ధారణకు వచ్చింది. ఏడో బ్లాకులోని మూడు పియర్లకు భారీ పగుళ్లు ఏర్పడిన నేపథ్యంలో.. వాటికి

నాలుగు గేట్లను కట్ చేయాల్సిందే!

ఉన్న నాలుగు గేట్లను కట్ చేసి తొలగించాలని నిర్ణయించింది. శనివారం 20వ గేటును ఆర్క్ గ్రాగింగ్ (గ్యాస్ కట్టర్ తరహా పరికరం)తో కట్ చేసే ప్రక్రియను నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీ ప్రారంభించింది. మేడిగడ్డ బ్యారేజీలో మొత్తం 8 బ్లాకులు, 85 గేట్లు ఉన్నాయి. గతేడాది అక్టోబర్ 21న ఏడో బ్లాకు కుంగడంతో.. వెంటనే 77 గేట్లను ఎత్తి నీటిని కిందికి వదిలారు. 7వ బ్లాకులోని 15 నుంచి 22వ నంబర్ వరకు గేట్లు మొరాయించాయి. వీటిని వానాకాలం ప్రారంభానికి ముందే పైకి ఎత్తాలని ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ తన మధ్యంతర నివేదికలో సిఫారసు చేసింది. దీంతో కాస్త ప్రయత్నించి 15వ నంబర్ గేటును ఎత్తగలిగారు. మరో రెండింటిని ఎత్తేందుకు చాన్స్ ఉందని.. మిగతా వాటిని కట్ చేయాల్సిందేనని తేల్చారు. ఈ గేట్ల పనులకు తోడు.. ఎన్డీఎస్ఏ సూచించిన అత్యవసర మరమ్మతు పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని నీటి పారుదల శాఖ ఈఎన్సీ (జనరల్) అనిల్‌కుమార్ తెలిపారు.

కొత్తగా దక్షిణ 'రింగ్'!

▶ మొదటి పేజీ తరువాయి

వరుసల ఎక్స్‌ప్రెస్ హైవేగా నిర్మించాల్సిందేనని రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా కోరటంతో.. చివరికి కేంద్రం సరేనంది. ఆలోపే కన్సల్టెన్సీ సంస్థ మూడు అలైన్‌మెంట్లను రూపొందించింది. అందులో రెండు అలైన్‌మెంట్లు ప్రస్తుత రోడ్లను అనుసంధానిస్తూ రూపొందించగా.. ఒకదాన్ని పూర్తి కొత్త రోడ్డుగా ప్రతిపాదించారు. ఈ మూడో అలైన్‌మెంట్‌నే ఖరారు చేయాలని ఎన్‌హెచ్ఏఐ నిర్ణయించినట్టు తెలిసింది.

ఆ ఒక్క రోడ్డును కలుపుదామనుకున్నా..

షాద్‌నగర్ నుంచి చేవెళ్ల, శంకర్‌పల్లి మీదుగా కంది వరకు ప్రపంచ బ్యాంకు నిధులతో నిర్మించిన రోడ్డును.. దక్షిణ 'రింగ్' అలైన్‌మెంట్‌లో భాగం చేయాలని తొలుత భావించారు. కానీ ఆ రోడ్డు కొనసాగే ప్రాంతాల్లో వాణిజ్యపర కార్యక్రమాలు బాగా పెరిగాయి. కొత్తగా జనావాసాలు వేగంగా విస్తరించాయి. భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. అక్కడ భూసేకరణ కూడా కష్టంగా మారింది. దాంతో ఈ రోడ్డును కలపకుండా.. దానికి దూరంగా రూపొందించిన అలైన్‌మెంట్ వైపే మొగ్గుచూపినట్టు తెలిసింది. దీనితో రోడ్డు ప్రతిపాదిత పొడవు కూడా పెరిగిపోయింది.

భారీగా పెరుగుతున్న అంచనా వ్యయం..

రీజనల్ రింగురోడ్డును తొలుత ప్రతిపాదించినప్పుడు మొత్తంగా రూ.19 వేల కోట్లతో పూర్తి చేయవచ్చనే అంచనా వేశారు. కానీ ప్రాజెక్టు జాప్యం అవుతున్న కొద్దీ.. ఆ మార్గం వెంట ఉన్న ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెంది, భూముల ధరలు విపరీతంగా పెరగటంతో ఖర్చు రెట్టింపవుతోంది. ఏడాదిన్నర క్రితం ఉత్తర భాగానికి కేంద్ర ఉపరితల రవాణా శాఖ బడ్జెట్‌ను ఖరారు చేసింది. ఈ భాగం 158.65 కిలోమీటర్ల నిడివికి రూ.13,200 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేసింది. కానీ ప్రక్రియ ముందుకు సాగలేదు. నిర్మాణ పనులు మరో ఏడాది తర్వాత గానీ ప్రారంభమయ్యే సూచనలు కనిపించటం లేదు. అప్పటికి ఉత్తర భాగం వ్యయ అంచనా రూ.16 వేల కోట్లకు చేరుతుందని భావిస్తున్నారు. ఇక తాజాగా అలైన్‌మెంట్ ఖరారు దశకు చేరిన దక్షిణ భాగానికి నిర్మాణ వ్యయం రూ.18 వేల కోట్లుగా అంచనా వేశారు. జాప్యం జరిగితే ఇది కూడా పెరిగిపోయే అవకాశం ఉంది. అంటే మొత్తంగా రీజనల్ రింగురోడ్డు నిర్మాణ వ్యయం రూ.35 వేల కోట్లను దాటుతుందని అధికారవర్గాలు అంటున్నాయి.

మొత్తం రీజనల్ రింగ్ రోడ్డు లెక్క ఇదీ..

ఉత్తర భాగం 158.65 కిలోమీటర్లు (ఖరారైనది)
దక్షిణ భాగం 189.43 కిలోమీటర్లు (అంచనా)
మొత్తం పొడవు 348.08 కిలోమీటర్లు (అంచనా)
సేకరించే భూమి సుమారు 4,500 హెక్టార్లు
భూసేకరణ వ్యయం అంచనా రూ.14,500 కోట్లు (భూముల ధరలు పెరిగేకొద్దీ మారుతుంది)
నిర్మాణ పనులకు అయ్యే వ్యయ అంచనా రూ.19,500 కోట్లు (జాప్యం జరిగినకొద్దీ పెరిగే అవకాశం ఉంది)

కావూరి ఫ్యామిలీ, నటుడు తొట్టెంపూడి వేణుపై కేసు

బంజారాహిల్స్: సినీనటుడు తొట్టెంపూడి వేణు, బీజేపీ నేత మాజీ ఎంపీ కావూరి సాంబశివరావు భార్య, కుమారుడు, కుమార్తెతో పాటు ప్రోగ్రెసివ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ సంస్థ ఎండీపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. ఉత్తరాఖండ్ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టుకు సంబంధించిన పనిని తెహ్రీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీహెచ్‌డీసీ) ద్వారా ప్రోగ్రెసివ్ కన్‌స్ట్రక్షన్ సంస్థ (పీసీఎల్ ఐఎల్సీ) దక్కించుకొంది. ఈ పనిని రిత్విక్ ప్రాజెక్ట్స్ సంస్థకు సబ్ కాంట్రాక్టునివ్వగా, రిత్విక్ ప్రాజెక్ట్స్ 2002లో ఈ పనులను ప్రారంభించడమే కాకుండా బ్యాంకు గ్యారంటీ, ఇతర పనులకు సంబంధించి పెట్టుబడి పెట్టింది. పీసీఎల్ ఐఎల్సీకి 5.5% కమీషన్ పోగా మిగిలిన 94.5 శాతాన్ని రిత్విక్ కన్‌స్ట్రక్షన్ తీసుకోవాల్సి ఉంటుంది. అయితే పీసీఎల్ ఐఎల్సీకి, టీహెచ్‌డీసీకి మధ్య ఏర్పడిన వివాదం ఢిల్లీ హైకోర్టుకు చేరడంతో ఆయా పనులకు సంబంధించిన రూ.1,010 కోట్లను టీహెచ్‌డీసీ కోర్టులో జమ చేసింది. ఈ క్రమంలో పీసీఎల్ ఐఎల్సీ ప్రతినిధులైన కావూరి భాస్కరరావు, సినీనటుడు తొట్టెంపూడి వేణు, కావూరి భాస్కరరావు తల్లి, పీసీఎల్ సంస్థ ఫుల్ టైం డైరెక్టర్ కె. హేమలత, సోదరి శ్రీవాణితోపాటు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రవీణ్ పాతూరికి రిత్విక్ ప్రాజెక్ట్స్ చేసుకున్న ఒప్పందానికి సంబంధించిన హక్కులను రద్దు చేసింది. అయితే పీసీఎల్ సంస్థ.. రిత్విక్ ప్రాజెక్ట్స్ బ్యాంకు గ్యారెంటీ కింద పెట్టిన రూ.508 కోట్లను విడుదల చేసుకోవడానికి కోర్టులో క్లెయిమ్ చేసింది. ఈ నేపథ్యంలో ఉద్దేశపూర్వకంగా మోసం చేసి మొత్తం డబ్బును కాజేయాలని ప్రయత్నిస్తున్నారంటూ పీసీఎల్ ఐఎల్సీ సంస్థతోపాటు సంస్థ ప్రతినిధులపై రిత్విక్ సంస్థ ఉపాధ్యక్షుడు టి.రవికృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్

- వరంగల్–ఖమ్మం–నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారానికి తెర
- 12 నియోజకవర్గాల్లో 4,63,839 లక్షల మంది ఓటర్లు
- పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తిచేసిన యంత్రాంగం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: వరంగల్–ఖమ్మం–నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారం శనివారంతో ముగిసింది. పోలింగ్ ఈ నెల 27న ఉదయం 8 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4 గంటలకు వరకు సాగనుంది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన వెల్లడించారు. మొత్తం 605 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ నియోజకవర్గానికి 2021లో నిర్వహించిన ఎన్నికల్లో ఎమ్మెల్సీగా ఎన్నికైన పల్లా రాజేశ్వర్‌రెడ్డి మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో ఆయన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఈ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ జూన్ 5న ప్రారంభం కానుంది. 6, 7 తేదీల్లోనూ కౌంటింగ్ కొనసాగనుంది. ఈ ఎన్నిక బరిలో 52 మంది అభ్యర్థులు ఉండటంతో పెద్ద బ్యాలెట్ పత్రాలను ముద్రించారు. అలాగే, జంబో బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు. ఆదివారం పోలింగ్ సామగ్రిని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ కేంద్రాలకు తరలించనున్నారు.

మధ్యవేలికి ఇంక్

వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలో వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, ములుగు, సిద్దిపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ ఎన్నిక కోసం ఆయా నియోజకవర్గాల్లో 4,63,839 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికలు జరిగిన నేపథ్యంలో ఓటర్ల చూపుడు వేలుకు ఇంక్‌ను పెట్టగా, ఈ ఎన్నికల కోసం మధ్యవేలికి ఇంక్ పెట్టనున్నారు.

నోటా లేదు..

ఈ ఎన్నికల్లో నోటాకు ఓటు వేసే అవకాశం లేదు. ఈవీఎం ద్వారా కాకుండా బ్యాలెట్ పద్ధతిలోనే, బాక్సుల్లో ఓటు వేసే విధానంలో ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. కాబట్టి ఎమ్మెల్సీ ఎన్నికల్లో నోటా ఆప్షన్ ఇవ్వడం కుదరదని ఎన్నికల అధికారులు వెల్లడించారు. పోలింగ్ అధికారి ఇచ్చే ఊదారంగు స్కెచ్ పెన్‌తోనే ఓటు వేసే వారు బ్యాలెట్ పేపరుపై ప్రాధాన్య క్రమంలో 1, 2, 3, 4.. అంకెలు మాత్రమే రాయాలని చెప్పారు.

ఓటర్లకు స్పెషల్ క్యాజువల్ లీవ్

పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటర్లయిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం ఈనెల 27న స్పెషల్ క్యాజువల్ లీవ్‌ను మంజూరు చేసింది. ప్రైవేటు, వాణిజ్య సంస్థలు, పారిశ్రామిక సంస్థల్లో పనిచేసే ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు యాజమాన్యాలు పనివేళల సర్దుబాటుకు అవకాశం ఇవ్వాలని స్పష్టం చేసింది. వారు పోలింగ్ రోజున విధులకు ఆలస్యంగా వచ్చేందుకు అనుమతి ఇవ్వటం, లేదా వారు పని చేసే షిఫ్టులను సవరించడం, పని వేళల్లో వెసులుబాటు కల్పించడం వంటి ఏర్పాట్ల ద్వారా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించాలని స్పష్టం చేసింది.

యాదాద్రిలో బ్రేక్ దర్శనం టికెట్లు



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బ్రేక్ దర్శనానికి వెళ్లే భక్తులకు తిరుమల తిరుపతి ఆలయం తరహాలో టికెట్లను జారీ చేస్తున్నారు. ఇటీవలే ఆన్‌లైన్‌లో టికెట్ల నమోదుకు అవకాశం కల్పించిన అధికారులు.. శనివారం క్యూఆర్ కోడ్‌తో కూడిన బ్రేక్ దర్శనం టికెట్లను జారీ చేశారు. టికెట్‌పై తేదీ, వేళలు, టికెట్ పీవోఎస్ నంబర్, ఎంతమంది దర్శనానికి వెళ్తున్నారు, రుసుముతో పాటు సమయం వివరాలుంటాయి. గతంలో మాన్యువల్‌గా టికెట్లను విక్రయించే వారు. ఆన్‌లైన్ సిస్టమ్ అందుబాటులోకి వచ్చిన తరువాత క్యూఆర్‌తో కూడిన టిక్కెట్లను అందజేస్తున్నారు.

భక్తజన యాదాద్రి

- దర్శనానికి 4 గంటలకు పైనే..
- 45 వేల మందికి పైగా భక్తులు
- రూ.62.55 లక్షల నిత్యాదాయం



రూ.150 టికెట్ల కోసం బారులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తులు పోటెత్తారు. వేసవి సెలవులు ముగుస్తుండటంతో శనివారం తెలుగు రాష్ట్రాలు సహా వివిధ రాష్ట్రాల భక్తులు అధికంగా శ్రీస్వామిని దర్శించుకొని, మొక్కులు తీర్చుకున్నారు. ధర్మ దర్శనానికి 4 గంటలకు పైగానే సమయం పడుతుండగా.. వీఐపీ దర్శనానికి 2 గంటలు, బ్రేక్ దర్శనానికి 30 నిమిషాల సమయం పడుతోంది. దీంతో క్యూకాంప్లెక్స్, గోల్డ్ క్యూలైన్స్, ముఖ మండపం, మాడ వీధులు, ఘాట్ రోడ్డు, రింగ్ రోడ్డు, కల్యాణకట్ట, లక్ష్మీ పుష్కరిణి, శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపం, కొండపై, కొండ కింద బస్టాండ్లు భక్తులతో నిండిపోయాయి. భక్తులు లడ్డూ ప్రసాదం కొనుగోలుకు పోటీ పడ్డారు. శ్రీస్వామి వారిని 45 వేలకు పైగా భక్తులు దర్శించుకున్నారు. ఆదివారం భక్తులు మరింత పెరిగే అవకాశం ఉంది. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి నిత్యాదాయం రూ.62,55,860 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

నల్లగొండ జిల్లాలో నకిలీ పత్తివిత్తనాలు స్వాధీనం

జిల్లా వ్యాప్తంగా పోలీస్, వ్యవసాయ శాఖ అధికారుల తనిఖీలు

నల్లగొండ అగ్రికల్చర్ (నల్లగొండ జిల్లా): నకిలీ విత్తనాలు అమ్మేవారిపై జిల్లా వ్యవసాయ శాఖ ఉక్కుపాదం మోపుతోంది. గురువారం రాత్రి పోలీస్, వ్యవసాయాధికారులు నల్లగొండ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన తనిఖీల్లో భారీగా నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో భాగంగా మిర్యాలగూడ పట్టణంలో తరలిస్తున్న 260 కిలోల నకిలీ పత్తి విత్తనాలను, శాలిగౌరారం మండలానికి చెందిన సోమయ్య నుంచి 20 కేజీల నకిలీ విత్తనాలు పట్టుకుని ఎఫ్ఐఆర్ నమోదు చేశామని జిల్లా వ్యవసాయాధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టుబడిన విత్తనాలను బీటీ3 విత్తనాలుగా గుర్తించి పరీక్ష కోసం ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు.

- నల్లగొండ–ఖమ్మం–వరంగల్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో తమ మద్దతు కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకేనని తెలంగాణ గోపాల మిత్రల సంఘం ప్రకటించింది. రాష్ట్రంలోని గోపాలమిత్రలు, వారి కుటుంబ సభ్యుల తొలి ప్రాధాన్యత ఓటును తీన్మార్ మల్లన్నకే వేస్తామని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

దూసుకొచ్చిన మృత్యువు

- రోడ్డు పక్కన ఆగిన కారును ఢీకొన్న డీసీఎం
- బాలుడి మృతి.. పలువురికి గాయాలు



మేడ్చల్ రూరల్: కారులో ప్రయాణిస్తున్న వారికి ప్రయాణం పడకపోవడంతో వాంతులు రాగా రోడ్డుకు ఎడమవైపు కారు ఆపి.. వాంతి చేసుకుంటుండగా డీసీఎం రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. ఓ బాలుడి ప్రాణాలు బలిగొంది. ఈ సంఘటన మేడ్చల్ ఓఆర్ఆర్‌పై చోటు చేసుకుంది. ఎస్ఐ లావణ్య తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని కూకట్‌పల్లికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి విద్యాసాగర్ శనివారం ఉదయం తన భార్య రమాదేవి, కుమారుడు రామ్, తల్లి రమమ్మ, వరంగల్‌కు చెందిన అక్క దీప్తి, అల్లుడు పూజిత్ రామ్(13), కోడలు వేదశ్రీలతో కలిసి బీబీనగర్ వెళ్లేందుకు శనివారం ఉదయం తమ కారులో బయలుదేరి ఓఆర్ఆర్ గుండా వెళ్తున్నారు. మార్గమధ్యలో మేడ్చల్ సమీపంలోకి చేరుకోగానే కారులో ఉన్న అల్లుడు పూజిత్‌రామ్, భార్య రమాదేవి, వేదశ్రీలకు వాంతులు కావడంతో కారును ఎడమవైపు ఆపారు. రమాదేవి, వేదశ్రీలు కారు దిగి పక్కకు వెళ్లగా..పూజిత్‌రామ్ తిరిగి కారు ఎక్కే సమయంలో అదే మార్గంలో వెనుకనుండి వేగంగా వచ్చిన డీసీఎం వాహనం వీరి కారును ఢీకొట్టింది. దీంతో పూజిత్‌రామ్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మరణించగా కారులో ఉన్న విద్యాసాగర్, కుమారుడు రామ్‌లకు గాయాలయ్యాయి. ప్రమాదం విషయం తెలుసుకున్న మేడ్చల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. పూజిత్‌రామ్ మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పంజాబ్‌లో చతుర్ముఖం

13 స్థానాలకు జూన్ 1న పోలింగ్

- విడిగా పోటీ చేస్తున్న ఆప్, కాంగ్రెస్
- వాటితో పాటు బీజేపీకీ ప్రతిష్టాత్మకమే

2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ పెద్దగా రాణించని రాష్ట్రాల్లో పంజాబ్ ఒకటి. 13 లోక్‌సభ స్థానాల్లో ఎనిమిది కాంగ్రెస్ హస్తగతం కాగా బీజేపీ రెండింటికే పరిమితమైంది. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ అద్భుత విజయంతో గద్దెనెక్కింది. దాన్ని లోక్‌సభ ఎన్నికల్లోనూ పునరావృతం చేయాలని ఆశ పడుతోంది. దాంతో కాంగ్రెస్‌తో పొత్తు లేకుండా ఒంటరిగానే బరిలో దిగింది. అకాలీదళ్ దూరమవడంతో బీజేపీ కూడా సొంతంగానే పోటీ చేస్తోంది. దాంతో రాష్ట్రంలో చతుర్ముఖ పోరు నెలకొంది. ఆప్, బీజేపీ పోటీని తట్టుకుని సిట్టింగ్ స్థానాలను కాపాడుకోవడం కాంగ్రెస్‌కు సవాలే...

– సాక్షి, నేషనల్ డెస్క్



జలంధర్

కాంగ్రెస్‌కే గాక ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో దిగిన మాజీ సీఎం చరణ్‌సింగ్ చన్నీకి సైతం ఇక్కడ గెలుపు ప్రతిష్టాత్మకంగా మారింది. 2009, 2014, 2019ల్లో ఇక్కడ కాంగ్రెస్ వరుసగా గెలిచింది. 2023 ఉప ఎన్నికలో ఆప్ నేత సుశీల్‌కుమార్ రింకు నెగ్గారు. ఇప్పుడాయన బీజేపీ అభ్యర్థిగా పోటీలోకి దిగడం విశేషం! ఆప్ నుంచి పవన్‌కుమార్ టిను, అకాలీదళ్ నుంచి మోహింద్ సింగ్ బరిలో ఉన్నారు. బీఎస్పీ, సీపీఎం, అకాలీదళ్ (అమృత్‌సర్) కూడా పోటీ చేస్తున్నాయి. జలంధర్‌లో కాంగ్రెస్ ఏకంగా 13సార్లు ఇక్కడ గెలవడం విశేషం!

గురుదాస్‌పూర్

ఇక్కడా ప్రధాన పోటీ కాంగ్రెస్, బీజేపీ మధ్యే! సిట్టింగ్ ఎంపీ, బాలీవుడ్ నటుడు సన్నీడియోల్ స్థానంలో దినేశ్ సింగ్ బబ్బుకు బీజేపీ టికెటిచ్చింది. అకాలీదళ్ అండ లేకపోవడం పార్టీకి ప్రతికూలం. మోదీపైనే బీజేపీ భారం వేసింది. కాంగ్రెస్ నుంచి సుఖ్‌జిందర్ సింగ్ రాంధ్వ, ఆప్ నుంచి అమన్‌షేర్ సింగ్ కల్సి, అకాలీదళ్ తరఫున దల్జీత్‌సింగ్ చీమ పోటీలో ఉన్నారు. అకాలీదళ్ (అమృత్‌సర్) సైతం అభ్యర్థిని పోటీకి పెట్టింది.

పటియాలా

మాజీ సీఎం అమరిందర్‌సింగ్ భార్య ప్రణీత్ కౌర్ ఇక్కడ పోటీలో ఉన్నారు. 2019 ఇక్కడ కాంగ్రెస్ టికెట్‌పై గెలిచిన ప్రణీత్ ఈసారి బీజేపీ టికెట్‌పై బరిలో దిగడం విశేషం. ఆప్ నుంచి దల్బీర్ సింగ్, అకాలీదళ్ తరఫున నరీందర్ కుమార్ శర్మ, కాంగ్రెస్ నుంచి ధరంవీర్ గాంధీ పోటీ చేస్తున్నారు. ప్రధాన పోటీ ప్రణీత్, ధరంవీర్ మధ్యే నెలకొంది. సంప్రదాయంగా కాంగ్రెస్‌కే మద్దతిచ్చే ఇక్కడి ఓటర్లకు నచ్చజెప్పి బీజేపీకి ఓటేయించడం ప్రణీత్, అమరీందర్‌లకు సవాలుగా మారింది. ఆమె ఫిరాయింపుదారు అంటూ రైతులు నిరసన తెలుపుతుండటం తలనొప్పిగా మారింది. అయితే గణనీయంగా ఉన్న హిందూ ఓటర్లపై అమరీందర్ దంపతులు ఆశలు పెట్టుకున్నారు.

అమృత్‌సర్

ఇక్కడ కాంగ్రెస్, బీజేపీ మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. కాంగ్రెస్ నుంచి సిట్టింగ్ ఎంపీ గుర్జీత్ సింగ్ ఔజ్లా, బీజేపీ నుంచి తరణ్‌జిత్ సింగ్ సంధు బరిలో ఉన్నారు. మాజీ ఐఎఫ్ఎస్ అధికారి సంధు ఇటీవలే బీజేపీలో చేరారు. రాష్ట్రంలో 22 శాతం మేర ఉన్న జాట్ సిక్కు వర్గానికి చెందిన వ్యక్తి. ప్రచారంలోనూ దూసుకెళ్తున్నారు. కెప్టెన్ అమరిందర్ సింగ్ చేరిక బీజేపీకి సానుకూలాంశం. ఆప్ నుంచి మంత్రి కులదీప్ సింగ్ దలైవాల్ రంగంలో ఉన్నారు.

ఆనంద్‌పూర్ సాహిబ్

కాంగ్రెస్ నుంచి సిట్టింగ్ ఎంపీ మనీశ్ తివారీ బదులు విజయ్ ఇందర్ సింగ్లా బరిలో ఉన్నారు. ఆప్ నుంచి మాల్వీందర్ సింగ్, అకాలీదళ్ తరఫున ప్రేమ్‌సింగ్ చందూమజ్రా, బీజేపీ తరఫున సుభాష్ శర్మ పోటీ చేస్తున్నారు. బీఎస్పీ, అకాలీదళ్ (అమృత్‌సర్) సైతం పోటీలో ఉన్నాయి. ఇక్కడ 2014లో గెలిచిన అకాలీదళ్ నేత ప్రేమ్‌సింగ్ 2019లో ఓటమి పాలయ్యారు.

లుధియానా

పంజాబ్‌లో ముఖ్యమైన పారిశ్రామిక ప్రాంతం. ఒకప్పుడు కాంగ్రెస్–అకాలీదళ్ మధ్యే పోటీ ఉండేది. 2014, 2019ల్లో కాంగ్రెస్ నుంచి గెలిచిన మాజీ సీఎం బియాంత్ సింగ్ కుమారుడు రవనీత్ సింగ్ బిట్టు ఈసారి బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగారు! 65.96 శాతం మంది హిందువులుండటం బీజేపీకి అనుకూలిస్తుందని భావిస్తున్నారు. దాంతో కాంగ్రెస్ నుంచి పీసీసీ చీఫ్ అమరీందర్ సింగ్ రాజా వారింగ్ బరిలో దిగారు. ఆప్ నుంచి అశోక్ పరాశర్ పప్పీ, అకాలీదళ్ తరఫున రంజిత్ సింగ్ ధిల్లాన్ బరిలో ఉన్నారు. అకాలీదళ్ (అమృత్‌సర్)తో పాటు పలువురు స్వతంత్రులూ గట్టి పోటీ ఇస్తున్నారు.

పోలింగ్ జరగనున్న లోక్‌సభ స్థానాలు...

అమృత్‌సర్, గురుదాస్‌పూర్, ఖదూర్‌సాహిబ్, హోషియార్‌పూర్, జలంధర్, ఆనందపూర్ సాహిబ్, లుధియానా, ఫతేగఢ్ సాహిబ్, ఫరీద్‌కోట్, ఫిరోజ్‌పూర్, భటిండా, సంగ్రూర్, పాటియాలా

రాజస్తాన్‌లోని ఫలోదీలో 50 డిగ్రీల ఉష్ణోగ్రత

ఐదేళ్ల తర్వాత ఇదే మొదటిసారి

న్యూఢిల్లీ: ఉత్తర భారతదేశంలో ఎండలు మండిపోతున్నాయి. ప్రధానంగా రాజస్తాన్‌లో ఉష్ణోగ్రతలు నానాటికీ పెరుగుతున్నాయి. రాజస్తాన్‌లోని ఫలోదీలో తాజాగా 50 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు భారత వాతావరణ శాఖ(ఐఎండీ) వెల్లడించింది. దేశంలో ఈ స్థాయిలో ఉష్ణోగ్రత రికార్డు కావడం ఐదేళ్ల తర్వాత ఇదే మొదటిసారి. 2019 జూన్ 1న రాజస్తాన్‌లోని చురూలో 50.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. హిమాలయ రాష్ట్రమైన హిమాచల్‌ప్రదేశ్‌తోపాటు ఈశాన్యంలోని అస్సాం, అరుణాచల్‌ప్రదేశ్‌లోనూ ఎండల ధాటికి జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శనివారం రాజస్తాన్‌లోని బార్మర్‌లో 48.8, జైసల్మేర్‌లో 48, బికనెర్‌లో 47.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దేశ రాజధాని ఢిల్లీతోపాటు పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లోని కూచ్ బెహార్‌లో 40.5 డిగ్రీలు, అస్సాంలోని సిల్చార్‌లో 40, లుమిడింగ్‌లో 43, అరుణాచల్‌లోని ఈటానగర్‌లో 40.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

ముస్లింల ఓట్ల కోసం 'ముజ్రా'

'ఇండియా' కూటమిపై ప్రధాని నరేంద్ర మోదీ ఆగ్రహం

- రిజర్వేషన్లు కాజేయాలని చూస్తే సహించబోనని హెచ్చరిక
- బిహార్, ఉత్తరప్రదేశ్‌లో మోదీ ఎన్నికల ప్రచారం

పాటలీపుత్ర/ఘాజీపూర్: విపక్ష 'ఇండియా' కూటమిపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ మరోసారి విమర్శనాస్త్రాలు సంధించారు. విపక్ష కూటమి బానిసగా మిగిలిపోయిందని, ముస్లిం ఓటు బ్యాంక్‌ను సంతృప్తిపర్చడానికి ముజ్రా(వేడుకల్లో అతిథులను అలరించడానికి చేసే నృత్యం) చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లు లాక్కోవడానికి ప్రతిపక్షాలు సాగిస్తున్న కుట్రలను కచ్చితంగా అడ్డుకుంటానని తేల్చిచెప్పారు. రిజర్వేషన్ల జోలికి వస్తే సహించబోనని హెచ్చరించారు. శనివారం బిహార్‌లోని పాటలీపుత్ర, కారాకాట్, బక్సర్, ఉత్తరప్రదేశ్‌లోని ఘాజీపూర్‌లో ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోదీ మాట్లాడారు. ప్రతిపక్షాలు పొరుగు దేశాన్ని చూపించి మనల్ని బెదిరించేందుకు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయని ఆరోపించారు. తాను ఎవరికీ భయపడడం లేదని, పాకిస్తాన్ ప్రయోజిత



ఉగ్రవాదాన్ని, అవినీతిని, నక్సలైట్ల హింసాకాండ అంతం చేయడానికి కృషి చేస్తున్నానని చెప్పారు. సామాజిక న్యాయం కోసం జరిగిన పోరాటానికి బిహార్ కొత్త దిశను ఇచ్చిందని గుర్తుచేశారు. నరేంద్ర మోదీ ఇంకా ఏం మాట్లాడారంటే...

కోర్టులు కూడా జోక్యం చేసుకోలేవు

''పంజాబ్, తెలంగాణలో కాంగ్రెస్ నాయకులు, తమిళనాడులో డీఎంకే నేతలు, పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ పెద్దలు బిహార్ వలస కూలీలను దూషిస్తూ మాట్లాడారు. తద్వారా బిహారీలను కించపర్చారు. బిహారీలను అవమానిస్తే కనీసం నిరసన తెలిపే ధైర్యం ఆర్జేడీకి లేకుండాపోయింది. ఆర్జేడీ నాయకులకు లాంతర్ పట్టుకొని ముజ్రా డ్యాన్స్ చేయడం తప్ప ఇంకేమీ తెలియదు. ఓటు జిహాద్‌కు పాల్పడుతున్నవారిపై విపక్షాలు ఆధారపడుతున్నాయి, వారి మద్దతు పొందుతున్నాయి.

ఎన్నికల ఫలితాల తర్వాత చొక్కాలు చించేసుకుంటారు

మన సైనికులు 'వన్ ర్యాంక్, వన్ పెన్షన్' పొందకుండా కాంగ్రెస్ పార్టీ అడ్డుపడింది. మేము అధికారంలోకి వచ్చిన తర్వాతే సైనికులకు మేలు జరిగింది. పనులు ఆలస్యం చేయడంతో, హక్కులు లాక్కోవడంలో కాంగ్రెస్ ఆరితేరింది. 'ఇండియా' కూటమి ఓటమి దిశగా పయనిస్తోంది. జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత విపక్ష నాయకులు పరస్పరం చొక్కాలు చించేసుకుంటారు. ఎన్నికల్లో ఓటమికి రాజకుటుంబం(సోనియా గాంధీ కుటుంబం) కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను బాధ్యుడిని చేస్తుంది. అనంతరం విదేశాలకు విహారానికి వెళ్లిపోతుంది. విపక్ష కూటమి ఒక గాలిబుడగ. అది ఇప్పటికే పేలిపోయింది'' అని ప్రధాని మోదీ తేల్చిచెప్పారు.

ఇంత దారుణంగా మాట్లాడిన ప్రధాని

దేశ చరిత్రలోనే లేరు: ప్రియాంక

న్యూఢిల్లీ/గోరఖ్‌పూర్(యూపీ): ప్రతిపక్ష ఇండియా కూటమినుద్దేశించి 'ముజ్రా'అంటూ ప్రధాని మోదీ వ్యాఖ్యానించడంపై కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వాద్రా తీవ్రంగా మండిపడ్డారు. ఇంత దారుణంగా మాట్లాడిన ప్రధానమంత్రి దేశ చరిత్రలోనే లేరని పేర్కొన్నారు. 'ప్రధానమంత్రి పదవిని దేశం యావత్తూ గౌరవిస్తుంది. అటువంటి పదవికున్న ఔన్నత్యాన్ని కాపాడండి'అని మోదీకి హితవు పలికారు. యూపీలోని గోరఖ్‌పూర్‌లో శనివారం ఆమె మాట్లాడారు. 'బిహార్‌లో ప్రధాని మోదీ ఏమన్నారో విన్నారా? దేశ చరిత్రలోనే అటువంటి భాషను వాడిన ప్రధాని మరొకరు లేరు. అటువంటి మాటలు ప్రధాని నోట రాకూడదు. సహనం కోల్పోయిన మోదీ దేశానికి, దేశ ప్రజలకు ప్రతినిధిననే విషయం మర్చిపోతున్నారు. ఆయన అసలు రూపం బట్టబయలైంది'అని ప్రియాంక అన్నారు. 'దేశమే తన కుటుంబమని చెప్పుకుంటున్న వ్యక్తి అనాల్సిన మాటలు కావవి. కుటుంబసభ్యులు పరస్పరం గౌరవించుకోవాలి. ఎప్పటికీ అది అలాగే కొనసాగాలి' అని ప్రియాంక అన్నారు.

ఎలక్షన్ బీట్

లోక్‌సభ నియోజకవర్గాల వారీగా పోలింగ్ గణాంకాలు

- వెబ్‌సైట్‌లో పొందుపర్చిన కేంద్ర ఎన్నికల సంఘం
- తొలి ఐదు దశల పోలింగ్‌లో 65.46 శాతం ఓటింగ్

న్యూఢిల్లీ: ప్రపంచంలో అత్యధిక ఓటర్లు ఉన్న దేశాల్లో భారత్ అగ్రస్థానంలో నిలుస్తోంది. దేశంలో 96.88 కోట్ల మంది అర్హులైన ఓటర్లున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఆరు దశల పోలింగ్ ముగిసింది. మొదటి ఐదు దశాల పోలింగ్‌కు సంబంధించి లోక్‌సభ నియోజకవర్గాల వారీగా గణాంకాలను కేంద్ర ఎన్నికల సంఘం శనివారం వెల్లడించింది. ఏయే నియోజకవర్గంలో ఎంతమంది ఓటర్లు ఉన్నారు? ఎంతమంది ఓటు వేశారు? ఓటింగ్ శాతం ఎంత నమోదైంది? అనే వివరాలను తమ వెబ్‌సైట్‌లో పొందుపర్చింది. తొలి ఐదు దశల్లో 429 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ నిర్వహించారు. ఆయా స్థానాల్లో మొత్తం 76.41 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వీరిలో 50.72 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని ఎన్నికల సంఘం తెలియజేసింది. అంటే మొదటి ఐదు దశల పోలింగ్‌లో సగటున 65.46 శాతం ఓటింగ్ నమోదైనట్లు స్పష్టమవుతోంది. పోలింగ్ బూత్‌లవారీగా మొత్తం ఓటర్లు, ఓటు వేసినవారి సంఖ్య, నమోదైన ఓటింగ్ శాతం వంటి సమాచారం ఇవ్వాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించలేమంటూ సుప్రీంకోర్టు వెల్లడించిన మరుసటి రోజే లోక్‌సభ నియోజకవర్గాల వారీగా పోలింగ్ వివరాలను ఈసీ బయటపెట్టడం గమనార్హం. ఇవి కచ్చితమైన గణాంకాలని, ఇందులో ఎలాంటి మార్పులు చేర్పులు చేయడానికి వీలుండదని ఈసీ స్పష్టం చేసింది. ఎన్నికల నిర్వహణ, ఈవీఎంలో ఓట్లను భద్రపర్చడం పూర్తి పారదర్శకంగా జరిగిందని వెల్లడించింది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితా ఖరారైన తర్వాత నియోజకవర్గంలోని మొత్తం ఓటర్ల తుది జాబితాను ఆ అభ్యర్థులకు అందజేసినట్లు పేర్కొంది. ఎన్నికల్లో నమోదైన ఓటింగ్ శాతం వివరాలు తమ యాప్‌లో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని తెలిపింది. ఓటింగ్ శాతం గణాంకాలను విడుదల చేయడంలో ఎలాంటి జాప్యం జరగడం లేదని తేల్చిచెప్పింది. ఎన్నికల్లో ప్రతి దశలో అత్యున్నత స్థాయి పారదర్శకత పాటించేందుకు కట్టుబడి ఉన్నట్లు వివరించింది. జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియను త్వరలో ప్రారంభిస్తామని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ శనివారం తెలిపారు. ఇటీవల జమ్మూకశ్మీర్‌లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారని చెప్పారు.

దశల వారీగా పోలింగ్ గణాంకాలు

దశ	లోక్‌సభ స్థానాలు	మొత్తం ఓటర్లు	ఓటు వేసినవారు	ఓటింగ్ శాతం
1	102	16.64 కోట్లు	11 కోట్లు	66.14
2	88	15.86 కోట్లు	10.58 కోట్లు	66.71
3	94	17.24 కోట్లు	11.32 కోట్లు	65.68
4	96	17.71 కోట్లు	12.25 కోట్లు	66.71
5	49	8.96 కోట్లు	5.57 కోట్లు	62.20

రాజ్యాంగాన్ని మార్చేస్తారు: రాహుల్

అమృత్‌సర్: ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నెగ్గితే రాజ్యాంగాన్ని మార్చేస్తారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. అమృత్‌సర్ కాంగ్రెస్ అభ్యర్థి గుర్జీత్ సింగ్ ఔజ్లాకు మద్దతుగా రాహుల్ శనివారం పంజాబ్‌లో తొలిసారిగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇవి సాధారణ ఎన్నికలు కావన్నారు. ఈ ఎన్నికల్లో నరేంద్ర మోదీ, బీజేపీ సీనియర్ నాయకులు రాజ్యాంగాన్ని లక్ష్యంగా చేసుకున్నారన్నారు. స్వతంత్ర భారత దేశ చరిత్రలో తొలిసారిగా బీజేపీ నేతలు బాహాటంగా రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని, మార్చేస్తామని, గిరాటేస్తామని మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. ఈ ఎన్నికలు రెండు సిద్ధాంతాల మధ్య పోరాటమన్నారు. ఒకవైపు రాజ్యాంగాన్ని రద్దు చేస్తామంటున్న మోదీ, బీజేపీ నాయకులు ఉంటే మరోవైపు రాజ్యాంగాన్ని పరిరక్షిస్తున్న కాంగ్రెస్ ఉందన్నారు. గడిచిన పదేళ్లలో దేశంలోని రైతుల కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేసిందేమీ లేదని ఆరోపించారు. రైతులపై దాడులు జరిగాయని, మూడు నల్ల చట్టాలను తెచ్చారని'' వ్యతిరేకంగా ఉద్యమిస్తే రైతులను ఉగ్రవాదులన్నారని రాహుల్ మండిపడ్డారు.

ఇండియా కూటమి అభ్యర్థి గృహ నిర్బంధం

ఆరోపించిన కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని అంబేడ్కర్ నగర్ లోక్‌సభ స్థానానికి శనివారం ఆరోవిడతలో పోలింగ్ జరిగింది. ఈ స్థానం నుంచి ఇండియా కూటమి తరఫున పోటీ చేస్తున్న సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) అభ్యర్థి లాల్జీ వర్మను అధికారులు గృహ నిర్బంధంలో ఉంచారని కాంగ్రెస్, ఎస్పీలు ఆరోపించాయి. ఎన్నికల కమిషన్ కలుగజేసుకోవాలని ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ కోరారు. అధికార బీజేపీ కనుసన్నల్లోనే ఆయన్ను అధికారులు బయటకు రాకుండా చేశారన్నారు. ఓటమి భయంతోనే బీజేపీ ఇలాంటి బెదిరింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు.

మెహబూబాకు ఔట్ గోయింగ్ కాల్స్ కట్

శ్రీనగర్: అధికారులు తన సెల్‌ఫోన్ నుంచి ఔట్ గోయింగ్ కాల్స్ ఆపేశారని పీడీపీ నేత మెహబూబా ముఫ్తీ ఆరోపించారు. శుక్రవారం సాయంత్రం మొదలై శనివారం ఉదయం కూడా ఇదే అసౌకర్యం కొనసాగిందని ఆమె అన్నారు. ఇలా అకస్మాత్తుగా సేవలను ఎందుకు నిలిపివేశారో అర్థం కాలేదని అనంత్‌నాగ్–రాజౌరీ లోక్‌సభ నియోజకవర్గం అభ్యర్థి కూడా అయిన మెహబూబా ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాదు, పోలింగ్ వేళ నియోజకవర్గంలోని తమ కార్యకర్తలు, పోలింగ్ ఏజెంట్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. బాధితుల కుటుంబాలతో కలిసి ఆమె బిజ్‌బెహరా పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలపగా అనంత్‌నాగ్ ఎస్ఎస్పీ, దక్షిణ కశ్మీర్ డీఐజీ ఆదేశాల మేరకే అరెస్టులు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారన్నారు. ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని, చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నామని మెహబూబా తెలిపారు.



లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా శనివారం జరిగిన ఆరో విడత పోలింగ్‌లో ఢిల్లీలో ఓటేసిన రాష్ట్రపతి ముర్ము, ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్, విదేశాంగ మంత్రి జై శంకర్, ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్, సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంక, కేజ్రీవాల్



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ దంపతులు



సీపీఎం నేతలు బృందా కారత్, ప్రకాశ్ కారత్

ఆరో విడతలో 61.11 శాతం

- ఆరు రాష్ట్రాలు, రెండో యూటీల్లోని 58 లోక్‌సభ స్థానాల్లో ముగిసిన పోలింగ్
- జూన్ 1న తుది విడతలో 57 స్థానాలకు పోలింగ్, 4న ఫలితాల వెల్లడి

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా శనివారం ఆరో విడతలో 58 లోక్‌సభ స్థానాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. కడపటి సమాచారం అందేసరికి 61.11 శాతం పోలింగ్ నమోదైంది. పశ్చిమబెంగాల్లో అక్కడక్కడా చెదురుమదురు ఘటనలు, ఢిల్లీలో ఒకట్రెండు చోట్ల ఈవీఎంలు మొరాయించడం మినహా పోలింగ్ సజావుగా సాగింది. ఈ విడతలో కూడా బెంగాల్లోనే అత్యధికంగా 79.40 శాతం పోలింగ్ నమోదైంది. జార్ఖండ్‌లో 63.76 శాతం, ఒడిశాలో 69.32, హరియాణాలో 60.06, ఢిల్లీలో 57.67, బిహార్లో 55.24, యూపీలో 54.03 శాతం పోలింగ్ జరిగింది. జమ్మూకశ్మీర్లోని అనంత్‌నాగ్–రాజౌరీ లోక్‌సభ స్థానంలో 54.15 శాతం పోలింగ్ జరగడం విశేషం. అక్కడ గత కొన్ని దశాబ్దాల్లో ఇదే అత్యధికం. దీంతో జమ్మూకశ్మీర్‌లో పోలింగ్ ప్రక్రియ ముగిసింది. అక్కడి 5 లోక్‌సభ స్థానాల్లో కలిసి 58 శాతం పోలింగ్ నమోదైంది. ఇది గత 40 ఏళ్లలో అత్యధికమని ఈసీ పేర్కొంది. అక్కడి బారాముల్లా (59 శాతం), శ్రీనగర్ (34.4 శాతం) స్థానాల్లోనూ ఈసారి అత్యధిక పోలింగ్ నమోదైంది. ఒడిశాలో 6 లోక్‌సభ స్థానాలతో పాటు వాటి పరిధిలోని 42 అసెంబ్లీ స్థానాలకు కూడా పోలింగ్ జరిగింది. శనివారంతో 28 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలోని 486 లోక్‌సభ స్థానాల్లో పోలింగ్ ముగిసింది. మిగిలిన 57 స్థానాలకు జూన్ 1న చివరిదైన ఏడో విడతలో పోలింగ్ జరగనుంది. జూన్ 4న ఫలితాలు వెల్లడవుతాయి.

ఓటేసిన ప్రముఖులు

రాజధాని ఢిల్లీలోని మొత్తం ఏడు లోక్‌సభ స్థానాలకూ ఈ విడతలోనే పోలింగ్ జరిగింది. దాంతో ప్రముఖులంతా ఓటింగ్‌కు తరలి వచ్చారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, కేంద్ర మంత్రులు ఎస్.జైశంకర్, హర్దీప్‌సింగ్ పురి, కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్, కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ వద్రా దంపతులు, హరియాణా సీఎం నయాబ్‌సింగ్ సైనీ తదితరులు ఓటు వేశారు. ప్రియాంక కూతురు మిరాయా తొలిసారి ఓటేశారు. కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ ఆప్‌కు ఓటేయగా... ఆప్ చీఫ్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ దంపతులు కాంగ్రెస్‌కు ఓటేయడం విశేషం. సోనియా, రాహుల్ ఓటేసిన న్యూఢిల్లీ లోక్‌సభ స్థానంలో ఆప్, కేజ్రీవాల్‌కు ఓటున్న చోట చాందినీచౌక్ స్థానంలో కాంగ్రెస్ బరిలో ఉండటమే ఇందుకు కారణం. ఢిల్లీలో రెండు పార్టీలూ కలిసి పోటీ చేస్తుండటం తెలిసిందే.

బెంగాల్లో బీజేపీ అభ్యర్థిపై దాడి!

బెంగాల్లోని ఝార్‌గ్రాంలో తృణమూల్ కార్యకర్తలు తన కాన్వాయ్‌పై దాడికి పాల్పడ్డారని బీజేపీ అభ్యర్థి ప్రణత్ తుడు ఆరోపించారు. తనతో పాటు భద్రతా సిబ్బందికి గాయాలైనట్లు తెలిపారు. బీజేపీ ఖుర్దా అసెంబ్లీ అభ్యర్థి, చిలికా సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రశాంత్ జగ్‌దేవ్ తన అనుచరులతో పాటు ఓ పోలింగ్ బూత్‌లోకి చొరబడి ఈవీఎంను పగలగొట్టారు. పోలింగ్ అధికారిని తీవ్రంగా గాయపరిచారు. ఆయనను పోలీసులు అరెస్టు చేశారు.

మీ ఇంటిని చక్కదిద్దుకోండి..!

- సమస్యల్ని పరిష్కరించుకునే సత్తా మాకుంది
- పాక్ నేత 'శాంతి' వ్యాఖ్యలకు బదులిచ్చిన కేజ్రీవాల్

న్యూఢిల్లీ: పాకిస్తాన్‌లో ఇమ్రాన్ ఖాన్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న చౌదరి ఫవాద్ హుస్సేన్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో భారత్‌లో విద్వేషం, ఉగ్రవాద శక్తులను శాంతి సామరస్యాలు ఓడించాలని ఆకాంక్షించారు. దీనికి ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ దీటైన సమాధానమిచ్చారు. 'చౌదరి సాహిబ్, నేను, మా దేశ ప్రజలకు సమస్యల్ని పరిష్కరించుకునే సమర్థత ఉంది. మీ ట్వీట్ అవసరం లేదు. పాకిస్తాన్‌లో ప్రస్తుతం పరిస్థితులు ఏమాత్రం బాగోలేవు. మీ దేశం సంగతి చూసుకోండి. ఎన్నికలు భారత్ అంతర్గత వ్యవహారం. ఉగ్రవాదానికి అతిపెద్ద స్పాన్సర్‌గా ఉన్న పాకిస్తాన్ మా వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటే సహించబోం'అని హెచ్చరించారు. ఆ తర్వాత కేజ్రీవాల్ అభిప్రాయాలపై చౌదరి ఫవాద్ హుస్సేన్ స్పందించారు. 'ఉగ్రవాదానికి సరిహద్దులతో సంబంధంలేదు. పాక్‌లో ప్రస్తుతం పరిస్థితులు బాగానే ఉన్నాయి. మెరుగైన సమాజం కావాలనే ఎవరైనా కోరుకుంటారు'అని పేర్కొన్నారు. ఈ పరిణామంపై బీజేపీ స్పందించింది. 'ఆప్ నేత అవినీతి రాజకీయాలకు పాక్ నుంచి కూడా వంతపాడుతున్నారు. ఢిల్లీలో ఎన్నికలు జరుగుతున్న ప్రతిసారీ పాక్ నుంచి స్పందిస్తుంటారు. దేశ శత్రువులతో కేజ్రీవాల్ అంటకాగుతున్నారనడానికి ఇదే రుజువు' ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ పేర్కొన్నారు.

చైనా ఆక్రమణలపై మోదీ మౌనం

కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఎద్దేవా

సిమ్లా: చైనా భారత భూభాగాన్ని ఆక్రమించి ఇళ్లు, రోడ్లు నిర్మిస్తోందని, అయినా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనంగా ఉన్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని రొహ్రూలో శనివారం ఎన్నికల సభలో మాట్లాడుతూ '56 అంగుళాల ఛాతి ఎటుపోయింద'ని ఎద్దేవా చేశారు. దేశ ప్రజలను, రాజ్యాంగాన్ని కాపాడటానికి కాంగ్రెస్ పార్టీ పోరాడుతోందన్నారు. రాజ్యాంగాన్ని రక్షించకపోతే దాని ద్వారా అందిన ప్రజాస్వామ్యం, హక్కులను లాగేసుకుంటారని అన్నారు. మోదీ ప్రభుత్వం ధనవంతుల కొమ్ముకాస్తుందని, కాంగ్రెస్ పేదల పక్షాన నిలబడుతుందని పేర్కొన్నారు.

వాగులోకి నడిపించిన

గూగుల్ మ్యాప్

- కేరళలో నీట మునిగిన కారు
- నలుగురు హైదరాబాదీలకు తప్పిన ప్రాణాపాయం

కొట్టాయం: కేరళలోని కొట్టాయం జిల్లాలో పెను ప్రమాదం తప్పింది. నలుగురు హైదరాబాదీలు అదృష్టవశాత్తూ ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్ నుంచి కేరళ పర్యటనకు వచ్చిన నలుగురు మిత్రులు శుక్రవారం అర్ధరాత్రి తర్వాత గూగుల్ మ్యాప్ ఆధారంగా దారి తెలుసుకుంటూ కారులో అళప్పుజాకు బయలుదేరారు. భారీ వర్షం కురుస్తుండడంతో రహదారిపై నీరు నిలిచిపోయింది. వారికి ఈ ప్రాంతం కొత్త కావడంతో గూగుల్ మ్యాప్ ఆధారంగా అలాగే ముందుకెళ్లారు. దాంతో కురుప్పంతార గ్రామం వద్ద కారు రోడ్డు పక్కనే ఉన్న వాగులోకి దూసుకెళ్లింది. వాగులో నీటి ప్రవాహం ఉధృతంగా ఉండడంతో కారు క్రమంగా మునిగిపోసాగింది. దాంతో వారు గట్టిగా కేకలు వేశారు. అక్కడే పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసుతోపాటు స్థానికులు వెంటనే అప్రమత్తమై కారు డోర్లు తెరిచారు. కారులోని నలుగురు వ్యక్తులు ఈదుకుంటూ క్షేమంగా ఒడ్డుకు చేరుకున్నారు. కారు పూర్తిగా నీటమునిగింది. అనంతరం క్రేన్ సాయంతో పోలీసులు కారును బయటకు తీశారు. బాధితుల్లో ఒక మహిళ ఉన్నారు.

రాజ్‌కోట్‌లో పెను విషాదం

- టీఆర్‌పీ గేమ్ జోన్‌లో భారీ అగ్ని ప్రమాదం
- నలుగురు చిన్నారులు సహా 27 మంది మృతి



రాజ్‌కోట్: గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో పెను విషాదం చోటుచేసుకుంది. వేసవి సెలవులు, వారాంతం కూడా కావడంతో సరదాగా ఆడుకునేందుకు వెళ్లిన నలుగురు చిన్నారులు సహా మొత్తం 27 మంది అగ్ని ప్రమాదానికి బలయ్యారు. నానా–మవా రోడ్డులోని టీఆర్‌పీ గేమ్ జోన్‌లో సాయంత్రం 4.30 గంటల సమయంలో ప్రమాదం చోటుచేసుకుంది. అందరూ ఆటల్లో మునిగి ఉన్న వేళ ఆ ప్రాంతాన్ని ఒక్కసారిగా మంటలు చుట్టుముట్టాయి. దీంతో, అందులో చిక్కుకుపోయిన వారంతా హాహాకారాలు చేశారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని దాదాపు ఐదుగంటలపాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. ప్రమాదంతోపాటు బలమైన గాలులు వీస్తున్న కారణంగా ఫైబర్ డోమ్ పూర్తిగా కుప్పకూలింది. దీంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది. శిథిలాలను యుద్ధ ప్రాతిపదికన తొలగిస్తున్నట్లు రాజ్‌కోట్ కలెక్టర్ ప్రభావ్ జోషి చెప్పారు. ఇప్పటి వరకు 27 మృతదేహాలను వెలికితీశామన్నారు. పూర్తిగా కాలిపోయి గుర్తుపట్టడానికి కూడా వీలు లేకుండా ఉన్నాయన్నారు. మృతదేహాలను, క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రులకు తరలించామని చెప్పారు. ఘటన నేపథ్యంలో నగర వ్యాప్తంగా ఉన్న గేమింగ్ జోన్లు అన్నిటినీ వెంటనే మూసివేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. ప్రమాదం సంభవించిన గేమ్ జోన్‌లో తక్షణమే సహాయ కార్యక్రమాలను చేపట్టాలని యంత్రాంగాన్ని ఆదేశించినట్లు సీఎం భూపేంద్ర పటేల్ తెలిపారు. ఘటనకు దారి తీసిన కారణాలపై సిట్‌తో ప్రత్యేక విచారణ చేయిస్తామన్నారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేలు పరిహారంగా ప్రకటించారు. కాగా, రాజ్‌కోట్‌లో విషాద ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

యజమాని అరెస్ట్

టీఆర్‌పీ గేమ్ జోన్ యజమాని యువరాజ్ సింగ్ సోలంకీ, మేనేజర్‌తోపాటు మొత్తం ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

సాక్షి
కరీంనగర్
ఆదివారం । 26 । మే । 2024



అభిషేక ప్రియుడికి దండాలు

వేములవాడ: రాజన్నను శనివారం భారీ సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. భక్తుల ద్వారా రూ.25లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



అ'విశ్రాంత' సాహిత్యం

బిందువంత పదంలో సింధువంత భావాన్ని ఇముడ్చుకుంటుంది సాహిత్యం. విత్తనమంత అక్షరంలో వృక్షమంత అర్థాన్ని పొదుపుకుంటుంది కవిత్వం. 8లో▸

గరిష్టం/కనిష్టం
42.0/22.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వాతావరణం చల్లగా ఉంటుంది. జిల్లాలో చిరుజల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

తుమ్మేటి సమ్మిరెడ్డికి షోకాజ్



కరీంనగర్ కార్పొరేషన్/జమ్మికుంట: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డికి కాంగ్రెస్ పార్టీ షోకాజు నోటీసు జారీచేసింది. జమ్మికుంట పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కసుబోజుల వెంకన్న, ఒల్లాల శ్రీనివాస్, ఎండీ సలీం, ఎండీ ఇమ్రాన్, ఎండీ సలీంపాషా, వాసాల రామస్వామిలను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ ప్రకటించారు. హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఒడితెల ప్రణవ్ బాబుపై ఉద్దేశపూర్వకంగా చేసిన విమర్శలు, కక్షపూరితంగా చేసిన అసందర్భ ఆరోపణలపై స్థానిక కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ద్వారా అందిన ఫిర్యాదు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ పార్టీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ఈ నాయకులపై పీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ జి.చిన్నారెడ్డి ఆదేశం మేరకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలె



అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో శ్రీనివాస్

కరీంనగర్‌రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులు వచ్చేనెల 5 వరకు పూర్తిచేయాలని కరీంనగర్ రూరల్ మండల ప్రత్యేక అధికారి, జెడ్పీ సీఈవో ఎం.శ్రీనివాస్ ఆదేశించారు. శనివారం మండలంలోని జూబ్లీనగర్‌లోని జెడ్పీ, మండల పరిషత్ పాఠశాలల్లో చేపట్టిన పనులు పరిశీలించారు. హెచ్‌ఎంలు, ఏఏపీసీ చైర్మన్లతో సమీక్షించారు. ఆయా పాఠశాలల్లో 50 శాతం నుంచి 60 శాతం వరకు పూర్తయ్యాయని, మిగతా పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంజీవరావు, ఎంఈవో మధుసూధనాచారి, ఐకేపీ ఏపీఎం భార్గవ్, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కరీంనగర్: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగినట్లు డీఐఈవో జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఫస్టియర్ జనరల్‌లో 1,941 మంది విద్యార్థులకు 178 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. వొకేషనల్‌లో 115 మంది విద్యార్థులకు 16 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. సెకండియర్ జనరల్‌లో 273 మందికి 22 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. వొకేషనల్ విభాగంలో 74 మంది విద్యార్థులకు ఆరుగురు గైర్హాజరయ్యారు.

అనుమతి లేకుండా స్కూళ్లు ప్రారంభించొద్దు

కరీంనగర్: ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రైవేట్ యాజమాన్యాలు కొత్తగా పాఠశాలలు ప్రారంభించవద్దని డీఈవో జనార్దన్‌రావు ప్రకటనలో తెలిపారు. అనుమతి ఉత్తర్వులు లేకుండా ప్రచారం చేయొద్దని సూచించారు. హోర్డింగ్స్, ఫ్లెక్సీలు, బ్రోచర్స్‌తో ప్రచా రం చేయొద్దని, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కానీ ప్రచా రం నిర్వహించొద్దని సూచించారు. నిబంధనల కు విరుద్ధంగా పాఠశాలలను ప్రారంభిస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్: టీఎస్‌డబ్ల్యూ ఆర్ జూనియర్ కళాశాలలో జనరల్–ఒకేషనల్ కోర్సుల్లో ఇంటర్ 2024–25 మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం అర్హతగల అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమన్వయాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈనెల 31 వరకు గురుకుల సొసైటీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఒకేషనల్ కోర్సుల్లో సీట్లు ఉన్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు www.trwreir.ac.in లో ఈనెల 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నిర్లక్ష్యంపై కొరడా

కరీంనగర్: 'అమ్మ' ఆదర్శ పాఠశాల పథకంలో భా గంగా జిల్లాలోని పాఠశాలల్లో జరుగుతున్న పనుల్లో నిర్లక్ష్యం వహించిన నలుగురు ఉపాధ్యాయులపై వి ద్యాశాఖ కొరడా ఝుళిపించింది. ఎస్.ప్రభావతి, జెడ్పీ హెచ్‌ఎస్ ఉప్పురమల్యాల(గంగాధర), రాజేంద్రప్రసాద్, హెచ్‌ఎం, జెడ్పీహెచ్‌ఎస్ చిగురుమామిడి కాంప్లెక్స్, చిగురుమామిడి మండలం ముదిమాణిక్యం ఎంపీపీఎస్ హెచ్‌ఎం, ముదిమాణిక్యం జెడ్పీ హెచ్‌ఎస్ హెచ్‌ఎం కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప నుల్లో నిర్లక్ష్యంపై వివరణ ఇవ్వాలని డీఈవో జనార్దన్‌రావు మెమోలు జారీ చేశారు.

బుక్ చేస్తే.. బ్లాక్ మార్కెట్‌కే!

నగరంలోని సంతోష్‌నగర్‌కు చెందిన వెంకటరాములు ఇండియన్ గ్యాస్ వినియోగదారుడు. గ్యాస్‌కోసం బుక్ చేస్తే ఇంటికి రాకపోగా డెలివరీ అయినట్లు తన మొబైల్‌కు మెసేజ్ వచ్చింది. ఖంగుతిన్న వెంకటరాములు గణేశ్‌నగర్‌లోని గ్యాస్ ఏజెన్సీని సంప్రదించగా నిర్లక్ష్యపు సమాధానమిచ్చారు. దీంతో సేల్స్ ఆఫీసర్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయగా మూడురోజుల తర్వాత గ్యాస్ సిలిండర్ డెలివరీ చేశారు. ఇది ఒక వెంకటరాములు సమస్యే కాదు. జిల్లాలోని వేలాది మందిది ఇదే పరిస్థితి.

- రాయితీ సిలిండర్ పక్కదారి!
- గ్యాస్ ఏజెన్సీల మాయాజాలం
- తమకేమీ పట్టనట్లుగా అధికారుల తీరు
- చర్యలు తీసుకోవాలని డిమాండ్

కరీంనగర్ అర్బన్:

రాయితీ సిలిండర్లు పక్కదారి పడుతున్నట్లు ఇటీవల 'సాక్షి'లో కథనం ప్రచురితం కాగా పౌరసరఫరాల శాఖ అధికారులు నగరంలో మెరుపుదాడులు నిర్వహించారు. దీంతో కుప్పలు కుప్పలుగా రాయితీ గ్యాస్ సిలిండర్లు బయటపడ్డాయి. అయితే అధికారులు ఒకరోజు హడావుడి చేస్తూ మమ అనిపించడమే తప్ప రాయితీ గ్యాస్ సిలిండర్లు నల్లబజారుకు ఎలా తరలుతున్నాయని తెలుసుకోలేకపోతున్నారు. నగరంలో 11 గ్యాస్ ఏజెన్సీలు ఉండగా కొన్ని ఏజెన్సీల నిర్వాహకులు వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. మహాలక్ష్మి సిలిండర్లను పక్కదారి పట్టిస్తున్నారు. పత్రికల్లో కథనాలు వస్తే తప్ప.. తమకేమీ పట్టనట్లుగా అధికార యంత్రాంగం వ్యవహరిస్తున్న తీరు పలు అనుమానాలకు తావిస్తోంది.

ఏజెన్సీలకు వరంగా..

మహాలక్ష్మి పథకం ద్వారా ప్రభుత్వం రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తోంది. వినియోగదారుడు రూ.879 చెల్లిస్తుండగా ప్రభుత్వం రూ.500 నగదును వినియోగదారు ఖాతాలో జమచేస్తోంది. దీనిని అనువుగా చేసుకుంటున్న గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు కార్డుదారులతో ఒప్పందం కుదుర్చుకొని టిఫిన్ సెంటర్లు, దాబాలు, రెస్టారెంట్లు, బేకరీలు, జిలేబీ కేంద్రాలకు తరలిస్తున్నారు. వినియోగదారులకు చేరాల్సిన సిలిండర్లు నేరుగా వ్యాపార కేంద్రాలకు చేరుతున్నాయి. కమర్షియల్ సిలిండర్ ధర రెండు వేలకుపైగా ఉండటం వంటగ్యాస్ సిలిండర్ రూ.900 లభిస్తుండటంతో వేల సిలిండర్లు పక్కదారి పడుతున్నాయి. సదరు వ్యాపారం ఎప్పుడు ఇలాగే సాగేలా భారీ మొత్తంలో మామూళ్లు ముడుతున్నట్లు సమాచారం.

బుక్‌చేస్తే నల్లబజారుకే..

వినియోగదారుడు గ్యాస్‌కోసం బుక్‌చేస్తే రెండ్రోజుల్లోనే ఇంటికి చేరాల్సి ఉంటుంది. కాగా డెలివరీ అయినట్లు సైతం మెసేజ్ వస్తోంది. కస్టమర్లు ఇదేంటని ఏజెన్సీకి వెళ్లి ప్రశ్నిస్తే మళ్లీ పంపిస్తున్నారు. కొందరు తమకు సంబంధం లేదంటూ దురుసుగా వ్యవహరిస్తుండగా సేల్స్ ఆఫీసర్లకు ఫిర్యాదు చేస్తే తప్ప గ్యాస్ సిలిండర్ డెలివరీ చేయడం లేదు. జిల్లాలో వేలాదిమంది సమస్యను ఎదుర్కొంటున్నా తనిఖీలు అంతంత మాత్రమే చేపడుతున్నారు.



to me

I have booked lpg cylinder and I made payment on line
Tax invoice was issued on 21-01-2024.
I have also received a msg on 23-01-2024 stating that your order is delivered
But lpg cylinder not delivered to me
You are not responding for phone calls
Your invoice also not showing any contact number for the best reasons known to you
I understand that as I have pre-paid the amount you are not paying attention to deliver the cylinder
This amounts to misconduct and cheating the customer
If you don't take steps to deliver cylinder I may have to raise a complaint before proper authority
Venkata Ramulu V
9492204086
Karimnagar

గ్యాస్ సిలిండర్ కోసం ఆన్‌లైన్‌లో బుక్ చేసిన వివరాలు

నిబంధనలివే..

గ్యాస్ ఏజెన్సీల ద్వారా వంటగ్యాస్, కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తుంటాయి. వంటగ్యాస్ సిలిండర్లను బుక్ చేసుకున్న తర్వాత వినియోగదారుడు ఇంటికి డెలివరీ బాయ్స్ చేర్చాలి. 5 కిలోమీటర్లలోపు దూరం ఉంటే ఉచితంగా అందించాలి. వంటగ్యాస్ సిలిండర్లను నివాసాలకే చేర్చాలి. కమర్షియల్ సిలిండర్లను వ్యాపార కేంద్రాలకు సరఫరా చేయాలి. కానీ వంటగ్యాస్ సిలిండర్లను రాత్రి, వేకువజామున నేరుగా టిఫిన్ సెంటర్లు, పెద్ద హోటళ్లకు తరలిస్తున్నారు. వంటగ్యాస్ పక్కదారి పడితే చర్యలు తీసుకుంటామని, నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని డీఎస్‌వో సురేశ్‌రెడ్డి వివరించారు.



డీలర్ వద్దే విత్తనాలు కొనాలి

కొత్తపల్లి(కరీంనగర్): ప్రభుత్వ అనుమతి గల అధీకృత డీలర్ వద్దనే విత్తనాలు కొనాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్ తెలిపారు. కొత్తపల్లి మండలం చింతకుంటలోని రైతు సంఘం సమావేశ మందిరంలో శనివారం విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించారు. విత్తనాలు కొన్న సమయంలో బిల్లులు తీసుకోవాలని సూచించారు. బిల్లుపై కంపెనీ పేరు, విత్తన రకం, బ్యాచ్ నంబర్, లాట్ నంబర్, ధర ఉండేలా చూసుకోవాలన్నారు. విత్తన ప్యాకెట్‌పై తయారైన తేదీ, ఎక్స్‌పైరీ తేదీలను సరిచూసుకోవాలని సూచించారు. పక్క రాష్ట్రాల నుంచి వచ్చి విత్తనాలు విక్రయిస్తే వ్యవసాయాధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. చింతకుంట రైతు సంఘం అధ్యక్షుడు ఎస్.శంకరయ్య, ఏఈవో రాము, రైతులు పాల్గొన్నారు.

ఇయ్యాల నగరంలో పవర్ కట్

కొత్తపల్లి: విద్యుత్ లైన్ల నిర్వహణ, తీగలకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపు పనులు కొనసాగుతున్నందున ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి 11 గంటల వరకు తెలంగాణ చౌక్ ఫీడర్ పరిధిలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, కశ్మీర్‌గడ్డ, ముకరంపుర ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ 2 ఏడీఈ ఎం.సుధీర్ కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు శ్రీనివాస థియేటర్, షాషామహల్, పద్మశాలీ స్ట్రీట్, మధుగార్డెన్, ఆటోనగర్, కేబుల్ బ్రిడ్జి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని టౌన్–1 ఏడీఈ నరేందర్ వివరించారు.

ఆలస్యం.. అవకాశం

- స్థానిక సంస్థల ఎన్నికల జాప్యంతో అనర్హులకు ఊరట
- ఈ నెలాఖరుతో అనర్హత వేటు గడువు పూర్తి
- ఉమ్మడి జిల్లాలో 5వేల మంది పోటీకి అవకాశం



తాహెర్‌కొండాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం

ఉమ్మడి జిల్లాలో అనర్హుల వివరాలు

జిల్లా	వార్డు సభ్యులు	సర్పంచులు	ఎంపీటీసీలు	జెడ్పీటీసీలు
కరీంనగర్	1,295	115	145	07
జగిత్యాల	1,348	153	116	10
పెద్దపల్లి	1,104	96	79	10
రాజన్న సిరిసిల్ల	481	46	47	03

కరీంనగర్‌రూరల్: 'ఆలస్యం అమృతం విషం' అనే సామెత కొంతమందికి విషం కాగా.. రాజకీయ నాయకులకు మాత్రం అమృతంగా మారింది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఆలస్యం కావడంతో అనర్హతకు గురైన అభ్యర్థులు మళ్లీ పోటీచేసే అవకాశం కలిగించింది. లోక్‌సభ ఎన్నికల కారణంగా సర్పంచు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ మరింత ఆలస్యమయ్యే అవకాశముంది. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను ఆగస్టులో నిర్వహించే అవకాశముందనే సమాచారం అనర్హులకు ఆనందం కలిగిస్తోంది. ఎన్నికల్లో పాల్గొనకుండా విధించిన నిషేధ కాలపరిమితి ఈ నెలాఖరుతో ముగిసిపోతోంది. దీంతో వీరికి పోటీ చేసే అవకాశం కలుగుతోంది. పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ఫిబ్రవరి 1న ముగియడంతో గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైంది. జూలై 4న ఎంపీటీసీ, జెడ్పీటీసీల పదవీకాలం ముగియనుంది.

ఐదువేల మందిపై..

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులందరూ తప్పనిసరిగా లెక్కలు చూపెట్టాలి. అయితే కొందరు సకాలంలో లెక్కలు అప్పగించకుంటే మళ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులయ్యారు. 2019 జనవరిలో పంచాయతీ, మే నెలలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో 1,212 పంచాయతీల్లోని సర్పంచులు, 12,045 మంది వార్డు సభ్యులు, 52 మంది జెడ్పీటీసీ సభ్యులు, 646 మంది ఎంపీటీసీ సభ్యులు ఎన్నికయ్యారు. ఎన్నికల ఫలితాలు ప్రకటించిన 45 రోజుల్లోపు పోటీ చేసిన అభ్యర్థులందరూ ఎన్నికల ఖర్చు వివరాలను అధికారులకు సమర్పించాలి. అయితే ఖర్చుల నివేదికపై అవగాహన లేకపోవడంతోపాటు మరోసారి పోటీ చేయమనే ఆలోచనతో పలువురు అభ్యర్థులు లెక్కలు అప్పగించలేదు. అధికారులు పలుమార్లు నోటీసులు జారీ చేసినా స్పందించకపోవడంతో 2021 సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో 5,055 మందిపై అనర్హత వేటు పడింది. ఇందులో వార్డు మెంబర్ అభ్యర్థులు 4,228, సర్పంచ్ అభ్యర్థులు 410, ఎంపీటీసీ అభ్యర్థులు 387, జెడ్పీటీసీ అభ్యర్థులు 30 మంది ఉన్నారు.

ఈ నెలాఖరుతో గడువు ముగింపు

అనర్హత వేటుకు గురైన అభ్యర్థులకు మళ్లీ పోటీ చేసే అవకాశం కలిగింది. అనర్హత నోటీసులు జారీ చేసినప్పటి నుంచి మూడు సంవత్సరాలు ఎలాంటి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేదు. వార్డుసభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు ఈ నెలాఖరుతో అనర్హత వేటు కాలం ముగుస్తోంది. షెడ్యూల్ ప్రకారం సర్పంచు ఎన్నికలు నిర్వహిస్తే అనేకమంది పోటీచేసే అవకాశం కోల్పోయేవారు. లోక్‌సభ ఎన్నికల నిర్వహణతో స్థానిక సంస్థల ఎన్నికలు ఆగస్టులో నిర్వహించే అవకాశముండటంతో నిషేధం గడువు తీరిపోయి అభ్యర్థులకు మళ్లీ పోటీ చేసే అదృష్టం కలిసివచ్చింది.

లక్ష్యం చేరేవరకు విశ్రమించొద్దు

- కలెక్టర్ పమేలా సత్పతి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్: లక్ష్యం చేరేవరకు విశ్రమించొద్దని కలెక్టర్ పమేలా సత్పతి విద్యార్థులకు సూచించారు. కరీంనగర్ బొమ్మకల్ బైపాస్ రోడ్డులోని వీ–కన్వెన్షన్‌హాల్‌లో వెంకట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం గంప వజ్రమ్మ మూడో విద్యాపురస్కార్ నిర్వహించారు. కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై 10 జీపీఏ సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.3వేల నగదు, గోల్డ్ మెడల్ అందజేశారు. మంచిఫలితాలు సాధించిన విద్యార్థులకు వెంకట్ ఫౌండేషన్ సాయం చేయడం అభినందనీయమన్నారు. పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో లక్ష్యం సాధించాలన్నారు. అనంతరం హెచ్‌ఎంలను సన్మానించారు. సివిల్స్ ర్యాంకర్లు నందాల సాయికిరణ్, కొలనుపాక సహన, ఫౌండేషన్ చైర్మన్ గంప వెంకట్, వైస్ ప్రెసిడెంట్ జయరాములు, సెక్రటరీ సతీశ్‌కుమార్, ప్రతినిధులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేక కృషి

మహిళల ఆర్థిక అభివృద్ధికి సర్కారు ప్రత్యేకంగా కృషి చేస్తుందని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్‌లోని భాగ్యనగర్, సరస్వతినగర్‌లో మెప్మా ఆధ్వర్యంలో నడుస్తున్న కుట్టు కేంద్రాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా స్కూల్ యూనిఫామ్స్ కుట్టే ప్రక్రియను పరిశీలించారు. దారం కట్ కాకుండా డబుల్ స్టిచ్చింగ్ చేసి, ఏడాది పాటు ఉండేలా యూనిఫామ్స్ తయారు చేయాలన్నారు. స్కూల్ పిల్లలకు అవసరమయ్యే జ్యూట్ బ్యాగులు తయారు చేయాలని సూచించారు. పాఠశాలలు ప్రారంభం రాగానే విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, యూనిఫామ్స్ అందిస్తామని తెలిపారు. ఇన్‌చార్జి మెప్మా పీడీ స్వరూపారాణి, డీఎంసీ శ్రీవాణి, టీఎంసీ అనిత తదితరులు పాల్గొన్నారు.

వెయ్యేళ్ల విగ్రహాలు.. చరిత్రకు సాక్ష్యాలు



శివుని విగ్రహానికి పూజలు చేస్తున్న హనుమాన్ భక్తుడు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరులో వెయ్యేళ్ల నాటి దేవతల రాతి విగ్రహాలు శనివారం వెలుగులోకి వచ్చాయి. కాకతీయుల కాలం నాటి చరిత్రకు ఆనవాళ్లుగా రాతి శిల్పాలు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. నాలుగు నూర్ల గుడులతో నగునూరుగా మారిన ఈ గ్రామంలో ఇంకా రాతి విగ్రహాలు బయటపడుతుండటం విశేషం. స్థానికుల కథనం ప్రకారం.. నగునూరు పంచాయతీ పరిధి పాపగారిపల్లె గుట్టపై పురాతన విగ్రహాలున్నాయనే సమాచారంతో కొందరు హనుమాన్ దీక్షాపరులు శనివారం గుట్టపైకి వెళ్లారు. ఒక పెద్ద బండపై నాలుగు చేతుల్లో ఢమరుకం, త్రిశూలంతో ఉన్న శివుని విగ్రహం, నాట్యం చేస్తున్న దేవత విగ్రహంతోపాటు నాగదేవత శిల్పాలు కన్పించాయి. బండరాళ్లపై చెక్కిన ఈ విగ్రహాలకు హనుమాన్ భక్తులు రంగులు వేసి క్షీరాభిషేకం చేశారు. కాగా, ఈ ప్రాంతంలో గతంలో ఆలయం ఉండవచ్చని గ్రామస్తులు భావిస్తున్నారు.

ఫలించిన చర్చలు



బీడీలు చుడుతున్న కార్మికులు

- బీడీ కార్మికుల వేతనాల పెంపు
- రూ.4.25కు కుదిరిన ఒప్పందం
- కరువు భత్యం..బోనస్ అదనం

కోరుట్ల/గంభీరావుపేట : బీడీ కార్మికుల వేతనపెంపు చర్చలు సఫలమయ్యాయి. హైదరాబాద్‌లో శనివారం బీడీ కార్మిక సంఘాలు, యాజమాన్యాల మధ్య చర్చలు జరిగాయి. కార్మికులు, ప్యాకర్స్, చెక్కర్ల వేతనాల పెంపునకు ఒప్పందం కుదిరింది. రెండేళ్ల క్రితం జరిగిన వేతన ఒప్పందం ఈ ఏడాది ఏప్రిల్‌తో ముగిసింది. కొత్త వేతన ఒప్పందం 2024 మే నుంచి అమల్లోకి రానున్నట్లు బీడీ కార్మిక సంఘాలు ప్రకటించాయి.

వెయ్యి బీడీలకు రూ.4.25 పెంపు

కొత్త వేతన ఒప్పంద ప్రకారం బీడీ కార్మికులకు రూ.4.25 మేర వేతనం పెరగనుంది. ఇదివరకు ఉన్న మూలవేతనంపై ఈ పెంపు ఉండనుంది. దీనికి కరువు భత్యం, బోనస్ అదనం. వాస్తవానికి బీడీ కార్మిక సంఘాలు వెయ్యి బీడీలకు కనీసం రూ.10 నుంచి రూ.15 పెంచాలని డిమాండ్ చేయగా.. యాజమాన్యాలు ససేమిరా అన్నట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4.50లక్షల మంది బీడీ కార్మికులు ఉన్న క్రమంలో అంతమొత్తం పెంచితే భారం పడుతుందని బీడీ తయారీ అసోసియేషన్ ప్రతినిధులు అభిప్రాయపడినట్లు సమాచారం. కనీసం రూ.8వరకైనా పెంచాలని కొన్ని కార్మిక సంఘాలు ప్రతిపాదించారు. చివరగా వెయ్యి బీడీలపై రూ.4.25 పెంపునకు ఇరుపక్షాల మధ్య ఒప్పందం కుదరడంతో చర్చలు సఫలమైనట్లు ప్రకటించారు. ప్రస్తుతం వెయ్యి బీడీలకు రూ.245.08 చెల్లిస్తున్నారు. పెరిగిన రూ.4.25తోపాటు కరువు భత్యం, బోనస్ కలిపి వేతనాలు చెల్లిస్తారు.

ప్యాకర్లు..చెక్కర్లకూ..

బీడీ పరిశ్రమలో పనిచేసే ప్యాకర్లు, చెక్కర్లకు వేతనాల పెంపు ఒప్పందం కుదిరింది. పరిశ్రమలో పనిచేసే ఉద్యోగులకు ప్రస్తుతం ఉన్న వేతనంపై రూ.1,700 పెంచారు. ప్యాకింగ్ కార్మికులకు ప్రస్తుతం ఇస్తున్న వేతనంపై నెలకు రూ.3,650 పెంచారు. బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న టేకేదార్ల కమీషన్ పెంపు చర్చలు పూర్తి కాలేదు. చర్చల్లో బీడీ యాజమాన్య సంఘాల తరఫున అధ్యక్షుడు హితేంద్రఉపాధ్యాయ, జనరల్ సెక్రటరీ ధర్మేంద్రగాంధీ, ప్రతినిధులు రస్మికాంత్‌పటేల్, రామన్‌బాయ్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. బీడీ కార్మిక సంఘాల తరఫున ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి సుతారి రాములు, డిప్యూటీ జనరల్ మహ్మద్ ముక్రం, ఐఎఫ్‌టీయూ తరఫున రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణ, ఎం.నరేందర్, బీఎంఎస్ ప్రతినిధులు కలాల శ్రీనివాస్, సుధీర్‌కుమార్, ఇతర కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సిటీలో చెత్త కనిపించొద్దు

- వారం రోజుల్లో పరిస్థితిలో మార్పురావాలి
- విధులను విస్మరిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు మెమో
- అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ కార్పొరేషన్: 'వారం రోజుల్లోగా పారిశుద్ధ్యం మెరుగు పడాలి...ఎక్కడా చెత్తాచెదారం కనిపించొద్దు..సిటీ క్లీన్‌గా మారాలి...లేదంటే చర్యలు తప్పవు' అంటూ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ హెచ్చరించారు. శనివారం నగరపాలకసంస్థ సమావేశ మందిరంలో అధికారులు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు, సిబ్బందితో రివ్యూ నిర్వహించారు. రెండురోజుల క్రితం తాను పర్యటించిన సమయంలో నగరంలో రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ చెత్త ఉందన్నారు. అప్పుడు క్షేత్రస్థాయిలో లేని శానిటరీ ఇన్‌స్పెక్టర్లందరికీ మెమో జారీ చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు విధిగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. ప్రతీ ఇంటి నుంచి చెత్తను సేకరించాలని, రోడ్లపై చెత్త కనిపించొద్దని ఆదేశించారు. రోడ్లపై చెత్తవేసే వారికి జరిమానా విధించాలన్నారు. మున్సిపల్ చెత్తను, హాస్పిటల్స్ వ్యర్థాలను కలవకుండా, హానికర చెత్తను సురక్షితంగా డిస్పోజ్ చేయాలన్నారు. వారంరోజుల్లోగా నగరం శుభ్రంగా ఉండాలని, ముందుగా మేజర్ డ్రైనేజీల్లో పూడిక తీయాలన్నారు. ప్లాస్టిక్ నిషేధాన్ని పగడ్బందీగా అమలు చేయాలన్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్ నరేశ్, శానిటరీ సూపర్‌వైజర్ రాజమనోహర్, పర్యావరణ ఇంజినీర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పనిచేసే చోటే ప్రాణం పోయింది

● గుండెపోటుతో ఉపాధిహామీ కూలీ మృతి


మంగమ్మ(ఫైల్)

సాక్షి పెద్దపల్లి: పనిచేసే చోటే ఉపాధిహామీ కూలీ ప్రాణం వదిలిన సంఘటన రాఘవాపూర్ గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది. రాఘవాపూర్ గ్రామానికి చెందిన ఉపాధిహామీ కూలీ జొన్నగడ్డల మంగమ్మ(52) ఎప్ప టిలాగే శనివారం గ్రామ శివారులో చేపట్టిన ప నుల వద్దకు వెళ్లింది. పనిచేసే ప్రాంతం వద్ద ఒ క్కసారిగా కుప్పకూలి మృతి చెందింది. మృతురాలికి భర్త దేవేందర్‌తో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. అప్పటివరకు తమతో కలి సి పనిచేసిన మంగమ్మ తమ కళ్ల ముందే హఠాత్తుగా చనిపోవడంతో కూలీలు కన్నీరుమున్నీరయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

తిమ్మాపూర్(మానకొండూర్): కరీంనగర్ కార్పొరేషన్ పరిధి అల్గునూర్ శివారులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చొప్పదండి మండలం నగునూరు గ్రామానికి చెందిన ఉద్దెర్ల రాయనర్సు(55) మృతిచెందాడు. ఎల్ఎండీ ఎస్సై చేరాలు తెలిపిన వివరాలు... నగునూరు గ్రామానికి చెందిన గాండ్ల హరీశ్‌కుమార్ శుక్రవారం రాత్రి 10.30 గంటలకు రాయనర్సు ఇంటికి వెళ్లాడు. తిమ్మాపూర్‌లోని తన అత్తగారి ఇంటివద్ద పని ఉందని కారులో ఎక్కించుకొని ఇద్దరూ తిమ్మాపూర్‌కు బయల్దేరారు. అల్గునూర్ శివారులోని టోల్గేట్ హోటల్ వద్దకు రాగానే ముందు వెళ్తున్న లారీని తప్పించబోయి హరీశ్‌కుమార్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న సి మెంట్ గోడను ఢీకొట్టింది. కారులో ఎడమవైపు కూర్చున్న రాయనర్సు తీవ్రంగా గాయప డి అక్కడికక్కడే మృతిచెందాడు. కారు నడుపుతున్న హరీశ్‌కుమార్‌కు గాయాలయ్యాయి. ప్ర మాదం జరిగిన వెంటనే హరీశ్ రాయనర్సు కు మారుడు సంపత్‌కు ఫోన్‌చేసి విషయం తెలి పాడు. వెంటనే కుటుంబ సభ్యులు హుటా హుటిన ప్రమాద స్థలానికి చేరుకున్నారు. పోలీ సులకు సమాచార ఇవ్వగా మృతదేహాన్ని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. సంపత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

సాయిబాబా ఆలయ తొలి అర్చకుడు మృతి


కృష్ణమాచార్య స్వామి (ఫైల్)

కోరుట్ల:పట్టణ శివారులోని సాయిబాబా ఆలయ తొలి అర్చకుడు తొర్తి కృష్ణమాచార్య స్వామి(86) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆలయ నిర్మాణం నుంచి సుమారు 30ఏళ్లపాటు ఆలయ అభి వృద్ధికి ఆయన విశేషంగా కృషి చేశారు. బా బాసేవలోనే తరించారు. ఆయన మృతి పట్ల పట్టణంలోని పలువురు సంతాపం తెలిపారు.

బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు


గాయపడ్డ శ్రీనివాస్


సాయినాథ్

మంథని: పెద్దపల్లి – మంథని రహదారిపై గంగాపురి సమీపంలో శనివారం రెండు ద్విచక్ర బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈప్ర మాదంలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. మంథనికి చెందిన వొల్లాల వినోద్‌కుమార్, దూడ సాయినాథ్ బైక్‌పై రామగిరి మండలం బేగంపేటకు వెళ్తుండగా, కూచిరాజ్‌పల్లికి చెందిన కామని శ్రీనివాస్ మంథనికి వస్తున్నాడు. గంగాపురి సమీపంలో అదుపుతప్పి రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నా యి. ఈ ప్రమాదంలో వినోద్‌కుమార్ కాలు, చెయ్యి విరిగాయి. సాయినాథ్, శ్రీనివాస్, తలలకు గాయాలయ్యాయి. వారిని స్థానిక సామాజిక వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌కు తరలించారు.

అ‘విశ్రాంత’ సాహిత్యం

● వృత్తిలో విరమణ పొందినా సాహిత్యంలో కొనసాగుతున్న సాహితీవేత్తలు

విద్యానగర్(కరీంనగర్): బిందువంత పదంలో సింధువంత భావాన్ని ఇముడ్చుకుంటుంది సాహిత్యం. విత్తనమంత అక్షరంలో వృక్షమంత అర్థాన్ని పొదువుకుంటుంది కవిత్వం. ఆ సాహిత్యాన్ని, కవిత్వాన్ని తమ కలంలో పొందుపరుచుకుని అక్షరాలుగా సాహితీవేత్తలు అందిస్తూనే ఉన్నారు. అలాంటి సాహిత్యంపై విద్యార్థి దశ నుంచే మక్కువ పెంచుకుని రచనలు సాగిస్తూ తమ వృత్తి ధర్మాన్ని కొనసాగించిన సాహితీవేత్తలు.. ఉద్యోగ విరమణ పొందిన తర్వాత మలి వయస్సులో కూడా సమాజహితం కోరుతూ ఉత్సాహంగా రచనలు చేస్తున్నారు. ఆయా సాహితీవేత్తల గురించి కథనం.

గులాబీపై తొలి కవిత


వైరాగ్యం ప్రభాకర్

డిగ్రీ చదువుతున్నప్పుడు గులాబీ పువ్వుపై రాసిన కవితతో వైరాగ్యం ప్రభాకర్ సాహిత్య ప్రస్థానం మొదలైంది. తొలి కవిత గులా బీని వాసాల నర్సయ్య కవిత సంకలనంలో ప్రచురించారు. వైరాగ్యం తొలి సంకలనం ‘అక్షర ప్రభలు’ను డాక్టర్ సినారె ఆవిష్కరించారు. తర్వాత దాదాపు 10 సంపుటిలను వెలువరించిన వైరాగ్యం విద్యార్థులకు చెందిన వివిధ అంశాలపై 100కుపైగా కరపత్రాలను రూపొందించి పాఠశాలలో పంపిణీ చేసినందుకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డు సాధించారు. స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి 2021లో ఉద్యోగ విరమణ చేశారు. తన సంపాదకత్వంలో భవానీ సాహిత్య వేదిక ద్వారా 48 సంకలనాలు, ఇతర కవులు రాసిన 52 కవిత సంకలనాలు, పుస్తకాలను వెలువరించారు. గిడుగు జాతీయ సాహిత్య, రంగినేని ట్రస్ట్ వారి బాల సాహితీవేత్త పురస్కారం, సినారె, అలిశెట్టి ప్రభాకర్ పురస్కారాలే కాకుండా వివిధ సంస్థల నుంచి దాదాపు 100 పైగా సన్మానాలు, సత్కారాలు, అవార్డులు అందుకున్నారు.


వైరాగ్యం రచనలు

‘తొవ్వ’తో మొదలు..


అన్నవరం దేవేందర్

కరీంనగర్ జిల్లా ప్రజా పరిషత్‌లో విధులు నిర్వహించిన అన్నవరం దేవేందర్ అక్టోబర్ 2020లో పర్యవేక్షకుడిగా ఉద్యోగ విరమణ చేశారు. ప్రస్తుతం ఒక దినపత్రికలో కాలమిస్ట్‌గా ‘అంతరంగం’ ఆవిష్కరిస్తుండగా మరో పత్రికలో ఊరి సామెతలు కాలమ్ నిర్వహిస్తున్నారు. దేవేందర్ సాహితీ ప్రస్థానం 2001లో ‘తొవ్వ’ తో మొదలైంది. నడక, మంకమ్మ తోట లేబర్ అడ్డా, బుడ్డపర్కలు, మరోకోణం, బొడ్డు మల్లె చెట్టు, పొద్దుపొడుపు, పాక్కిలి వాకిళ్ల పులకరింత, బువ్వ కుండ, ఇంటి దీపం, వరి గొలుసు


అన్నవరం రచనలు

లు, గవాయి, జీవన తాత్పర్యం, సంచారం తదితర 17 సంపుటాలను వెలువరించారు. అక్టోబర్ 17, 1962లో సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పోతారం ఎస్‌లో జన్మించిన ఆయన కరీంనగర్‌లో స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, సినారె, రంగినేని ఎల్లమ్మ, అలిశెట్టి ప్రభాకర్ తదితర సాహిత్య పురస్కారాలు వరించాయి.

తండ్రి పేరిట పురస్కారాలు


గంద్ర లక్ష్మణరావు

ఉమ్మడి జిల్లాలోని పెగడపల్లిలో పుట్టి పెరిగిన డాక్టర్ గంద్ర లక్ష్మణరావు కరీంనగర్‌లో నివాసం ఏర్పరుచుకుని జూనియర్, డిగ్రీ కళాశాలల్లో దాదాపు 33 ఏళ్లు ఉపన్యాసకులుగా విధులు నిర్వహించి 2008లో రిటైర్డ్ అయ్యారు. ఆయన మొదటి రచన కళాకేళి కాగా, 1970–72 ప్రాంతంలో ఆయన రచనలు కృష్ణాపత్రికలో ప్రచురితమైనాయి. 2002లో మొదటి సంపుటి ముగ్గు వెలువరిచారు. విశ్వనాథ వేయి పడగలు నవలపై పరిశోధన చేసి పీహెచ్‌డీ


లక్ష్మణరావు రచనలు

పొందారు. ముగ్గు, వర్తమాన సంధ్య, శతద్రు, వచన కవిత తదితర 16 సంపుటాలను వెలువరించారు. వానామమలై వరదాచార్య, దాశరథి, పీవీ నరసింహరావు స్మారక తదితర పురస్కారాలు అందుకోవడమే కాకుండా, తన తండ్రి హన్మంతరావు పేరిట 18 ఏళ్లుగా కవిత్వేతర ప్రక్రియలకు పురస్కారం ప్రదానం చేస్తున్నారు.

సాహితీ యానం


దాస్యం సేనాధిపతి

కరీంనగర్‌కు చెందిన కవి, రచయిత, సాహితీ సమీక్షకులు దాస్యం సేనాధిపతి స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కాలేజీలో వాణిజ్య విభాగాధిపతిగా విధులు నిర్వహించి 2013లో ఉద్యోగ విరమణ చేశారు. ఎస్‌యూ అదనపు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్‌గా 2014లో పదవీకాలం ముగిసినా సాహితీయానాన్ని సాగిస్తున్నారు. 16 పుస్తకాలు వెలువరించారు. ప్రస్తుతం ఉదయసాహితీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా, తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, తెలంగాణ రచయితల సంఘం కోశాధికారి


సేనాధిపతి రచించిన పుస్తకాలు

గా కొనసాగుతున్నారు. దాదాపు 1,400 గ్రంథాలకు సమీక్షలు రాశారు. ఆయన సాహిత్యంపై శాతావాహన యూనివర్సిటీ ఎంఏ తెలుగు ద్వితీయ సంవత్సర పాఠ్యాంశంగా పొందుపరిచింది. ఇటీవల తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం, తెలంగాణ సారస్వత పరిషత్తు ధర్మనిధి సాహితీ పురస్కారాలు అందుకున్నారు.

సినిమా, సాహిత్యం రెండు కళ్లుగా..


వారాల ఆనంద్

సినిమా, సాహిత్యం రెండు కళ్లుగా 1981లో లయ, మానేరు తీరం తదితర కవితా సంకలనాలతో సాహితీవేత్తగా కరీంనగర్ ప్రజలకు పరిచయం అయిన వారాల ఆనంద్ ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కాలేజీలో గ్రంథపాలకుడిగా పనిచేసి 2016లో ఉద్యోగ విరమణ పొందారు. అనంతరం గుల్జార్ గ్రీన్ పోయమ్స్‌ను ‘ఆకుపచ్చ కవితలు’ పేరున తెలుగులోకి అనువదించి కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం అందుకున్నారు. దశాబ్దాలపాటు ఫిల్మ్ సొసైటీ ఉద్యమంలో పాత్ర పోషించిన ఆయన సమాంతర సినిమాలపై అనేక పుస్తకాలు రాశారు.


ఆనంద్ రచనలు

‘మనిషిలోపల’, ‘బంగారు తెలంగాణలో చలన చిత్రం’, ‘మానేరు గలగల’ పుస్తకాలను వెలువరించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి కీర్తి తదితర పురస్కారాలు అందుకున్నారు. టోరి ఆన్లైన్ రేడియోలో 100 వారాల పాటు తెలుగు కవులందరి స్వీయ కవిత్వాన్ని వారివారి సొంత గొంతుకలతో ప్రసారం చేశారు. ప్రస్తుతం టాల్ ఆన్లైన్ రేడియోలో భారతీయ సాహిత్యం, సినిమాలపై కార్యక్రమాలను నిర్వహిస్తూనే వివిధ పత్రికల్లో కథనాలు రాస్తున్నారు.

మలి సంధ్యలో సాహిత్యం వైపు..


వేములవాడ ద్రోణాచారి

కరీంనగర్‌లో ఇన్‌కంట్యాక్స్ ప్రాక్టీషనర్‌గా ప్రత్యేక స్థానం సంపాదించుకున్న వేములవాడ ద్రోణా చారి మలి సంధ్యలో సాహిత్యం వైపు దృష్టి సారించారు. తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో జరిగే ఎన్నీల ముచ్చట్లు కవిత ప్రవంతి కార్యక్రమం ద్వారా కవిగా వెలుగులోకి వచ్చారు. గన్నేరువరం మండలం మైలారం గ్రామంలో పుట్టి పెరిగిన ఆయన 60వ ఏటా సాహితీరంగంలోకి


ద్రోణాచారి కవిత సంపుటిలు

అడుగుపెట్టారు. ద్రోణహృదయం, హృదయ తరంగిణి తదితర కవిత సంపుటిలు వెలువరించారు. మలేసియా తెలుగు అసోసియేషన్ సాహిత్య పురస్కారం, గుంటూరు విశ్వకర్మ శ్రీపీఠం వారి కళా సామ్రాట్ బిరుదు తదితర అవార్డులు వరించాయి. శోధన, శ్రీదుర్గా భవనీ శతకం ముద్రణకు సిద్ధంగా ఉండగా, పుష్ప విలాపము, దిక్సూచి తుది దశలో ఉన్నాయి.

ఆరు కిలోల గంజాయి స్వాధీనం


నిందితులను అరెస్ట్ చూపుతున్న సీఐ ఆరీఫ్‌అలీఖాన్

జగిత్యాలక్రైం: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి వారి నుంచి ఆరుకిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ ఆరీఫ్‌అలీఖాన్ తెలిపారు. రూరల్ సీఐ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. మార్చి 23న నలుగురు గంజాయి విక్రయిస్తుండగా.. ఇద్దరిని పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని, అప్పటినుంచి కోరుట్ల పట్టణానికి చెందిన మానాల అక్షిత్, మల్లాపూర్ మండలం వేంపల్లికి చెందిన కొండ వినోద్ పరారీలో ఉన్నారని, వారిని శనివారం అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి ఆరుకిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. నిందితులను రిమాండ్‌కు పంపించినట్లు ఎస్సై అజయ్ తెలిపారు.

సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య


లక్ష్మీరాజ్యం(ఫైల్)

శంకరపట్నం(మానకొండూరు): ముత్తారం గ్రామానికి చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి కదురు లక్ష్మీరాజ్యం(73) శనివారం చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన లక్ష్మీరాజ్యం కొన్నేళ్లక్రితమే సింగరేణిలో ఉద్యోగం చేసి ఉద్యోగ విరమణ పొందాడు. అప్పటినుంచి తన స్వగ్రామం ముత్తారంలో నివాసం ఉంటున్నాడు. అయితే, కొన్నినెలల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. అప్పటినుంచి మనస్తాపంతో ఉంటున్నాడు. గ్రామంలో శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవం తిలకించేందుకు కుటుంబసభ్యులు అందరూ ఆలయం వద్దకు వెళ్లారు. ఈసమయంలో లక్ష్మీరాజం ఇంటినుంచి బయటకు వెళ్లాడు. గ్రామ శివారులోని చెరువుకట్ట వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని..


మల్లేశం మృతదేహం

జగిత్యాలక్రైం: భార్య కాపురానికి రావడం లేదని మనస్థాపానికి గురై జగిత్యాలలోని హనుమాన్‌వాడకు చెందిన అల్లె మల్లేశం (49) శనివారం ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. హనుమాన్‌వాడకు చెందిన మల్లేశంకు 18ఏళ్ల క్రితం లహరితో వివాహం జరిగింది. ఇద్దరి మధ్య గొడవలు జరుగుతుండటంతో కొన్నేళ్ల క్రితమే ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మల్లేశం ఒంటరిగా తల్లిదండ్రులతో ఉంటున్నాడు. భార్యను కాపురానికి రావాలని ఎన్నిసార్లు బతిమిలాడినా ఆమె నిరాకరించడంతో జీవితంపై విరక్తి చెంది ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై నరేశ్ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

మంథని: సిరిపురం గ్రామం నుంచి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని సివిల్ సప్లయ్ అధికారులు పట్టుకున్నారు. బిట్టుపల్లికి చెందిన కాను రంజిత్ సిరిపురం రేషన్ డీలర్ పెంచాల రాములు వద్ద తక్కువ ధరకు బియ్యం కొని ఎక్కువ ధరకు విక్రయిస్తున్నాడని ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు. విశ్వసనీయ సమాచారంతో శనివారం ప్రజాపంపిణీ బియ్యం రవాణా చేస్తున్న వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా 35 క్వింటాళ్ల బియ్యం లభించాయన్నారు. అనుమతి లేకుండా రవాణా చేయడంతో బియ్యం, వాహనాన్ని పట్టుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

27నుంచి జూన్ 30వరకు రైళ్ల రద్దు

కరీంనగర్‌రూరల్: మూడో లైను నిర్మాణ పనుల నేపథ్యంలో ఈ నెల 27నుంచి జూన్ 30వరకు పలు రైళ్లను రద్దు చేసినట్లు రైల్వేశాఖ ప్రకటించింది. కరీంనగర్– సిర్పూర్‌టౌన్ మధ్య నడిచే రైలు నంబర్ 07766/65 కరీంనగర్ ఎక్స్‌ప్రెస్, నంబర్ 07894 కరీంనగర్–బోధన్ రైళ్లను రద్దు చేశారు.

పోతారం అడవుల్లో చిరుత ?

కథలాపూర్: కథలాపూర్ మండలం పోతారం, కలిగోట గ్రామాల అడవుల్లో చిరుతపులి సంచరించిందని పలువురు రైతులు గ్రామంలో చెప్పడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. పోతారం శివారులోని గుట్టల్లో నుంచి కలిగోట శివారులోని అడవుల వైపు చిరుతపులి వెళ్లిందని అటువైపు వెళ్లిన రైతులు చూశారని గ్రామాల్లో చర్చించుకుంటున్నారు. ఈ విషయమై అటవీశాఖ కథలాపూర్ సెక్షన్ ఆఫీసర్ మల్లేశం మాట్లాడుతూ.. చిరుతపులి సంచరించిందన్న వదంతులు రావడంతో తాము పోతారం, కలిగోట అడవుల్లో పర్యటించామన్నారు. చిరుతపులి ఆనవాళ్లు ఎక్కడా కనిపించలేదని, ప్రజలు ఆందోళన చెందవద్దని సూచించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం


వివరాలు తెలుసుకుంటున్న ఎస్‌ఐ కిరణ్‌కుమార్

కోరుట్లరూరల్: మండలంలోని పైడిమడుగు గ్రామంలో తాళంవేసి ఉన్న ఇంట్లో శుక్రవారం రాత్రి దొంగలు చొరబడి మూడున్నర తులాల బంగారం, రూ.5వేల నగదు ఎత్తుకెళ్లారు. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన కల్లెడ దేవయ్య ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లాడు. ఆయన భార్య రాజేశ్వరి ఊరిలోనే ఉన్న పెద్ద కూతురు ఇంటికి వెళ్లింది. శనివారం ఉదయం వచ్చి చూడగా తాళం పగుల గొట్టి కనిపించింది. ఇంట్లోకి వెళ్లి చూడగా.. మూడున్నర తులాల బంగారం, రూ.5వేలు కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై కిరణ్‌కుమార్ క్లూస్ టీంతో ఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు.

కల్లాల్లో ధాన్యం దొంగలించిన మహిళకు దేహశుద్ధి

● పోలీసులకు అప్పగింత
● పరార్ అయిన మరో ఐదుగురు


మహిళను బంధించిన ఉపాధిహామీ మహిళా కూలీలు

చందుర్తి(వేములవాడ): కల్లాల్లో నుంచి ధాన్యాన్ని దొంగలించిన మహిళకు మల్యాల గ్రామ రైతులు శనివారం దేహశుద్ధి చేశారు. స్థానికులు తెలిపిన వివరాలు. మండలంలోని మల్యాల శివారులోని పెద్దమ్మ గుడి సమీపంలోని కల్లాల్లో రైతులు ధాన్యం పోసుకున్నారు. శనివారం ఆ కల్లాల్లో నుంచి ధాన్యాన్ని సంచుల్లో నింపుకుని ఎత్తుకెళ్లేందుకు యత్నిస్తున్న మహిళలను ఉపాధిహామీ పనులకు వెళ్లి తిరిగి వస్తున్న మహిళా కూలీలు గమనించి వెంబడించి ఒకరిని పట్టుకోగా, మరో ఐదుగురు పరారీ అయ్యారు. సనుగుల గ్రామం గంగిరెడ్డులకాలనీకి చెందిన టేకుమల్ల బుజ్జవ్వను పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. కాగా వారం క్రితం అనంతపల్లిలో వరి ధాన్యం దొంగతనానికి పాల్పడిన దొంగను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. కానీ మరుసటి రోజు విచారణ చేపడతామని పోలీసులు వదిలిపెట్టిన విషయం తెలిసిందే.

ప్రాణాలు కాపాడిన పోలీస్‌కానిస్టేబుల్

● సత్ఫలితం ఇచ్చిన సీపీఆర్ విధానం
● కానిస్టేబుల్‌పై ప్రశంసలు


మహిళ ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్ శ్రీనివాస్

సిరిసిల్లక్రైం: తండ్రి మరణ వార్త విని గుండెపోటుకు గురైన వివాహితకు సరైన సమయంలో సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడాడు ఏఆర్ పోలీస్‌కానిస్టేబుల్ గడ్డమీది శ్రీనివాస్. సిరిసిల్ల పట్టణం గాంధీనగర్‌కు చెందిన చిలగాని అనూహ్య తన తండ్రి మరణవార్త విని గుండెపోటుకు గురైంది. ఇంట్లోని వారు కేకలు వేయడంతో గమనించిన ఏఆర్ కానిస్టేబుల్ శ్రీ నివాస్ వెంటనే అక్కడికి చేరుకొని అత్యవసర పరిస్థితుల్లో కృత్రిమ శ్వా సను అందించే సీపీఆర్ వి.దానాన్ని వినియోగించాడు. దీంతో అనూహ్య గుండెపోటు నుంచి తా త్కాలిక ఉపశమనం పొందింది. వెంటనే కుటుంబీకులు స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ప్ర స్తుతం ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిసింది. సీపీఆర్‌తో మహిళ ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను అధికారులు, స్థానికులు అభినందిస్తున్నారు.

లంకెబిందెల పేరిట లక్షలు దోచారు

● రూ.30లక్షలు వసూలు చేసిన మాయగాళ్లు
● ముగ్గురి రిమాండ్ : సీఐ వీరప్రసాద్

వేములవాడ: ఇంట్లో లంకెబిందెలు ఉన్నాయని నమ్మించి ఓ మహిళను మోసగించిన ముగ్గురు కేటుగాళ్లను రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ వివరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం వివరాలు వెల్లడించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని హన్మక్కపల్లికి చెందిన సింగారపు అంజవ్వ ఏడాదిన్నరగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ విషయాన్ని తన సమీప బంధువు ఎల్లయ్యకు తెలపగా.. ఆయన వేములవాడ అర్బన్ మండలం చంద్రగిరిలో ఉండే మహిపాల్‌ను పూజారిగా పరిచయం చేశాడు. నాటు వైద్యం చేయించుకుంటే ఆరోగ్యం బాగుపడుతుందని వారు నమ్మబలికారు. నాటువైద్యం కోసం నిత్యం మహిపాల్ దగ్గరికి వస్తున్న అంజవ్వ వ్యక్తిగత విషయాలను అతనికి తెలిపింది. ఆమె అమాయకత్వాన్ని క్యాష్ చేసుకోవాలనుకున్న మహిపాల్.. అంజవ్వ తల్లిగారింట్లో లంకెబిందెలు ఉన్నాయని నమ్మబలికాడు. వాటిని తవ్వి తీస్తే పెద్ద ఎత్తున బంగారం లభిస్తుందని, దానికి పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు అవుతుందని నమ్మించాడు. మహిపాల్ మాటలు నమ్మిన అంజవ్వ విడతల వారీగా రూ.20 లక్షల వరకు అప్పజెప్పింది. అదే సమయంలో మహిపాల్, అంజవ్వల వ్యవహారశైలిని గమనించిన సుద్దాలకు చెందిన అబ్రహం వారిద్దరిని సంప్రదించాడు. లంకెబిందెల్లో నుంచి తీసిన బంగారం కడిగేందుకు తాను సహకరిస్తానని చెప్పి వారితో జతకట్టాడు. అబ్రహం మాటలు నమ్మిన అంజవ్వ మరో రూ.10 లక్షలు ముట్టజెప్పింది. రోజులు గడుస్తున్నా మహిపాల్, అబ్రహంలు చెప్పిన విధంగా ఏమీ జరుగకపోవడంతో మోసపోయానని గ్రహించింది. వెంటనే వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అంజవ్వ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈక్రమంలో మహిపాల్, అబ్రహం, ఎల్లయ్యలను చాకచక్యంగా పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.

పెట్టుబడి పెడితే లాభాల్లో 25శాతం షేర్

● యువతకు ఉద్యోగావకాశాలు
● బంధువులను నమ్మించిన ఘనుడు
● రూ.5కోట్లు వసూలు చేసి విదేశాలకు పరార్!

ధర్మారం(ధర్మపురి): తమ కంపెనీలో పెట్టుబడి పెడితే వచ్చే లాభాల్లో 25శాతం షేర్ ఇస్తామని, యువకులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పి బంధువుల నుంచి దాదాపు రూ.5 కోట్లు వసూలు చేసి ఉడాయించిన ఘటన పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం రామయ్యపల్లి గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు, బాధితుల కథనం ప్రకారం.. సిద్దిపేట మండలం ఇబ్రహీంనగర్‌కు చెందిన యువకుడు తాళ్లపెల్లి సాయిరోహిత్‌గౌడ్ అత్తగారిల్లు పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం రామయ్యపల్లిలో ఉంటుంది. ఈ ఊరుకు తరచూ వస్తున్నాడు. అంతేకాదు.. ఇంటి స్థలం, దాదాపు 1.20 గుంటల వ్యవసాయ భూమి కొనుగోలు చేశాడు. ఈక్రమంలో ఏడాది క్రితం ఇదే గ్రామానికి చెందిన పలువురి వద్ద రూ.లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఆర్నెల్ల వరకు 15 నుంచి 20 శాతం వడ్డీ చెల్లించాడు. గత ఆగస్టు నుంచి వడ్డీ ఇవ్వకుండా వాయిదా వేస్తూ వచ్చాడు. డబ్బులు ఇచ్చినవారు ఒత్తిడి చేయడంతో వడ్డీతో సహా అసలు చెల్లిస్తానని డిసెంబర్ వరకు గడువు పెట్టాడు. ఇదే సమయంలో.. సిద్దిపేటలో తనకు మిషన్ భగీరథ పైప్‌లైన్ కంపెనీ ఉందని, అందులో పెట్టుబడి పెట్టినవారికి ప్రతినెలా 20శాతం వరకు వడ్డీ చెల్లిస్తున్నానని ప్రచారం చేయించాడు. వడ్డీకి ఆశపడిన రామయ్యపల్లి, జయ్యారం, రచ్చపల్లి, చింతలపల్లి, గోదావరిఖని ప్రాంతాలకు చెందిన వారు సుమారు రూ.5కోట్ల వరకు సాయిరోహిత్‌గౌడ్ చేతిలో పెట్టాడు. ఈ సొమ్ముకోసం కొందరికి ప్రామిసరీ నోట్ రాసివ్వగా, మరికొందరి నుంచి ఎలాంటి కాగితాలు రాసివ్వకుండానే డబ్బులు తీసుకున్నాడు. ఇందులో ఓ గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ రూ.కోటి వరకు ఇచ్చినట్లు సమాచారం. గత మార్చి 15తేదీ వరకు కంపెనీలో పెట్టిన షేర్ ఆధారంగా 20 శాతం లాభాలు పంచిస్తానని నమ్మించాడు. అయితే, గడువు దాటినా డబ్బులు ఇవ్వకపోవడంతో బాధితులు సాయిరోహిత్‌కు ఫోన్లు చేశారు. ఎంతకీ ఫోన్ ఎత్తలేదు. అంతేకాదు.. నెల రోజులుగా సాయిరోహిత్‌తోపాటు కుటుంబసభ్యుల మొబైల్ ఫోన్లు స్విచ్ఛాఫ్ వచ్చాయి. ఆందోళనకు గురైన బాధితులు.. రామయ్యపల్లిలోని అతడి బంధువులను ప్రశ్నించగా తమకు సంబంధం లేదని స్పష్టం చేశారు. చేసేది లేక ఈనెల ఒకటోతేదీన రామయ్యపల్లి గ్రామానికి చెందిన మూల మల్లేశం పోలీసులకు పిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన ఎస్సై సత్యనారాయణ.. పార్లమెంట్ ఎన్నికలు పూర్తయ్యాక సాయిరోహిత్‌గౌడ్ ఆచూకీ కనిపెట్టి, డబ్బులు ఇప్పించే ప్రయత్నం చేస్తానని భరోసా ఇచ్చారు. ఈసమయంలో సాయిరోహిత్‌గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి విదేశాలకు పరారైనట్లు ప్రచారం సాగుతోంది. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు.

విద్యుత్ ఉద్యోగుల రక్తదానం


ఉద్యోగులను అభినందిస్తున్న ఎస్ఈ గంగాధర్

కొత్తపల్లి(కరీంనగర్): టీజీఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ పుట్టినరోజును పురస్కరించుకొని శనివారం ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పలువురు విద్యుత్ ఉద్యోగులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన సత్యనారాయణ, యుగంధర్, నాగరాజు, శేఖర్‌రెడ్డి, డి.సంపత్‌కుమార్, ఎస్.స్వామి, కె.గణేశ్, పి.శ్రీనివాస్, శ్రీకాంత్‌ను ఎస్ఈ అభినందించారు. కాగా సర్కిల్ పరిధిలోని డీఈలు, ఏడీఈలు, ఏఈలు, సబ్‌ఇంజినీర్లు, విద్యుత్ ఉద్యోగులు ఈ సందర్భంగా ఎస్ఈకి బొకేలతో శుభాకాంక్షలు తెలిపారు. రెడ్‌క్రాస్ చైర్మన్ కేశవరెడ్డి, వైస్ చైర్మన్ సురేశ్, కోల అన్నారెడ్డి, శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

మల్లాపూర్: మండలకేంద్రంలో శనివారం సాయంత్రం పిడుగు పడి మహమ్మద్ ఖదీర్(55) మృతి చెందాడు. జగిత్యాల పట్టణానికి చెందిన మహమ్మద్ ఖాదీర్ లారీలో ఎరువుల లోడ్‌తో మల్లాపూర్‌కు వచ్చాడు. బస్తాలను దింపుతుండగా.. ఒక్కసారిగా ఈదురుగాలులు, ఉరుములతో వర్షం కురిసింది. ఈ క్రమంలో ఎరువుల బస్తాలు తడుస్తాయని ఖాదీర్ లారీ ఎక్కి టార్పాలిన్ కప్పుతుండగా పిడుగుపడటంతో గుండెపోటుకు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్సై లక్ష్మయ్య విచారణ చేపట్టారు.

క్లుప్తంగా

డల్లాస్‌లో మంత్రి పొన్నంకు ఘన స్వాగతం



మంత్రి పొన్నంకు స్వాగతం పలుకుతున్న కరీంనగర్ వాసులు

కరీంనగర్‌కార్పొరేషన్: అమెరికా పర్యటనలో ఉన్న రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డల్లాస్ వెళ్లిన సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా వాసుల నుంచి ఆయనకు ఘనస్వాగతం లభించింది. ఓవర్సీస్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో డల్లాస్‌లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా వాసులు చాడగొండ భరత్ సింహారెడ్డి, పెద్దన్న తదితరులు మంత్రికి స్వాగతం పలికారు.

చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని 30వ డివిజన్ పరిధి మారుతినగర్‌లో నగరపాలక సంస్థ నుంచి తీసుకున్న అనుమతులు మీరి చేపడుతున్న ఇంటి నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని స్థానిక కార్పొరేటర్ నేతికుంట యాదయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు నగర పాలకసంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. మారుతినగర్‌లో ఇంటి నిర్మాణం చేపడుతున్న వ్యక్తి భవన నిర్మాణ అనుమతిలో 30 ఫీట్ల వెడల్పుతో ఉన్న రోడ్డు చూపించారని, కాని 10 ఫీట్ల మేర రోడ్డు అధిగమించి నిర్మాణం చేపట్టారని ఆయన తెలిపారు. దీంతో కాలనీవాసులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న ఇంటి నిర్మాణంపై చర్యలు తీసుకొని, డివిజన్ ప్రజలకు న్యాయం చేయాలని కోరారు.

బ్యాగ్ అప్పగింత



ప్రయాణికురాలికి బ్యాగ్ అప్పగిస్తున్న సిబ్బంది

విద్యానగర్: కరీంనగర్ బస్టాండ్‌లోని 16వ ప్లాట్‌ఫామ్ వద్ద కొత్తపల్లి గ్రామానికి చెందిన కొర్రి ఆశ్లైని బ్యాగ్ మరిచిపోయి హైదరాబాద్ వెళ్లింది. గమనించిన బస్టాండ్ భద్రత సిబ్బంది జి.కవిత, సెక్యూరిటీ గార్డ్ నారాయణ ఆ బ్యాగ్‌ను ఏఎస్‌ఐ ఎం.లక్ష్మి వద్ద భద్రపరిచారు. ప్రయాణికురాలు తిరిగి వచ్చి బ్యాగ్ గురించి అడుగగా ఆమె చెప్పిన వివరాల ప్రకారం.. బ్యాగ్ ఆమెదిగా గుర్తించి తిరిగి అప్పగించారు. బ్యాగ్‌లో రెండు విలువైన సెల్‌ఫోన్స్ ఉన్నట్లు భద్రత సిబ్బంది తెలిపారు.

మాడ్యులర్ ఓటీ కాంప్లెక్స్ ప్రారంభం



కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న సూర్యరాజ్

కొత్తపల్లి: రేకుర్తిలోని లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ డాక్టర్ భాస్కర్ మాడేకర్ కంటి ఆసుపత్రిలో శనివారం మాడ్యులర్ ఓటీ కాంప్లెక్స్‌ను దాత జీఆర్ సూర్యరాజ్ ప్రారంభించారు. మారుతున్న పరిస్థితులకనుగుణంగా ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్‌ను మాడ్యూలర్ థియేటర్‌గా మార్చి రోగులకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆసుపత్రి చైర్మన్ కొండ వేణుమూర్తి తెలిపారు. ఆసుపత్రి వైస్ చైర్మన్ సురేశ్, కార్యదర్శి ప్రకాష్ హొల్లా, డాక్టర్ టి.మురళీధర్‌రావు, ఇంజినీర్ కోల అన్నారెడ్డి, లంబు సుధాకర్‌రెడ్డి, రాజిరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, కోదండరాం, భద్రేశం, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సరుకులు, చీరలు పంపిణీ



చీరలు, సరుకులు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ బాధ్యులు

సప్తగిరికాలనీ: మేము సైతం యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో మోహన్‌సింగ్ జన్మదినం సందర్భంగా మురళీ మనోహరాచారి సహకారంతో సుమారు 150 మందికి అన్న ప్రసాద వితరణ, పేద మహిళలకు చీరలు, నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షురాలు చకిలం స్వప్న, శ్రీనివాస్, రూప, హనురోప్ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జైలు

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 36 మందిని ట్రాఫిక్ పోలీసులు శనివారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. అందులో 8 మందికి జైలు శిక్ష, మిగతావారికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రమేశ్ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని సూచించారు.

అవగాహన.. అప్రమత్తత

- అన్నదాతకు మొదలైన అవగాహన సదస్సులు
- ఈనెల 31 వరకు అన్ని గ్రామాల్లో నిర్వహణ
- విత్తనాలకే పరిమితం.. సన్నబియ్యం, పంటల బీమా ఊసేది?



కొత్తపల్లి మండలం చింతకుంటలో మాట్లాడుతున్న డీఏవో శ్రీనివాస్

కరీంనగర్ అర్బన్: ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అంచనా వేస్తున్న నేపథ్యంలో రైతులు వ్యవసాయానికి సిద్ధమయ్యేలా ఆ శాఖ సన్నద్ధమవుతోంది. నేల స్వభావం ఆధారంగా అన్నదాతలను సాగుకు సమాయత్తం చేసే దిశగా కదలాలని వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి శుక్రవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ అధికారులకు సూచించారు. నకిలీ విత్తనాలతో నష్టపోకుండా అప్రమత్తం చేస్తూ వెంటనే వారికి అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో శనివారం నుంచి జిల్లా వ్యాప్తంగా గ్రామాలవారీగా ఉదయం 7.30 నుంచి 11.30 వరకు నిర్వహించే సదస్సుల్లో ఎక్కువ మంది రైతులు పాల్గొనేలా ఆ శాఖ ప్రణాళిక రూపొందించింది. రోజుకు ఒక గ్రామ పంచాయతీ చొప్పున అవగాహన సదస్సులు నిర్వహిస్తుండగా కొత్తపల్లి మండలం చింతకుంటలో జిల్లా వ్యవసాయ అధికారి బత్తుల శ్రీనివాస్ రైతులకు అవగాహన కల్పించారు. కాగా జూన్ 4 వరకు ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రజాప్రతినిధులను ప్రత్యేకంగా ఆహ్వానించకుండా కార్యక్రమాలు కొనసాగించాలని, ఈ నెల 31లోగా అవగాహన సదస్సులు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

అధికారుల భరోసా

పత్తి విత్తనాలు, ఇతర వ్యాపార పంటల కోసం రైతులు సీడ్ విత్తనాలు కొనేలా అప్రమత్తం చేయాలని, పంట పూర్తయ్యే వరకు ఏ విత్తనం వాడారో గుర్తుండేలా విత్తనాల బస్తాను భద్రపరచేలా అధికారులు సూచనలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న ధాన్యానికి ప్రాధాన్యం ఇస్తున్న క్రమంలో సన్నాల సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టనుందని అధికారులు చెబుతున్నారు. ముందస్తు సమాచారంతో గ్రామాల్లో సమావేశమైన రైతులకు ఈ విషయాలను స్పష్టం చేయడమే కాకుండా విత్తనాల కోసం ముందుగానే టోకెన్లు ఇచ్చే పద్ధతిని అవలంభించేలా చర్యలు చేపడుతున్నారు.

నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట

నకిలీ విత్తనాలను అరికట్టాలని ప్రభుత్వం వ్యవసాయ శాఖను ఆదేశించింది. డీలర్లు విక్రయించే విత్తనాల వివరాలు, ఉత్పత్తిదారులు, కొనుగోలు చేస్తున్న రైతుల వివరాలు నమోదు చేయాలని సూచించింది. రోజూ వీరిపై పర్యవేక్షణ ఉండేలా ఏఈలు, ఏవోలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించింది.

సన్నరకం, పంటల బీమా ఊసేది?

కాగా అన్నదాతలకు నిర్వహిస్తున్న అవగాహన సదస్సుల్లో కేవలం విత్తనాల ఎంపిక, జాగ్రత్తలు వివరిస్తున్నారు. ప్రభుత్వం సన్న రకాలకు క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించగా సదరు అంశాన్ని అధికారులు ప్రస్తావించడం లేదు. ఏయే సన్నలు సాగు చేయాలనే వివరాలను వెల్లడించకపోగా పంటల బీమా గురించి అవగాహన కల్పించడం లేదు. ఇక గతంలో నిర్వహించిన సదస్సుల్లో వ్యవసాయ శాఖతో పాటు ఉద్యాన, పట్టు పరిశ్రమ, పశుసంవర్ధక, మార్కెటింగ్, ఆత్మ, తదితర శాఖలు భాగస్వామ్యమయ్యేవి. వాటి పరిధిలో అన్నదాతలకు అందించే సేవలు, ఆదాయ మార్గాలను వివరించేవారు. కానీ ప్రస్తుతం జరుగుతున్న సదస్సులు విత్తనాల వరకే పరిమితమవడం ఇంట, బయట విమర్శలకు దారి తీస్తోంది.

విత్తన దుకాణాల్లో తనిఖీలు



మొగ్దుంపూర్‌లోని దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏవో సత్యం, ఎస్సై శేఖర్

కరీంనగర్‌రూరల్: నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోకుండా అప్రమత్తం చేసేందుకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శనివారం కరీంనగర్ మండలంలో సదస్సులు, తనిఖీలు ప్రారంభించారు. గోపాల్‌పూర్, నల్లగుంటపల్లిలో నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించారు. గ్రామాల వారీగా విత్తనాలపై రైతులకు అవగాహన సదస్సులను నిర్వహించనున్నట్లు ఏవో సత్యం తెలిపారు. ఈ నెల 27 బొమ్మకల్, చామనపల్లి, చెర్లభూత్కూర్, నగునూరు, 28న దుర్శేడ్, ఎలబోతారం, మొగ్దుంపూర్, 29న చేగుర్తి, ఫకీర్‌పేట, ఇరుకుల్ల, జూబ్లీనగర్, 30న తాహెర్‌కొండాపూర్, 31న బహదూర్‌ఖాన్‌పేట, దుబ్బపల్లి, మందులపల్లి గ్రామాల్లో సదస్సులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే ఏవో, ఎస్సై శేఖర్ బొమ్మకల్, దుర్శేడ్, మొగ్దుంపూర్ గ్రామాల్లోని విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు.

అప్రమత్తంగా ఉండాలి

నకిలీ పత్తి విత్తనాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్‌రూరల్ ఎస్సై శేఖర్ అన్నారు. విత్తన కొనుగోలుపై శనివారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గోపాల్‌పూర్, నల్లగుంటపల్లి గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించగా, ఎస్సై ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో నకిలీ విత్తనాలను వ్యాపారులు విక్రయిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమాల్లో ఏఈవో పైడితల్లి, రైతులు పాల్గొన్నారు.

'కార్పొరేట్ విద్యాసంస్థల్లో దోపిడీని అరికట్టాలి'



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ

కరీంనగర్: ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం సంఘ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఉమ్మడి జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. మార్కెట్లో విద్యను సరుకుగా మార్చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు నాణ్యమైన విద్య అందని ద్రాక్షలా చేశారన్నారు. గత పదేళ్ల కేసీఆర్ పాలనలో సుమారు 26,062 ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడిందన్నారు. విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కొరత, అధికారుల పర్యవేక్షణలేమి కొట్టొచ్చినట్టుగా కనిపిస్తుందన్నారు. రాష్ట్రంలోని 504 జూనియర్ కాలేజీల్లో సుమారు 5 వేల పోస్టులు, డిగ్రీ కాలేజీల్లో 2,650, యూనివర్సిటీల్లో 1,868 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. రూ.5వేల కోట్లకు పైగా స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే విడుదల చేయాలన్నారు. విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు ములకాల మారుతి, లోకిని రమేశ్, సన్నీ, రాజశేఖర్, పవన్, తేజ, విష్ణువర్ధన్, బన్నీ, గణేశ్, రవి, కిరణ్, సతీశ్, ప్రశాంత్, రాజేశ్, రమేశ్ పాల్గొన్నారు.

ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలి



సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు

కరీంనగర్: ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఎస్‌ఎఫ్‌ఐ సంఘ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు. ఇంటర్నేషనల్, సీబీఎస్ఈ తదితర తోక పేర్లను ప్రచారం చేస్తున్న విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలన్నారు. ఫీజుల నియంత్రణ చట్టం లేకపోవడంతో ఒక ఎల్‌కేజీ విద్యార్థికి రూ.50 వేల నుంచి 2 లక్షల వరకు వసూలు చేస్తున్న పరిస్థితి జిల్లాలో నెలకొందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నోటీసు బోర్డుల్లో ఫీజుల వివరాలు పెట్టాలని, కానీ ఏ విద్యాసంస్థ కూడా అలా చేయడం లేదని, దీనిపై విద్యాశాఖ అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రైవేటు ఫీజుల దందా నియంత్రణకు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్తాన్, గుజరాత్, పశ్చిమబెంగాల్, పంజాబ్, ఉత్తరప్రదేశ్ తదితర 15 రాష్ట్రాల్లో ప్రత్యేక చట్టాలు తేవాలన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తలు, చిన్న విద్యాసంస్థల యాజమాన్యాలు కూడా ఉద్యమంలో కలిసి రావాలన్నారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, పీడీఎస్‌యూ, ఎంఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు మచ్చ రమేశ్, రత్నం రమేశ్, నవీన్, అనిల్, నరేశ్, యుగేందర్, సందీప్, బోగేశ్, రోహిత్ పాల్గొన్నారు.

'నిబంధనలు పాటించని ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి'



మాట్లాడుతున్న తిరుపతి

కరీంనగర్: ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ స్కూళ్లు, కళాశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. శనివారం సంఘ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నరేశ్ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. తోక పేర్లు పెట్టి విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షించేలా ప్రచారాలు చేస్తూ ఆర్థిక దోపిడీ చేస్తున్న ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. నిబంధన ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో యూనిఫామ్, బుక్స్, టై, బెల్టులు అమ్మ వద్దని నిబంధనలు ఉన్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు నిబంధనలు పాటిస్తున్నారా లేదా.. ఇంటర్మీడియట్ అధికారులు తనిఖీలు చేయకుండా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా నిబంధనలు పాటించని యాజమాన్యాలపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే తమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి రాజు, నాయకులు శ్రావణ్, ప్రసాద్, అరవింద్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సద్దుమణిగిన వివాదం

శంకరపట్నం: మండలంలోని కరీంపేటలో ఎల్లమ్మ గుడికి తాళం వేసిన వివాదం శనివారం చర్చలతో సద్దు మణిగింది. గ్రామంలోని ఎల్లమ్మ గుడిలోకి గురువారం దళితులు ప్రవేశించకుండా గౌడ కులానికి చెందిన గుర్రం భిక్షపతి, తిరుపతి గుడికి తాళం వేశారని దళితులు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈమేరకు శనివారం ఇరువర్గాల పెద్ద మనుషుల సమక్షంలో చర్చలు జరిపారు. దళితులను ఆలయ దర్శనం చేసుకునేందుకు ఆటంకం కల్పించొద్దని నిర్ణయించారు.

ఉపాధ్యాయులపై సస్పెన్షన్ ఎత్తివేయాలి



వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

కరీంనగర్: సస్పెండ్ అయిన ఉపాధ్యాయులకు వెంటనే రీఇన్‌స్టిట్యూట్ ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో శనివారం విద్యాశాఖ సూపరింటెండెంట్ నరసింహస్వామికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ, ఇటీవల సస్పెండ్ అయిన నవాబ్‌పేట్, సైదాపూర్ మండలం నల్లాని తండా ఉపాధ్యాయుల సస్పెన్షన్ వెంటనే ఎత్తివేసి రీ ఇన్‌స్టిట్యూట్ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. వారి సస్పెన్షన్ సరికాదని వెంటనే వీరిని రీఇన్‌స్టిట్యూట్ చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు గంప చంద్రశేఖర్, తుమ్మల తిరుపతి, తిరుపతిరెడ్డి, ఆర్.తిరుపతి, విజేందర్‌రెడ్డి, ఖాజా మంజూర్‌అలీ తదితరులు ఉన్నారు.

ఓబీసీ సర్టిఫికెట్ల రద్దుపై హర్షం



పూలే విగ్రహానికి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్‌టౌన్/విద్యానగర్: పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం కులాలకు జారీచేసిన ఓబీసీల ధ్రువీకరణ పత్రాలను కోర్టు రద్దు చేయడం హర్షణీయమని బీజేపీ నాయకులు అన్నారు. సర్టిఫికెట్లను కలకత్తా కోర్టు రద్దు చేసి తీర్పును వెలువరించిన నేపథ్యంలో శనివారం బీజేపీ ఓబీసీ మోర్చా నాయకుల ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, 2010లో మమతాబెనర్జీ ప్రభుత్వం ముస్లింలకు ఓబీసీ సర్టిఫికెట్లు జారీ చేసిందని, దీంతో లక్షలాది మంది ఓబీసీలకు అందాల్సిన ప్రయోజనాలు కోల్పోవాల్సి వస్తుందని, నిజమైన ఓబీసీలు కలకత్తా హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు. ఈ విషయంపై విచారణ చేపట్టిన హైకోర్టు సర్టిఫికెట్లను రద్దు చేస్తూ సంచలన తీర్పు ఇచ్చిందని, ఇది మమతాబెనర్జీ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదన్నారు. కార్యక్రమంలో నాయకులు భోగ విజయభాస్కర్, అడిచెర్ల రాజు, జెల్లోజి చిట్టిబాబు, ఏన్నం ప్రకాష్, దుబాల శ్రీనివాస్, గుంజేటి శివకుమార్, పుప్పాల రఘు, ఎడమ సత్యనారాయణ, గర్దాస్ సతీశ్, సుధాకర్ పటేల్, వేణుగోపాలచారి, వొడ్నాల కోటేశ్వర్, పొన్నాల రాము, బత్తిని మహేశ్‌గౌడ్, పసుల అభిలాష్, రవీందర్, పర్వతం మల్లేశం, సంపత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు మట్టి తరలింపుపై ఫిర్యాదు

జమ్మికుంట: మండలంలోని మాచనపల్లి గ్రామంలో ఉపాధి పనుల ద్వారా చెరువు నుంచి తీసిన మట్టిని ఇటుక బట్టీల వ్యాపారులకు అమ్మకాలపై చర్యలు తీసుకోవాలని హైద్రాబాద్ పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్‌కు గ్రామ నాయకులు బండి కుమార్, రమేశ్ శనివారం ఫిర్యాదు చేశాడు. చెరువు పూడికతీత పనుల్లో తీసిన మట్టిని ఏలాంటి అనుమతులు లేకుండాగ్రామానికి చెందిన ఎంపీటీసీ పోల్సాని రాజేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ భర్త బొజ్జం తిరుపతిరెడ్డి, మాజీ వార్డు మెంబర్ ఓరుగంటి లత, గ్రామ కార్యదర్శి శివరంజని, ఫీల్డ్ అసిస్టెంట్ అనురాధ కుమ్మక్కై రైతులకు చెందాల్సిన మట్టిని జమ్మికుంట పట్టణంలోని ఇటుక బట్టీల నిర్వాహకులకు అమ్మకాలు చేశారని పేర్కొన్నారు. ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తే విచారణ చేసి, కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ కు నామమాత్రంగా షోకాజ్ నోటీసులు ఇచ్చారన్నారు. మట్టి ని అమ్ముకున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ,రైతులకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.



స్తంభాలను సరిచేశారు

సాక్షి ఎఫెక్ట్..

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లోని పొలాల్లో విద్యుత్ స్తంభాలు ఒరిగి ప్రమాదకరంగా మారడంపై ఈ నెల 24 'సాక్షి'లో 'ఒరిగిన స్తంభాలు.. ప్రమాద సూచికలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం లైన్‌మెన్ రాజు, హెల్పర్లు రవి, కోటేశ్ స్థానిక రైతులతో కలిసి ట్రాక్టర్ సహాయంతో ఒరిగిన మూడు విద్యుత్ స్తంభాలను సరిచేశారు. ఈసందర్భంగా సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు కూర శ్యాంసుందర్‌రెడ్డి, రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

తిరుమలనగర్ రోడ్డు పనులు ప్రారంభించాలి

కరీంనగర్: మధ్యలో నిలిపివేసిన రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు ప్రకటనలో కోరాడు. కార్పొరేషన్ పరిధిలోని 13వ డివిజన్‌లో గల తిరుమలనగర్ రోడ్డు పనులు ప్రారంభించి దాదాపు సంవత్సరం కావస్తుందని, పనులను మధ్యలోనే నిలిపివేయడం వల్ల ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్ల పనులు అర్ధంతరంగా ఆగిపోవడంపై నగరపాలక సంస్థ మేయర్, కార్పొరేటర్, కార్పొరేషన్ అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కాంట్రాక్టర్లు మధ్యలో పనులు వదిలేసి వెళ్తే అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఎందుకు చేయడం లేదన్నారు. మున్సిపల్ ప్రజాప్రతినిధులకు ఓట్ల సమయంలో ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై లేదని విమర్శించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు పనులు ప్రారంభించాలని, లేకుంటే డివిజన్ ప్రజలతో కార్పొరేషన్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు.

హనుమాన్ శోభాయాత్రలో ఘర్షణ

- చెదరగొట్టిన పోలీసులు
- రోడ్డుపై బైఠాయించిన హనుమాన్ భక్తులు

కరీంనగర్ క్రైం/కరీంనగర్ టౌన్: కరీంనగర్ నగరంలోని మంచిర్యాల చౌరస్తాలో శనివారం రాత్రి హనుమాన్ భక్తుల శోభాయాత్ర జరుగుతుండగా ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. యాత్ర గాంధీరోడ్డు వైపు వెళ్తుండగా మద్యంమత్తులో ఓ వ్యక్తి ర్యాలీకి అడ్డంగా వచ్చి కత్తిచూపుతూ గొడవపడ్డాడు. పోలీసులు గొడవకు కారణమైన వ్యక్తిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించేందుకు యత్నించగా భక్తులు అడ్డుకున్నారు. పోలీసు వాహన అద్దాలు ధ్వంసంచేశారు. ఓ పోలీసు అధికారి ఆధ్వర్యంలో అక్కడున్న వారందరినీ చెదరగొట్టే ప్రయత్నం చేశారు. దీంతో భక్తులు రోడ్డుపై బైఠాయించారు.

పోలీసుల తీరు గర్హనీయం: బండి సంజయ్ కుమార్

హనుమాన్ భక్తులపట్ల పోలీసులు వ్యవహరించిన తీరు గర్హనీయమని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలీసులే రెచ్చగొట్టి స్వామిజీలపై లాఠీచార్జిచేయడం దుర్మార్గమన్నారు. సమస్యను పరిష్కరించాల్సిన వారే సమస్యలు సృష్టిస్తారా? అంటూ ధ్వజమెత్తారు. అబద్దాలతో సమస్యను పక్కదారి పట్టించే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే స్వామిజీలను వదిలిపెట్టాలని డిమాండ్ చేశారు. డీజీపీకి ఫోన్ చేసి స్వామిజీలపై దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై ఫిర్యాదు చేశారు.

ముగిసిన యోగా శిక్షణ శిబిరం

తిమ్మాపూర్: పతాంజలి యోగా సమితి ఆధ్వర్యంలో మండలంలోని కొత్తపల్లి గ్రామ పాదువు సంఘం భవనంలో నెల రోజులుగా కొనసాగుతున్న ఉచిత యోగా శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. చివరిరోజు రామాలయంలో దేవ యజ్ఞం నిర్వహించారు. పతాంజలి యోగా సమితి తిమ్మాపూర్ కోఆర్డినేటర్ నరేందర్ నేతత్వంలో నిర్వహించిన శిబిరంలో యోగాసనాలు, యోగిక జాగింగ్, సూర్య నమస్కారాలు, ధ్యానం, ప్రాణాయం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. దేవ యజ్ఞంలో ఆచార్య వేదయన్ మాట్లాడుతూ.. యజ్ఞంతో పర్యావరణం సమతుల్యమవుతుందని, యజ్ఞ థెరపీ ద్వారా వ్యాధులు నయం చేయవచ్చునన్నారు. భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు రమేశ్, యువ భారత్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ బాబు, పీఏసీసీఎస్ డైరెక్టర్ తిరుపతి గౌడ్, మాజీ ఎంపీటీసీ త్రిభువన, పాదువు సంఘం అధ్యక్షుడు రాములు, మాజీ అధ్యక్షుడు రవీందర్, యోగా సాధకులు పాల్గొన్నారు.

గోహత్య నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న గోరక్ష, వీహెచ్‌పీ బాధ్యులు

కరీంనగర్‌టౌన్: గోరక్ష కోసం ప్రభుత్వం శాశ్వత పోలీసు స్టేషన్‌లను ఏర్పాటు చేయాలని గోరక్ష విభాగ్ ప్రాంత ప్రముఖ్ ఈసంపల్లి వెంకన్న డిమాండ్ చేశారు. శనివారం విశ్వహిందూపరిషత్ కార్యాలయంలో జరిగిన జిల్లా గోరక్ష విభాగ్ బైఠక్ సమావేశానికి హాజరై మాట్లాడారు. ప్రతి జిల్లాలోని చెక్‌పోస్టు వద్ద చెకింగ్ చేయాలని పోలీసులకు విన్నవించడం జరిగిందన్నారు. జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రావు మాట్లాడుతూ, గోరక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని, చట్ట వ్యతిరేకంగా గోవులను వధశాలలకు అక్రమంగా తరలించే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గో హత్య నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గో రక్షణ గోడప్రతులను ఆవిష్కరించారు. గోరక్ష విభాగ్ బాధ్యులు ఉట్కూరి రాధాకృష్ణారెడ్డి, చేపూరి అశోక్, ఆదిమూల విద్యాసాగర్, ఇనగంటి రమేశ్, తోట రాజేందర్, శ్రీరామోజ సంగీత, కన్నం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కుతున్న మురుగు



కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని మారుతినగర్, హౌసింగ్‌బోర్డుకాలనీ మెయిన్ రోడ్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నుంచి వెళ్లాల్సిన మురుగునీళ్ల చాంబర్ నుంచి లీక్ అయి రోడ్డెక్కుతున్నాయి. అండర్ గ్రౌండ్ నుంచి డ్రైనేజీ పైప్‌లైన్ వెళుతుండగా, మురుగు నీళ్ల చాంబర్ ద్వారా బయటకు వచ్చి నడిరోడ్డుపై ప్రవహిస్తున్నాయి. దీంతో సమీప ప్రాంతవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. డ్రైనేజీలో సిల్ట్ తీయకపోవడం కారణంగా, మురుగునీళ్లు సులువుగా వెళ్లలేక, ఇలా చాంబర్ ద్వారా లీకయి రోడ్డుపైకి పారుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. నగరపాలకసంస్థ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

మొదటి విడత		రెండో విడత		మూడో విడత	
విద్యార్హత	అభ్యర్థులు	విద్యార్హత	అభ్యర్థులు	విద్యార్హత	అభ్యర్థులు
5-12వ తరగతి	639	5-12వ తరగతి	533	5-12వ తరగతి	639
డిగ్రీ, ఆ పైన	836	డిగ్రీ, ఆ పైన	574	డిగ్రీ, ఆ పైన	591
అక్షరాస్యులు	36	అక్షరాస్యులు	37	అక్షరాస్యులు	56
నిరక్షరాస్యులు	26	నిరక్షరాస్యులు	8	నిరక్షరాస్యులు	19

లోక్‌సభ అభ్యర్థుల్లో...
121 మంది నిరక్షరాస్యులు

లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న వారిలో 121 మంది నిరక్షరాస్యులు. 359 మంది 5వ తరగతి దాకా, 647 మంది 8వ తరగతి వరకు చదువుకున్నారు. 1,303 మంది ట్వెల్త్ గ్రేడ్ పాసయ్యారు. 1,502 మంది డిగ్రీ చదవగా 198 మంది డాక్టరేట్ అందుకున్నారు. అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) ఈ మేరకు వెల్లడించింది. ఏడు దశల్లో బరిలో ఉన్న మొత్తం 8,360 మంది అభ్యర్థుల్లో 8,337 మంది విద్యార్హతలను ఏడీఆర్ విశ్లేషించింది... – న్యూఢిల్లీ

నాలుగో విడత		ఐదో విడత		ఆరో విడత		ఏడో విడత	
విద్యార్హత	అభ్యర్థులు	విద్యార్హత	అభ్యర్థులు	విద్యార్హత	అభ్యర్థులు	విద్యార్హత	అభ్యర్థులు
5-12వ తరగతి	644	5-12వ తరగతి	293	5-12వ తరగతి	332	5-12వ తరగతి	402
డిగ్రీ, ఆ పైన	944	డిగ్రీ, ఆ పైన	349	డిగ్రీ, ఆపైన	509	డిగ్రీ, ఆపైన	450
అక్షరాస్యులు	30	అక్షరాస్యులు	20	అక్షరాస్యులు	12	అక్షరాస్యులు	26
నిరక్షరాస్యులు	26	నిరక్షరాస్యులు	5	నిరక్షరాస్యులు	13	నిరక్షరాస్యులు	24

ఫలోదీ సట్టా బజార్లో...
తగ్గిన బీజేపీ హవా

300కు మించకపోవచ్చని అంచనాలు
- ఎన్డీఏకు 350 నుంచి 332కు తగ్గింపు
- కాంగ్రెస్‌కు 60 వస్తాయంటూ బెట్టింగ్



లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై రాజస్తాన్‌లోని ఫలోదీ సట్టా బజార్ తాజా అంచనాలు ఎలా ఉన్నాయి? కచ్చితమైన అంచనాలు, బెట్టింగ్‌లకు దేశమంతటా పేరొందిన ఫలోదీ మార్కెట్ ఇప్పటికీ బీజేపీ సొంతంగా మెజారిటీ సాధిస్తుందని నమ్ముతోంది. అక్కడి పంటర్లు మోదీ సర్కారుపైనే బెట్టింగులు కడుతున్నారు. కానీ నెలక్రితం అంచనాలతో పోలిస్తే బీజేపీ నెగ్గబోయే స్థానాల సంఖ్య బాగా తగ్గడం విశేషం. బీజేపీ 330 నుంచి 333 స్థానాలు నెగ్గుతుందని తొలి విడత పోలింగ్‌కు ముందు దాకా ఇక్కడ జోరుగా పందేలు సాగాయి. కానీ ఇప్పుడది 296 నుంచి 300 సీట్లకు పరిమితమైంది...!

క్రమంగా తగ్గుదల..

ఒక్కో విడత పోలింగ్ జరుగుతున్న కొద్దీ ఫలోదీ బజార్లో బీజేపీకి అంచనాలు తగ్గుతూ వస్తున్నాయి. 307 నుంచి 310 స్థానాలు గెలుస్తుందంటూ మే 13న నాలుగో విడత పోలింగ్‌కు ముందు పందేలు నడిచాయి. నాలుగో దశ ముగిశాక తాజాగా 296 నుంచి 300కు తగ్గాయి. ఎన్డీఏకు 350 దాటుతాయని తొలుత పేర్కొనగా, 329 నుంచి 332 మధ్య రావచ్చని తాజాగా పందేలు సాగుతున్నాయి. 2019 ఎన్నికల్లో ఎన్డీఏకు 353 స్థానాలు రావడం తెలిసిందే. ఇక కాంగ్రెస్‌కు 41 నుంచి 43 సీట్ల కన్నా రావని నెలక్రితం అంచనా వేసిన ఫలోదీ పందెంరాయుళ్లు కాస్తా, 58 నుంచి 62 స్థానాలు గెలుస్తుందని తాజాగా బెట్లు కడుతున్నారు. 2019లో కాంగ్రెస్‌కు 52 స్థానాలొచ్చాయి. ఈసారి నాలుగు విడతల్లో పోలింగ్ 2019 ఎన్నికలతో పోలిస్తే కాస్త తగ్గడం తెలిసిందే. తదనుగుణంగా ఫలోదీ మార్కెట్ కూడా బీజేపీ విషయంలో అంచనాలను సవరించుకున్నట్టు కనిపిస్తోంది.

కచ్చితత్వం ఎక్కువ...

ఎన్నికల ఫలితాల విషయంలో ఫలోదీ మార్కెట్ ఏం చెబితే అదే జరుగుతుందన్న నమ్మకముంది. ఇటీవలి ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై ఫలోదీ బుకర్ల అంచనాలే అక్షరాలా నిజమయ్యాయి. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్ విషయంలో దాదాపుగా ఎగ్జిట్ పోల్స్ అన్నీ తలకిందులు కాగా సట్టా బజార్ అంచనాలు మాత్రమే నిజమయ్యాయి.

రాష్ట్రాలవారీగా..

ఫలోదీ సట్టా బజార్ తాజా బెట్టింగ్‌ల ప్రకారం బీజేపీ గుజరాత్‌లో క్లీన్‌స్వీప్ చేస్తుంది. 26 స్థానాలూ గెలుస్తుంది. మధ్యప్రదేశ్‌లోని 29కి 27-28 రావచ్చు. రాజస్తాన్‌లో 2019లో 24 గెలవగా ఈసారి 18-20తో సరిపెట్టుకోవచ్చు. ఒడిశాలోని మరో 4 స్థానాలు అదనంగా 11 నుంచి 12 రావచ్చు. పంజాబ్‌లో 2019లో రెండు గెలవగా ఈసారి 2 నుంచి 3 రావచ్చు. మొత్తం 10 స్థానాలూ గెలిచిన హరియాణాలో 5 నుంచి 6తో సరిపెట్టుకోవచ్చు. తెలంగాణలో 4 గెలవగా ఈసారి 5 నుంచి 6 రావచ్చు. ఛత్తీస్‌గఢ్‌లోని 11, హిమాచల్‌ప్రదేశ్‌లోని 4, ఉత్తరాఖండ్‌లోని 5 స్థానాలనూ బీజేపీ క్లీన్‌స్వీప్ చేస్తుంది. జార్ఖండ్‌లో మళ్లీ 10 నుంచి 11 దాకా రావచ్చు. 2019లో ఒక్క సీటూ నెగ్గని తమిళనాడులో 3 నుంచి 4 స్థానాలు రావచ్చని బెట్టింగులు నడుస్తున్నాయి. కీలకమైన పశ్చిమబెంగాల్‌లో 2019లో 18 చోట్ల గెలవగా ఈసారి 21 నుంచి 22 దాకా రావచ్చు. యూపీలో 63 చోట్ల గెలిచిన బీజేపీ ఈసారి మరో రెండు సీట్లు పెంచుకోవచ్చని సట్టా బజార్ అంచనా.

బీజేపీ స్థానాలు	బెట్టింగ్ (అంచనా నిజమైతే ప్రతి రూపాయికీ చెల్లించాల్సిన మొత్తం)
300	30-37 పైసలు
310	55-65 పైసలు
320	110-160 పైసలు
325	150-225 పైసలు

కాంగ్రెస్ స్థానాలు	బెట్టింగ్
35	28-35 పైసలు
40	35-45 పైసలు
50	30-200 పైసలు

– సాక్షి, నేషనల్ డెస్క్



కాశీ చుట్టూ ప్రదక్షిణం!

మోదీ కోసం వారణాసిలో దక్షిణాది నేతల ప్రచారం
- తెలుగు, తమిళ, కన్నడ సంఘాలను ఆకట్టుకునే యత్నం
- తెలుగు రాష్ట్రాల నుంచి బండి, జీవీఎల్, పొంగులేటి తదితరులు
- తమిళనాడు, కర్నాటక చీఫ్‌లు అన్నామలై, బీవై విజయేంద్ర మకాం

దక్షిణాది రాష్ట్రాల బీజేపీ నేతలు పాలోమని కాశీ బాట పడుతున్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసి లోక్‌సభ స్థానంలో మూడోసారి పోటీ చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి మద్దతుగా ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. అక్కడ అధికంగా ఉండే దక్షిణాది ప్రజల ఓట్లే లక్ష్యంగా కలియదిరుగుతున్నారు. తెలుగు, తమిళ సంఘాలతో సమావేశమవుతున్నారు. నగరంలో పెద్ద సంఖ్యలో ఉన్న దక్షిణాది ఆశ్రమాల పెద్దలతో ఉదయం, సాయంత్రం భేటీలు నిర్వహిస్తున్నారు.

దక్షిణాది వారే కీలకం..

వారణాసి నియోజకవర్గంలో 18.50 లక్షల ఓట్లున్నాయి. వీరిలో దక్షిణాది ఓటర్లు కనీసం 3 లక్షల పై చిలుకే ఉంటారు. తెలుగు, తమిళ ఓటర్లు 2 లక్షల దాకా ఉంటారు. కన్నడ, మలయాళీలు లక్ష మంది ఉన్నారు. కాశీలోనే దక్షిణాది రాష్ట్రాల నిర్వహణలో కనీసం 200 వరకు ఆశ్రమాలున్నాయి. ఇలా వారణాసిలో దక్షిణాది ఓటర్లు కీలకంగా మారారు. 2019 ఎన్నికల్లో మోదీ 6.74 లక్షల ఓట్లు (63.62 శాతం) సాధించారు. ఈసారి ఏకంగా 80 శాతం ఓట్లను బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది. అందులో భాగంగా దక్షిణాది వారి ఓట్లు అత్యధికంగా మోదీకే వచ్చేలా చూడాలని అధిష్టానం భావిస్తోంది. దాంతో ఆయా రాష్ట్రాల కీలక నేతలు ఇప్పటికే రంగంలోకి దిగి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రతి 50 మంది ఓటర్లకు ముగ్గురు, నలుగురితో కూడిన బృందం చొప్పున పని చేస్తోంది! అంతేగాక ఒక్కో బృందం రోజుకు 4 నుంచి 5 సమూహాలతో భేటీలు నిర్వహిస్తోంది. వారణాసిలో ఇలాంటి బృందాలు ఏకంగా 2,000 దాకా పనిచేస్తున్నాయని బీజేపీ నేతలు చెబుతున్నారు!

ఈ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గత డిసెంబర్ నుంచే తెలుగు, తమిళ సంగమం పేరుతో వారణాసిలో బీజేపీ పలు కార్యక్రమాలు నిర్వహించింది. మోదీ వర్చువల్‌గా వాటిలో పాల్గొన్నారు. దక్షిణ కాశీగా పేర్కొనే వేములవాడకు కాశీతో ఉన్న సంబంధాన్ని గుర్తు చేస్తూ తెలుగు ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. కాశీలో నివసించే దక్షిణాది వారి జీవన ప్రమాణాల మెరుగుదలకు తీసుకున్న చర్యల గురించి వివరించారు. వారణాసి రైల్వే స్టేషన్‌తో పాటు ప్రధాన దారులు, కూడళ్లలో దక్షిణాది పర్యాటకుల సౌలభ్యం కోసం తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో ప్రకటనలు తదితరాలు ఏర్పాటు చేయించడాన్నీ గుర్తు చేశారు.

కీలక నేతలంతా అక్కడే..

వారణాసిలో చివరిదైన ఏడో విడతలో భాగంగా జూన్ 1న పోలింగ్ జరగనుంది. అక్కడి దక్షిణాది ఓటర్లతో సమన్వయ బాధ్యతలను తెలంగాణ బీజేపీ ఇన్‌చార్జి సునీల్ బన్సల్‌కు అధిష్టానం అప్పగించింది. ఆయన వారం రోజులుగా అక్కడే ఉంటూ పర్యవేక్షిస్తున్నారు. తెలంగాణ నుంచి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్, నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బి.బి.పాటిల్, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్; ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపీ జీవీఎల్ నరసింహారావు, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, తమిళనాడు నేతలు గాయత్రీ దేవి, ఆర్.రాజలక్ష్మి, సి.టి.పళనిస్వామి, తిరునల్వేలి బీజేపీ అభ్యర్థి నయనార్ నాగేంద్రన్, కె.గోపాలస్వామి, కేరళకు చెందిన పీకే కృష్ణదాస్, కుమ్మనం రాజశేఖర్ తదితరులు జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఆదివారం నుంచి బీజేపీ తమిళనాడు, కర్ణాటక అధ్యక్షులు అన్నామలై, బి.వై.విజయేంద్ర కూడా వారణాసిలోనే వారం పాటు మకాం వేసి ప్రచారం చేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. ''మోదీ కూడా ఆదివారం నుంచి వారణాసిలో సభలు, ర్యాలీల్లో పాల్గొంటారు. దక్షిణాది రాష్ట్రాల ప్రజలతోనూ ఆయన మమేకమయ్యేలా కార్యక్రమం ఏర్పాటు చేసే యోచన ఉంది'' అని బీజేపీ కీలక నేత ఒకరు వెల్లడించారు.

– సాక్షి, న్యూఢిల్లీ

మల్లన్న సేవలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి



స్వామి అమ్మవార్ల జ్ఞాపికను సీఎం దంపతులకు అందజేస్తున్న వేదపండితులు

శ్రీశైలం: శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను మధ్యప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా సున్నిపెంట చేరుకున్న ఆయన శ్రీశైలంలోని వీవీఐపీ అతిథి గృహానికి చేరుకున్నారు. అక్కడ నుంచి నేరుగా స్వామి అమ్మవార్లను దర్శించుకోవడానికి ప్రధాన రాజగోపురం వద్దకు రాగా, ఆలయ అర్చకులు వేద పండితులు ఆహ్వానం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి దంపతులు కుటుంబ సమేతంగా స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వేద పండితులు ఆశీర్వచనాలు పలికి స్వామి అమ్మవార్ల శేష వస్త్రాలు, లడ్డూ ప్రసాదాలు అందజేశారు. ఆ తర్వాత ఆలయ ప్రాంగణంలో ఛత్రపతి శివాజీకి ఖడ్గ ప్రదానం చేసిన అమ్మవారి విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం 1.30 గంటలకు సున్నిపెంట నుంచి హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ భక్తులతో నిండాయి. క్యూ శిలాతోరణం వద్దకు చేరింది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 70,668 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. టికెట్లు లేని భక్తులకు దర్శనానికి 20 గంటల సమయం పడుతోంది.

పద్మావతి, కామాక్షితాయి అమ్మవార్ల సేవలో 'సుప్రీం' న్యాయమూర్తి



తిరుచానూరు ఆలయం వెలుపల కుటుంబ సభ్యులు, అధికారులతో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవికుమార్

చంద్రగిరి(తిరుపతి జిల్లా)/బుచ్చిరెడ్డిపాళెం రూరల్: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవికుమార్ శనివారం కుటుంబ సభ్యులతో కలిసి తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆయన శ్రీవారి మెట్టు నడక మార్గంలో రాత్రి 9.30 గంటలకు తిరుమల చేరుకున్నారు. అంతకుముందు శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, బుచ్చిరెడ్డిపాళెం మండలం, జొన్నవాడలోని స్వయంభూ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవికుమార్ దంపతులు దర్శించుకున్నారు.

ఆంధ్రప్రదేశ్

పదుల సంఖ్యలో వీడియో సాక్ష్యాలు..
అయినా 'పచ్చ'పాతమే!

పోలింగ్ రోజు, ఆ తర్వాత టీడీపీ గూండాల స్వైర విహారం

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఓట్లేయనీయకుండా దాడులు

వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారనే కారణంతో విధ్వంసాలు

పల్నాడులో పచ్చమూకల దాడులపై వీడియోలు తీసిన ప్రజలు

- ఒక్కొక్కటిగా బయటకు వస్తున్న టీడీపీ హింసాత్మక చర్యలు
- దుకాణాలపై రాళ్లు, బైక్‌ల ధ్వంసాలు, దహనాలు, లూటీలు..
- పట్టపగలు విధ్వంసకాండను చూసి ఆందోళన వ్యక్తం చేస్తున్న జనం
- టీడీపీ దారుణాలు కళ్లెదుటే కనిపిస్తున్నా పట్టించుకోని పోలీసులు
- హత్యాయత్నం, అట్రాసిటీ కేసులున్నప్పటికీ చూసీచూడనట్లు వ్యవహారం
- చిన్న చిన్న సాకులతో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై మాత్రం జులుం
- వెంటాడి కేసుల నమోదు.. భయభ్రాంతులకు గురిచేస్తూ దండనలు
- ఇంకోవైపు ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోని ఈసీ
- బడుగు, బలహీన వర్గాల బాధితుల వేదన అరణ్య రోదనగా మారిన వైనం



పోలింగ్ మరుసటి రోజు పల్నాడు జిల్లా కారంపూడి వీధుల్లో మారణాయుధాలతో దాడులు చేస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్న టీడీపీ గూండాలు

రాష్ట్రంలో టీడీపీ గూండాలు సాగిస్తున్న విధ్వంసకాండ గురించి పదుల సంఖ్యలో వెలుగు చూస్తున్న వీడియోలు ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. మనం ఉంటున్నది ప్రజాస్వామ్య దేశంలోనేనా లేక ఆటవిక రాజ్యంలో ఉంటున్నామా.. అనే అనుమానం కలుగుతోంది. గుంపులు గుంపులుగా తోడేళ్ల మందలా వచ్చి దుకాణాలు, ఇళ్లపై పడుతున్నారు. కుర్చీలు, బల్లలు, మోటార్ సైకిళ్లను లాక్కొచ్చి రోడ్లపై పడేస్తున్నారు. లావుపాటి కర్రలు, ఇనుప రాడ్లతో వాటిని ధ్వంసం చేస్తున్నారు. ఆయిల్ ట్యాంక్ పగులగొట్టి నిప్పంటిస్తున్నారు. నిర్భయంగా, నిబ్బరంగా వచ్చిన దారిన కేకలు వేసుకుంటూ వెళ్లిపోతున్నారు. ఆ దృశ్యాలు చూస్తుంటే సినిమాల్లో సీన్లు కళ్ల ముందు మెదులుతున్నాయి. ఇంత జరుగుతున్నా పోలీసులు స్పందించక పోవడం విస్తుగొలుపుతోంది. పైగా ఎక్కడ, ఏ చిన్న గొడవ జరిగినా.. దాన్ని వైఎస్సార్‌సీపీకి అంటగడుతూ ఎల్లో మీడియా, ఎల్లో బ్యాచ్ దుష్ప్రచారం సాగిస్తోంది. ఒక్క మాటలో చెప్పాలంటే అటు ఈసీ, ఇటు పోలీసులు.. టీడీపీ అనుబంధ సంఘాలన్నట్లు వ్యవహరిస్తుండటం దారుణం.

సాక్షి, నరసరావుపేట: రాష్ట్రంలో పోలింగ్ సందర్భంగా టీడీపీ గూండాలు, రౌడీలు పేట్రేగిపోయారు. యథేచ్ఛగా రిగ్గింగ్ చేస్తూ అడ్డుకున్న వైఎస్సార్‌సీపీ నేతలు, శ్రేణులను దారుణంగా చితకబాదారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు, మైనార్టీలు వైఎస్సార్‌సీపీకి ఓటేయనీయకుండా వారిపై అత్యంత పాశవికంగా దాడులకు తెగబడ్డారు. కొన్నిచోట్ల ఈ వర్గాలు తమకు ఓట్లేయలేదని వారి ఇళ్లను ధ్వంసం చేశారు. దుకాణాలను లూటీ చేశారు. ఇదేంటని అడ్డుకోవడానికి ప్రయత్నించినవారిని చావ బాదారు. స్వగ్రామాలను వదిలేసి బిక్కుబిక్కుమంటూ వేరే ఊళ్లలో తల దాచుకునేలా టీడీపీ మూకలు స్వైర విహారం సాగించాయి. చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు టీడీపీ గూండాలకే కొమ్ముకాశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు తమను కాపాడండి అంటూ ఆర్తనాదాలు చేసినా ఏ ఒక్క పోలీసూ పట్టించుకోలేదు. రాష్ట్రంలో పల్నాడు జిల్లా మాచర్ల, నరసరావుపేట, అనంతపురం జిల్లా తాడిపత్రి, తిరుపతి జిల్లా చంద్రగిరి, తదితర ప్రాంతాల్లో టీడీపీ గూండాల దాడిని పోలీసులు చేష్టలుడిగి వేడుకలా చూశారు. మే 13న పోలింగ్ ముగిసిననాటి నుంచి వెలుగు చూస్తున్న వీడియోలు టీడీపీ శ్రేణులు అరాచకాలు, విధ్వంస కాండను కళ్లకు కట్టినట్టు చూపుతున్నా పోలీసులు గట్టి చర్యలు తీసుకుంటే ఒట్టు. మాచర్ల ప్రాంతంలో పచ్చ మూక విధ్వంసం గురించి పదుల సంఖ్యలో వీడియోలు వైరల్ అవుతున్నా, వాటి గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదు. అటు ఈసీ, ఇటు పోలీసులు టీడీపీ అనుబంధ సంఘాలన్నట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం. అదే మాచర్లలో ఒక్క వీడియోను సాకుగా చూపిస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణులను మాత్రం వెంటాడి వేధిస్తున్నారు. హత్యాయత్నం కేసులు, అట్రాసిటీ కేసులు నమోదు చేస్తూ 'పచ్చ'పాతం చూపుతున్నారు.



ఒక ఇంటిపై దాడి చేసి బైక్‌ను తగలబెడుతున్న టీడీపీ మూక

పోలీసుల మద్దతుతోనే టీడీపీ మూక దాడులు

ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారన్న అక్కసుతో టీడీపీ మూక పల్నాడు జిల్లాలో చేసిన అకృత్యాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. పౌర సమాజం భయభ్రాంతులకు గురయ్యేలా వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై అత్యంత పాశవికంగా టీడీపీ గూండాలు జరిపిన దాడి వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా పోలీసుల తీరుపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతమని ముందే తెలిసినా తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. టీడీపీ చేసిన దాడికి కొంత మంది పోలీసుల మద్దతుందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పోలింగ్ మరుసటి రోజు మే 14న కారంపూడిలో బుడగ జంగాలు, దళితులు, ముస్లింలపై టీడీపీ మూకలు రెచ్చిపోయాయి. ఆ రోజు వందలాది మంది టీడీపీ రౌడీల దారుణ కాండను కొంత మంది ప్రజలు ఇళ్ల మీద నుంచి సెల్‌ఫోన్లలో వీడియోలు తీశారు. అందులో బడుగు, బలహీనవర్గాలకు చెందిన దుకాణాలు, ఇళ్లు, వాహనాలను టీడీపీ మూక ధ్వంసం చేస్తున్న దృశ్యాలు రికార్డు అయ్యాయి. వాటిలో ఒక వీడియో తీస్తున్న కుటుంబ సభ్యులు ఇంతవరకు ఇక్కడే ఉన్న పోలీసులు సమయానికి లేకుండా ఎటుపోయారని ఒకటికి రెండు సార్లు అనుకోవడం వీడియోలో రికార్డు అయ్యింది. ఆ సమయంలో టీడీపీ గూండాలు మారణాయుధాలతో చేస్తున్న స్వైరవిహారం చూసి భయపడిన కూతురు ఇంట్లోకి వెళ్లి తాళాలు వేసుకుందామని అనగా.. ఇంకో వీడియో తీస్తున్న వ్యక్తి.. 'దాడి చేస్తున్నవారు మన టీడీపీ వాళ్లు.. మనల్ని ఏం చేయరు' అని తన కుమార్తెకు భరోసానివ్వడం గమనార్హం. ఇప్పుడు ఈ వీడియోలన్నీ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

టీడీపీ మూకలపై చర్యలేవి?

టీడీపీ రౌడీలు, గూండాలు మారణాయుధాలతో విధ్వంస కాండకు దిగిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నా పోలీసులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాము ఇంతగా వీడియోల ద్వారా ఆధారాలు అందిస్తున్నా పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని టీడీపీ మూక దాడుల బాధితులు ప్రశ్నిస్తున్నారు. అయితే ఈ విషయంపై మాట్లాడేందుకు, సమాచారం ఇచ్చేందుకు జిల్లా పోలీసులెవరూ ముందుకు రావడం లేదు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా వివరాలు వెల్లడించలేమంటున్నారు. కారంపూడి ఘటనలో వందలాది మంది టీడీపీ గూండాలు విధ్వంస కాండకు దిగారు. ఈ దాడులకు సంబంధించి ఇప్పటివరకు ఎంతమందిని గుర్తించారు, ఎందరిపై కేసు నమోదు చేశారనేది తెలియనీయడం లేదు. ఇటీవల పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయానికి వచ్చిన ఓ ఉన్నతాధికారి కేసుల నమోదు, ఇతరత్రా వివరాలేవీ తనకు తెలియకుండా బయటకు వెళ్లనివ్వొద్దని హెచ్చరికలు జారీ చేసినట్టు తెలుస్తోంది. దీంతో పోలీసులు ఏ సమాచారం బయటకు రానివ్వడం లేదు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులపై కేసుల నమోదుకు ఉత్సాహం..

వందలాది వీడియోల రూపంలో ఆధారాలు ఉన్నా టీడీపీ మూకలపై చర్యలు తీసుకోని పోలీసులు.. మరోవైపు మాచర్ల, నరసరావుపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు.. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత పిన్నెల్లి వెంకటరామిరెడ్డి లాంటి వారిపైన మాత్రం కేసుల నమోదుకు ఎక్కడలేని ఉత్సాహం చూపుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇల్లు, ఆస్పత్రిని విధ్వంసం చేయడంతోపాటు వైఎస్సార్‌సీపీ ఎస్సీ నేతలపై హత్యాయత్నం కేసుల్లో నిందితుడైన టీడీపీ నరసరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి చదలవాడ అరవింద్‌బాబు, ఆయన అనుచరులను అరెస్ట్ చేయడంలో పోలీసులు నిలువెత్తు నిర్లక్ష్యం చూపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పల్నాడులో 144 సెక్షన్ అమలవుతున్న నేపథ్యంలో శాంతియుతంగా ఉండాల్సిన చదలవాడ అరవింద్‌బాబు ఇంట్లోనే నిరసన దీక్షలు పేరిట మీడియాకు వీడియోలు, ఫొటోలు పంపి రెచ్చగొట్టే ప్రయత్నాలు మానుకోకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో టీడీపీ నేతలపై తగిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నేతలు మర్రి రాజశేఖర్, రావెల కిషోర్ బాబు తదితరులు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాకి శనివారం వినతిపత్రం అందజేశారు. ఎన్నికల కౌంటింగ్ దగ్గరపడుతున్న నేపథ్యంలో మళ్లీ టీడీపీ మూకలు హింసకు పాల్పడకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలని ప్రజలు కూడా కోరుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు 'పచ్చ'పాతాన్ని మానుకోవాలని విన్నవిస్తున్నారు.

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
ఆదివారం ॥ 26-5-2024




నయన చిన్నారి తారలు

పిల్లలు నవ్వినా అందమే, ఏడ్చినా అందమే. ఏ కోణంలో చూసినా అందమే అందం!

నయనతార తన కవల పిల్లల ఫొటోలను సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేస్తూ మురిసిపోతుంటుంది. తాజా విషయానికి వస్తే... తన కవల పిల్లలతో నయన ఆనంద క్షణాలను పట్టించే వీడియో నెటిజనులను ఆకట్టుకుంటోంది. పిల్లలతో సింపుల్‌గా ఆటో ప్రయాణం చేసిన నయనతార ఈ ఆటో రైడ్ విజువల్స్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది.

'సూపర్ స్టార్'గా పేరు తెచ్చుకున్న నయనతార సింపుల్‌గా ఆటోలో ప్రయాణించడం నెటిజనులను బాగా ఆకట్టుకుంది. పలువురు నెటిజనులు ఈ వీడియోను తమ సోషల్ పేజీలో షేర్ చేస్తున్నారు. మాతృత్వంలోని మధురిమ గురించి తీయటి కామెంట్‌లు పెడుతున్నారు.



భారతీయ సినిమా పాటలకు విదేశీయులు డ్యాన్స్ చేయడం కొత్త కాదు. అయితే జపాన్‌లో మాత్రం బాలీవుడ్ హిట్ సినిమాల ఐకానిక్ సీన్‌లను రీక్రియేట్ చేసే కొత్త ట్రెండ్ మొదలైంది. బాలీవుడ్ మూవీ 'కభీ ఖుషీ కభీ ఘమ్' (కె3జి)లో అంజలిగా కాజోల్, రాహుల్‌గా షారుఖ్ ఖాన్ నటించారు. రాహుల్, అంజలి వేషధారణలో జపనీస్ ఇన్‌ఫ్లూయెన్సర్లు మాయో, కకే టకులు 'కె3జి'లోని 'బడే మజాకీ హో' కామెడీ సీన్‌ను రీక్రియేట్ చేశారు. 'లెర్నింగ్ హిందీ ఇన్ 2024 ఈజ్ లైక్ బడే మజాకీ హో' కాప్షన్‌తో పోస్ట్ చేసిన ఈ వీడియో వైరల్ అయింది. హిందీలో ప్రావీణ్యం సంపాదించిన మాయో, కకే టకుల లిప్ సింక్ బాగా కుదిరింది. 'క్రాస్-కల్చరల్ అడ్మిరేషన్ అనేది భౌగోళిక సరిహద్దులను చెరిపేసి అందరినీ ఒక గొడుగు కిందికి తీసుకువస్తుంది. పర్యాటక ఆసక్తి పెంచుతుంది'... లాంటి కామెంట్స్ ఎన్నో యూజర్‌ల నుంచి వచ్చాయి.

అరరే... ఇట్లయితే ఎట్ల!



ఆకాశంలో ఉన్న ధరలను ఉద్దేశించి బాగా పాపులర్ అయిన పాట 'ఏం కొనేటట్లు లేదు... ఏం తినేటట్లు లేదు'.... అయితే సమస్య ఇప్పుడు ధరల గురించి కాదు. కల్తీ గురించి. కెమికల్స్ గురించి. మండే ఎండా కాలంలో మనకు మంచి నేస్తం...పుచ్చకాయ. చివరికి పుచ్చకాయను కూడా కల్తీ చేస్తున్నారు.

సోషల్ ఎక్స్‌పెరిమెంట్ డెమోన్‌స్ట్రేషన్స్‌లో భాగంగా పోస్ట్ చేసిన వీడియో ఒకటి విపరీతంగా వైరల్ అయింది. ఈ వీడియోలో ముసుగు ధరించిన ఒక వ్యక్తి పుచ్చకాయలో కెమికల్స్‌ను ఇంజెక్ట్ చేస్తుంటాడు.

కల్తీ సముద్రం మధ్య సహజమైన, రసాయన రహిత పుచ్చకాయలను ఎలా గుర్తించాలో తెలియజేసే 'చెక్ యువర్ వాటర్‌మెలన్' ఇన్‌స్టాగ్రామ్ వీడియోలు వైరల్ అవుతున్నాయి.

వైరల్

ఎంత చక్కగా చెప్పింది!



జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించి బాలీవుడ్ నటులు ఆలియా భట్, కంగనా రనౌత్‌లు సోషల్ మీడియాలో ఎక్కువగా ట్రోల్ అవుతుంటారు. 'సినిమా వాళ్లకు సినిమా విషయాలు తప్ప సామాజిక, చారిత్రక విషయాలు తెలియవు' అనే అపోహను పటాపంచలు చేసింది జాన్వీ కపూర్. తాజా ఇంటర్వ్యూ ఒకటి జాన్వీకి చారిత్రక విషయాలపై ఉన్న అవగాహనకు అద్దం పట్టేలా ఉంది. మహాత్మా గాంధీ, బాబా సాహెబ్ అంబేద్కర్‌ల మధ్య సైద్ధాంతిక చర్చ గురించి జాన్వీ మాట్లాడిన తీరు నెటిజనులను ఆకట్టుకుంది.

'చరిత్ర' తన ఇష్టమైన సబ్జెక్ట్‌గా చెప్పింది జాన్వీ కపూర్.

స్లిప్పర్-బ్యాక్ ఇన్ యాక్షన్

రష్యన్ ఇన్‌ఫ్లూయెన్సర్ మారియా చుగురోవా మన దేశానికి రావడమే కాదు థోడా థోడా హిందీ మాట్లాడడం కూడా నేర్చుకుంది. చెప్పు తెగడంతో స్థానిక చెప్పుల వ్యాపారి దగ్గరికి వెళ్లి 'భయ్యా... చెప్పల్ తుట్‌గయా' అన్నది.

చెప్పుల వ్యాపారి వికాస్ మంత్రం వేసినట్లు ఆ చెప్పును మామూలు స్థితికి తీసుకువచ్చాడు. 'ధన్యవాద్' అని హిందీలో థ్యాంక్స్ చెప్పింది. అతడి రిపేరింగ్ స్కిల్స్ కంటే మారియాతో ఇంగ్లీష్‌లో ఫ్లూయెంట్‌గా మాట్లాడడం నెటిజనులను అబ్బురపరిచింది. చెప్పులు రిపేర్ చేయడంలో వికాస్‌కు 26 సంవత్సరాల అనుభవం ఉంది.

'మోచీ హెల్ప్‌డ్ ఏ రష్యన్ ఇన్ ఏ డిఫికల్ట్ సిచ్యువేషన్. స్లిప్పర్-బ్యాక్ ఇన్ యాక్షన్. నమస్తే దోస్తో' కాప్షన్‌తో మారియా పోస్ట్ చేసిన ఈ వీడియో 6.8 కోట్ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది.

'రష్యన్‌లు ఇంగ్లీష్ అంతంత మాత్రమే మాట్లాడతారు. మారియా మాత్రం హిందీ బాగా మాట్లాడింది' అని ఒకరు కామెంట్ పెట్టారు.





దుస్సాహసాలు వద్దండీ...

'**రీల్స్**' చేయడం... 'శభాష్' అనిపించుకోవడం మంచిదేగానీ... ఎలాగైనా 'లైక్'లు తెచ్చుకోవాలనే అత్యుత్సాహానికి ఒక్కోసారి ప్రాణాలను సైతం మూల్యంగా చెల్లించాల్సి ఉంటుంది. తాజా విషయానికి వస్తే... ఝార్ఖండ్‌లోని సాహిల్ గంజ్‌కు చెందిన తౌసిఫ్ ఇన్‌స్టాగ్రామ్ 'రీల్స్' చేస్తుంటాడు. అలా ఓ 'రీల్' కోసం బాగా ఎత్తైన చోటు నుంచి నీళ్లలోకి జంప్ చేసి ప్రాణాలు కోల్పోయాడు. 'రీల్ అటెంప్ట్ టర్న్‌డ్ ఫేటల్' కాప్షన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో క్లిప్ వైరల్ కావడమే కాదు సోషల్ మీడియాలో దీని గురించి చర్చ జరిగింది. స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు స్టంట్స్ స్కిల్స్, సేఫ్టీ మెజర్స్ అవసరం లేదనుకునే యువతరం ఈ విషాదం నుంచి గుణపాఠం నేర్చుకోవాలని నెటిజనులు కోరుతున్నారు.

స్పెయిన్‌లో సకల్ బన్

సంజయ్ లీలా బన్సాలీ నెట్‌ఫ్లిక్స్ షో 'హీరామండీ: ది డైమండ్ బజార్'లోని అద్భుతమైన కాస్ట్యూమ్స్, డ్యాన్స్ సీక్వెన్స్‌లు కళాప్రియులను ఆకట్టుకున్నాయి.

'హీరామండీ'లోని డైలాగులు, పాటలు, సీన్‌లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ఇప్పుడు ఈ నెట్‌ఫ్లిక్స్ షో హవా స్పెయిన్ వరకు వీచింది. ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్(ఐసీసీఆర్) ఆర్టిస్ట్ పూర్ణతా మొహంతి, డాక్టర్ వినతా శ్రీరామ్‌తో కలిసి స్పెయిన్‌లోని మాడ్రిడ్‌లో 'హీరామండీ'లోని 'సకల్ బన్' పాటకు ఒడిస్సీ, భరతనాట్యం చేస్తూ 'ఆహా' అనేలా అభినయించింది. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో వైరల్ అయింది.



'కవి అమీర్ ఖుస్రోకు తన గురువు హజ్రత్ నిజాముద్దీన్‌పై ఉన్న భక్తి నుంచి ఈ పాట పుట్టింది' అంటూ 'సకల్ బన్' పాట చరిత్ర గురించి సంక్షిప్తంగా తన పోస్ట్‌లో రాసింది పూర్ణత.

'తాండవ్ నుంచి ఉద్భవించిన రెండు విభిన్న నృత్యరూపాలను ఒకేచోట చూడడం ఆనందంగా ఉంది' అని ఒక యూజర్ స్పందించాడు.

హెల్త్



ప్రోస్టేట్ క్యాన్సర్‌తో జర భద్రం!



పురుషుల ప్రత్యుత్పత్తి వ్యవస్థలో ప్రోస్టేట్ (పౌరుష) గ్రంథి చాలా కీలకం. బాదం పండు ఆకృతిలో ఉండే ఈ గ్రంథి స్రవించే ద్రవంలోనే శుక్రకణాలు ఈదులాడుతూ మానవ మనుగడను సుసాధ్యం చేస్తుంటాయి. మధ్య వయసు దాటాక ఈ గ్రంథి అమాంతం సైజు పెరిగే అవకాశముంది. చాలావరకు నిరపాయకరమే అయినా ఆ పెరుగుదల కొన్నిసార్లు క్యాన్సర్‌కు దారితీసే ప్రమాదముంది. అందుకే 50 - 55 ఏళ్ల వయసు దాటాక ఈ గ్రంథిలో ఏమైనా పెరుగుదల ఉందా లేదా అన్నది పరీక్ష ద్వారా తెలుసుకుంటూ ఉంటే, జబ్బును సగం నివారించుకున్నట్లే..


ప్రపంచంలో పురుషులకు ఎక్కువగా వచ్చే క్యాన్సర్ రకాల్లో ఇది రెండోది. (మొదటిది ఊపిరితిత్తుల క్యాన్సర్). ఇది నెమ్మదిగా విస్తరిస్తుంది కాబట్టి గుర్తించి వెంటనే జాగ్రత్త పడటానికి సమయం దొరుకుతుంది. అయితే తొలి దశలో లక్షణాలు వెంటనే కనిపించకపోవడం ఆందోళనకరమైన విషయం.

లక్షణాలు: • తరచూ మూత్ర విసర్జనకు వెళ్లాల్సి రావడం • రాత్రి తరచూ మూత్రానికి వెళ్లాలనిపిస్తూ ఉండటం • మూత్రంలో రక్తం, మూత్ర విసర్జన సమయంలో నొప్పి, మంట • బలహీనమైన మూత్రధార • వెన్ను కింది భాగం, పిరుదులు, తొడలలో నొప్పి • బరువు తగ్గిపోతూ ఉండటం • కూర్చోవడంలో ఇబ్బంది • కొన్నిసార్లు పాదాలు లేదా కాళ్ల వాపు.



కారణాలు: • పెరిగే వయసు (50 - 55 దాటాక) • ఊబకాయం • కుటుంబ ఆరోగ్య చరిత్రలో ఈ సమస్య ఉండటం • పొగ, మద్యం అలవాట్లు • రసాయనాలకు ఎక్స్‌పోజ్ కావడం.

గుర్తించడం ఇలా: • డిజిటల్ రెక్టల్ ఎగ్జామినేషన్ అనే పరీక్ష • ప్రోస్టేట్ స్పెసిఫిక్ యాంటీజెన్ (పీఎస్‌ఏ) అనే రక్తపరీక్ష (ఈ రెండు పరీక్షలతో ప్రోస్టేట్ క్యాన్సర్‌ను గుర్తించవచ్చు. అయితే మూత్ర సంబంధ ఇన్ఫెక్షన్లు, విపరీతమైన వ్యాయామం, ప్రోస్టేట్‌కు ఉండే ఇతర సమస్యల్లోనూ పీఎస్‌ఏ విలువలు పెరుగుతాయని గుర్తుంచుకుని ఆ మేరకు జాగ్రత్తగా విశ్లేషించాలి) • ఇమేజింగ్ (అల్ట్రా సౌండ్, సీటీ స్కాన్, ఎమ్మారై, బోన్‌స్కాన్ వంటివి) • బయాప్సీ (పూర్తిస్థాయి నిర్ధారణ కోసం చేసే పరీక్ష)



నివారణ: • తాజాపండ్లతో ఆరోగ్యకరమైన సమతుల ఆహారం, వేళకు తినడం. (అవిశె గింజలు, సెలెనియమ్ మోతాదులు ఎక్కువగా ఉండే ట్యూనా వంటి చేపలు, బీటా కెరొటిన్ ఉండే క్యారట్లు, పాలకూర వంటి ఆకుకూరలు తీసుకోవడం, వేట మాంసానికి (రెడ్ మీట్‌కు) వీలైనంత దూరంగా ఉండటం) • ఎత్తుకు తగినట్లుగా బరువు నియంత్రించుకోవడం, అందుకోసం క్రమబద్ధమైన వ్యాయామం చేయడం • పొగ తాగే అలవాటుకు దూరంగా ఉండటం.

చికిత్స: • మొదట్లో **యాక్టివ్ సర్విలెన్స్:** లక్షణాలు తక్కువగా ఉన్నప్పుడు క్యాన్సర్ పెరుగుతున్న తీరును జాగ్రత్తగా గమనిస్తూ, లక్షణాలు తీవ్రం కాగానే వెంటనే చికిత్స మొదలుపెట్టడం.

శస్త్రచికిత్స: ఇందులో అనేక రకాలుంటాయి. ఉదాహరణకు • 'రాడికల్ ప్రోస్టెటెక్టమీ'లో పరిసరాల్లోని లింఫ్ నోడ్స్‌తో పాటు మొత్తం ప్రోస్టేట్‌ను తొలగిస్తారు • 'రొబోటిక్ లేదా లాపరోస్కోపిక్ ప్రోస్టెటెక్టమీ' లో గాటుపెట్టి రోబోసాయంతో ప్రోస్టేట్‌ను తొలగిస్తారు • 'బైలేటరల్ ఆర్కియాక్టమీ'లో ప్రోస్టేట్‌తో పాటు వృషణాల్లో ఉండే రెండు బీజాలను (టెస్టిస్)ను తొలగిస్తారు. ప్రోస్టేట్ అక్కడికీ పాకినప్పుడు ఈ శస్త్రచికిత్స చేస్తారు.

రేడియేషన్ థెరపీ: • క్యాన్సర్ కణాలను తుదముట్టించేలా శక్తిమంతమైన రేడియేషన్ కిరణాలతో చికిత్స అందించడం

అడ్వాన్స్‌డ్ ప్రోస్టేట్ క్యాన్సర్‌కు **కీమో థెరపీ:** • క్యాన్సర్ కేవలం ప్రోస్టేట్‌కు మాత్రమే పరిమితం కాకుండా ఇతర చోట్లకూ పాకిందని అనుమానించినప్పుడు కీమో మందులతో ఇతర చోట్లకు పాకిన అన్ని క్యాన్సర్ కణాలనూ తుదముట్టించడం.

హార్మోనల్ థెరపీ: • టెస్టోస్టిరాన్ అనే పురుష హార్మోన్ ఈ క్యాన్సర్‌ను ప్రేరేపించే అవకాశమున్నందువల్ల ఆ హార్మోన్‌ను తగ్గించే మందులు ఉపయోగించడం.

ఇమ్యూనో థెరపీ: • దేహంలోని ఇమ్యూనిటీ (రక్షణ) వ్యవస్థను బలోపేతం చేసి, ఆ రక్షణ వ్యవస్థే క్యాన్సర్‌ను బలంగా ఎదుర్కొనేలా చేయడం.



డాక్టర్
కె. జి. జ్యోతి స్వరూప్
కన్సల్టెంట్ యూరాలజిస్ట్, యూరో ఆంకాలజిస్ట్

బ్రక్సిజమ్ అంటే...?



కొందరు పిల్లలు... ఆ మాటకొస్తే కొందరు పెద్దలు కూడా నిద్రలో పళ్లు కొరుక్కోవడంతోపాటు దవడలు బిగబట్టి పళ్లు నూరుతుంటారు. దీనిని వైద్యపరిభాషలో 'బ్రక్సిజమ్' అంటారు. దీనివల్ల పళ్లు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఈ సమస్యపై అవగాహన కోసం ఈ కథనం.

తీవ్రమైన మానసిక ఒత్తిడి, యాంగ్జైటీ వంటి పరిస్థితులే బ్రక్సిజానికి కారణం. ఎప్పుడో ఒకసారి పళ్లు బిగబట్టడం, కోపం వచ్చినప్పుడు పళ్లు కొరకడం సహజం. కానీ నిత్యం నిద్రలో ఇది జరుగుతుంటే మాత్రం దీన్ని రుగ్మతగా పరిగణించి చికిత్స తీసుకోవాలి.

లక్షణాలు: • పొద్దున లేవగానే తలనొప్పి. ఒక్కోసారి ముఖం నొప్పి కూడా. • చెవి పోటు • దవడ కండరాల నొప్పులు • కొందరిలో చెవిలో హోరు (టిన్నైటిస్) • నోరు నొప్పి కారణంగా ఆహారం తీసుకోలేకపోవడం • నోరు తెరవడానికి, మూయడానికి ఇబ్బంది.

రకాలు: • **అవేక్ బ్రక్సిజమ్** : కొందరు మెలకువగా ఉన్నప్పుడు పగటివేళ పళ్లు కొరుక్కుంటూ ఉంటారు. ఇలాంటి కేసుల్లో ఒత్తిడికి కారణం గుర్తించి కౌన్సెలింగ్ ఇస్తే సరిపోతుంది. అంతకుమించి చికిత్స అవసరం ఉండకపోవచ్చు. కొందరిలో ఏదైనా విషయంపై తదేకంగా దృష్టి కేంద్రీకరించినప్పుడు అసంకల్పితంగా దవడ బిగిస్తుంటారు. దీనికీ చికిత్స అవసరం ఉండదు • **స్లీప్ బ్రక్సిజమ్:** నిద్రలో ఉన్నప్పుడు అదేపనిగా పళ్లు కొరకడంతో పాటు తాము అలా చేస్తున్నామన్న విషయమే పిల్లలకు తెలియదు. పగటివేళల్లో మామూలుగానే ఉంటారు. వీళ్లకు చికిత్స అవసరం.

రిస్క్ ఫ్యాక్టర్స్: • పిల్లల్లో తీవ్రమైన ఒత్తిడి, యాంగ్జైటీ వంటి పరిస్థితులతో పాటు మేజర్ డిప్రెసివ్ డిజార్డర్స్ లేదా జనరలైజ్‌డ్ యాంగ్జైటీ డిజార్డర్స్ వంటి మానసిక పరిస్థితులు • పెద్దవారిలో ఆల్కహాల్‌తో పాటు కెఫిన్ ఎక్కువగా ఉండే కాఫీ వంటివి ఎక్కువగా తాగడం • పెద్దల్లో యాంగ్జైటీని తగ్గించడం కోసం వాడే కొన్ని రకాల ఔషధాలు. ఉదాహరణకు 'సెలక్టివ్ సెరిటోనిన్ రీ-అప్ టేక్ ఇన్హిబిటార్స్ -ఎస్ఎస్ఆర్ఐస్ అనే మందులు • పెద్దవారిలో గురక రావడం.

చికిత్స: పిల్లలు నిద్రలో ఎప్పుడైనా పళ్లు కొరుకుతుంటే దానికి పెద్దగా చికిత్స అవసరం లేదు. కానీ అది పళ్లకు హాని కలిగించేంత తీవ్రంగా ఉన్నప్పుడు మాత్రం సీరియస్‌గా తీసుకోవాల్సిందే. ముందుగా వారి పళ్లు దెబ్బతినకుండా పంటి డాక్టర్ ఆధ్వర్యంలో మౌత్ గార్డ్స్ అమర్చడం అవసరం • స్ట్రెస్ తగ్గించడానికి తొలుత కౌన్సెలింగ్, తర్వాత ధ్యానం వంటి పద్ధతులతో తేలికపాటి వ్యాయామాలు • 'కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ'తో చాలావరకు ఉపయోగం ఉంటుంది • కొన్ని పరీక్షల తర్వాత యాంగ్జైటీ, డిప్రెషన్ వంటివి ఉన్నాయని తేలితే... యాంగ్జియోలైటిక్స్ అనే యాంటీ యాంగ్జైటీ మందులతో పాటు మజిల్ రిలాక్సెంట్ ఔషధాలు. • జీవనశైలి అంటే లైఫ్‌స్టైల్‌లో మార్పులు (మద్యం అలవాటు వదిలేయడం, పరిమితికి మించి కాఫీలు, పొగ తాగడాన్ని మానేయడం)



డాక్టర్
నరేంద్రనాథ్ రెడ్డి
సీనియర్ డెంటల్ సర్జన్



డాక్టర్
శ్రీనివాస్ ఎస్ఆర్ఆర్‌వై
సీనియర్ సైకియాట్రిస్ట్

మెడి టిప్

కడుపులో అల్సర్స్ తగ్గాలంటే..!



ఆహారపు అలవాట్లు మారడంతోపాటు జీవనశైలిలో ఒత్తిడి పెరగడం వల్ల జీర్ణకోశానికి వస్తున్న సమస్యల్లో కడుపులో అల్సర్స్ కూడా ఒకటి. ఆహారాన్ని జీర్ణం చేయడం కోసం కడుపులో ఆమ్లం (యాసిడ్) ఉత్పత్తి అవుతుంది. అది నిర్ణీత మోతాదులో ఉత్పత్తి కాకపోవడం వల్ల కడుపులో అల్సర్లు వస్తాయి. ఇలా జీర్ణాశయంలో వచ్చే అల్సర్‌ని గ్యాస్ట్రిక్ అల్సర్ అంటారు. ఈ అల్సర్స్‌ను అధిగమించాలంటే... ➡ యోగా, ధ్యానం వంటి వాటి ద్వారా మానసిక ఒత్తిడికి దూరంగా ఉండటం ➡ ఆహారంలో కారం, మసాలాలు తక్కువగా ఉండేలా జాగ్రత్తపడటం ➡ కాఫీ, టీలు పరిమితంగా తీసుకోవడం లేదా పూర్తిగా మానేయడం ➡ పొగతాగడం, మద్యం వంటి అలవాట్లకు దూరంగా ఉండటం ➡ క్రమం తప్పకుండా రోజూ ఒకే సమయానికి ఆహారం తీసుకోవడం.



నేటినుంచి ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ

ప్రతిష్టాత్మక క్లే కోర్టు గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫ్రెంచ్ ఓపెన్‌కు రంగం సిద్ధమైంది. పారిస్‌లో నేడు ప్రారంభమయ్యే ఈ టోర్నీ 9 జూన్ వరకు సాగుతుంది. ఈ మెగా టోర్నీలో ప్రస్తుతం అందరి దృష్టి దిగ్గజ ఆటగాడు, 14 సార్లు ఫ్రెంచ్ ఓపెన్ విజేత రాఫెల్ నాదల్ (స్పెయిన్)పైనే ఉంది. తొలి రౌండ్‌లో అతను సోమవారం నాలుగో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్‌తో తలపడతాడు. ఈ జూన్ 3న 38 ఏళ్లు పూర్తి చేసుకోబోతున్న నాదల్ వరుస గాయాలతో ఇబ్బంది పడుతూ ఒక దశలో టోర్నీకి దూరమయ్యేలా కనిపించాడు. అయితే శనివారం మీడియాతో మాట్లాడిన అతను తాను ప్రస్తుతం మంచి స్థితిలో ఉన్నానని, ఇది చివరి ఫ్రెంచ్ ఓపెన్ కాకపోవచ్చని స్పష్టం చేశాడు. ఆదివారం జరిగే ప్రధాన మ్యాచ్‌లలో మహిళల సింగిల్స్‌లో లూసియా బ్రాన్‌జెట్టీతో 4 గ్రాండ్‌స్లామ్‌ల విజేత నయోమీ ఒసాకా తలపడుతుంది. పురుషుల సింగిల్స్‌లో జేజే వుల్ఫ్‌ను మూడో సీడ్ కార్లోస్ అల్‌కరాజ్ ఎదుర్కొంటాడు. అయితే సీనియర్లు ఆండీ ముర్రే, స్టాన్ వావ్రింకా మధ్య పోరు అత్యంత ఆసక్తికరం కానుంది.



చలో అమెరికా!

టి20 ప్రపంచకప్‌లో పాల్గొనేందుకు భారత క్రికెట్ జట్టు అమెరికా పయనమైంది. రిజర్వ్ ఆటగాడు రింకూ సింగ్ మినహా 18 మంది క్రికెటర్లు, హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్‌తో పాటు ఇతర సహాయక సిబ్బంది బృందం ముంబైనుంచి న్యూయార్క్‌కు బయల్దేరి వెళ్లింది. బంగ్లాదేశ్‌తో ఒక ప్రాక్టీస్ మ్యాచ్ తర్వాత టోర్నీలో తమ తొలి మ్యాచ్‌లో జూన్ 5న ఐర్లాండ్‌తో భారత్ తలపడుతుంది.

జ్యోతిసురేఖకు స్వర్ణం, రజతం

ప్రపంచ కప్ ఆర్చరీ



యెచియాన్ (కొరియా): ప్రపంచ కప్ ఆర్చరీ స్టేజ్–2 టోర్నీ కాంపౌండ్ కేటగిరిలో భారత అగ్రశ్రేణి క్రీడాకారిణి, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వెన్నం జ్యోతిసురేఖ రెండు పతకాలను తన ఖాతాలో వేసుకుంది. టీమ్ విభాగంలో స్వర్ణం సాధించిన ఆమె, మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో రజతం గెలుచుకుంది. మహిళల టీమ్ ఈవెంట్ ఫైనల్లో భారత్ 232–226 స్కోరుతో టర్కీపై విజయం సాధించింది. భారత జట్టులో సురేఖతో పాటు అదితి స్వామి, పర్నీత్ కౌర్ సభ్యులుగా ఉన్నారు. మిక్స్‌డ్ ఈవెంట్ ఫైనల్లో మాత్రం జ్యోతి సురేఖ – ప్రియాన్ష్ ద్వయం రెండో స్థానానికే పరిమితమైంది. ఫైనల్లో అమెరికాకు చెందిన ఒలీవియా డీన్ – సాయెర్ సలివాన్ జోడి 155–153 తేడాతో సురేఖ – ప్రియాన్ష్‌ను ఓడించింది.

ఫైనల్లో పీవీ సింధు

మలేసియా మాస్టర్స్ ఓపెన్



కౌలాలంపూర్: భారత టాప్ షట్లర్ పూసర్ల వెంకట సింధు ఈ ఏడాది తన తొలి టైటిల్ సాధించేందుకు అడుగు దూరంలో నిలిచింది. బీడబ్ల్యూఎఫ్ సూపర్–500 టోర్నీ మలేసియా మాస్టర్స్‌లో సింధు ఫైనల్లోకి ప్రవేశించింది. శనివారం హోరాహోరీగా సాగిన సెమీ ఫైనల్లో సింధు 13–21, 21–16, 21–12 స్కోరుతో బుసానన్ ఆంగ్‌బమ్‌రున్‌ఫన్ (థాయిలాండ్)పై విజయం సాధించింది. తన కెరీర్‌లో ఐదేళ్ల క్రితం ఒకే ఒక సారి బుసానన్ చేతిలో ఓడిన సింధుకు ఇది ఆమెపై 18వ గెలుపు కావడం విశేషం. వరల్డ్ నంబర్ 20 బుసానన్ తొలి గేమ్‌లో ఆధిక్యం ప్రదర్శించి ముందంజ వేసింది. అయితే వెంటనే కోలుకున్న సింధు ర్యాలీలతో చెలరేగి గేమ్‌ను గెలుచుకుంది. మూడో గేమ్‌లో సింధు తన స్థాయిలో సత్తా చాటింది. 8–3తో ఆధిక్యంలోకి వెళ్లిన తర్వాత ఆమెకు తిరుగులేకుండా పోయింది. అదే జోరును కొనసాగిస్తూ 17–10తో దూసుకుపోయిన సింధు వరుస పాయింట్లతో మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. నేడు జరిగే ఫైనల్లో వరల్డ్ నంబర్ 7 వాంగ్ జి యీ (చైనా)తో సింధు తలపడుతుంది.

రన్నరప్‌గా యూకీ జోడి



లయన్ (ఫ్రాన్స్): కెరీర్‌లో మూడో ఏటీపీ టూర్ టైటిల్ గెలవాలని భావించిన భారత టెన్నిస్ ఆటగాడు యూకీ బాంబ్రీకి నిరాశ ఎదురైంది. ఏటీపీ 250 టోర్నీ ఓపెన్ పార్క్ డబుల్స్‌లో యూకీ బాంబ్రీ (భారత్) – అల్బనో ఒలివెట్టి (ఫ్రాన్స్) ద్వయం రన్నరప్‌గా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్లో హెన్రీ ప్యాటన్ (బ్రిటన్) – హ్యారీ హెలియోవరా (ఫిన్లాండ్) జోడి 3–6, 7–6 (7/4), 10–8 స్కోరుతో యూకీ – ఒలివెట్టిపై విజయం సాధించింది. ఒక గంటా 43 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో యూకీ–ఒలివెట్టి జంట 5 ఏస్‌లు సంధించి ఒక డబుల్ ఫాల్ట్ చేసింది. తొలి సెట్‌ను గెలిచినా, ఆ తర్వాత భారత్–ఫ్రాన్స్ జంట అవకాశాన్ని చేజార్చుకుంది.


‘షూటౌట్’లో ఓడిన భారత్



అంట్‌వెర్ప్: ప్రో హాకీ లీగ్‌లో శుక్రవారం బెల్జియం చేతిలో ఓడిన భారత పురుషుల జట్టు వరుసగా రెండో మ్యాచ్‌లోనూ పరాజయంపాలైంది. గత మ్యాచ్ కంటే ఈ సారి మెరుగైన ప్రదర్శన కనబర్చినా ‘షూటౌట్’లో ఓటమి ఎదురైంది. శనివారం జరిగిన పోరులో బెల్జియం 1–3 (షూటౌట్) తేడాతో పరాజయం పాలైంది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు 2–2తో సమంగా నిలిచాయి. భారత్ తరఫున ఆరజీత్ సింగ్ (11వ నిమిషం), సుఖ్‌జీత్ సింగ్ (57వ నిమిషం) గోల్స్ చేయగా...బెల్జియం ఆటగాళ్లలో డేనయెర్ ఫెలిక్స్ (30వ నిమిషం), వాన్ ఫ్లోరెంట్ (50వ నిమిషం) గోల్స్ కొట్టారు.

మహిళలకూ మరో ఓటమి

ఇదే టోర్నీలో భారత మహిళల హాకీ జట్టు వరుసగా మూడో పరాజయాన్ని చవిచూసింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 1–2 గోల్స్ తేడాతో బెల్జియం చేతిలో ఓటమిపాలైంది. బెల్జియం తరఫున బలెన్‌గీన్ ఆంబ్రే (14వ నిమిషం), బ్లాక్‌మన్స్ వనెసా (20వ నిమిషం) గోల్స్ సాధించగా... భారత్ తరఫున కుమారి సంగీత (34వ నిమిషం) ఏకైక గోల్ కొట్టింది.



చెన్నై మరీనా బీచ్‌లో ఐపీఎల్ ట్రోఫీతో కెప్టెన్‌లు శ్రేయస్, కమిన్స్

రైజర్స్ Vs రైడర్స్

నేడు ఐపీఎల్ ఫైనల్
- కోల్‌కతాతో హైదరాబాద్ ఢీ
- సమరోత్సాహంతో ఇరు జట్లు
- రా.గం.7.30నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలలో ప్రత్యక్ష ప్రసారం

గత మూడు సీజన్లలో ఎనిమిది, ఎనిమిది, పదో స్థానం... సన్‌రైజర్స్ హైదరాబాద్ పరిస్థితి ఇది. గత రెండు సీజన్లలో కోల్‌కతా నైట్‌రైడర్స్ ఏడో స్థానానికి పరిమితం. ఐపీఎల్ ఈ ఏడాది ఆరంభానికి ముందుకు ఇరు జట్ల రికార్డు చూస్తే ఈ రెండు టీమ్‌లు ఫైనల్ చేరతాయని ఎవరూ ఊహించలేదు. కానీ అద్భుత ప్రదర్శనలతో రైజర్స్, రైడర్స్ అంచనాలు తిరగరాశాయి. అదరగొట్టే బ్యాటింగ్, రికార్డు ప్రదర్శనలతో హైదరాబాద్ ప్రస్థానం సాగితే... అన్ని రంగాల్లో చెలరేగి కోల్‌కతా అగ్రస్థానంతో ముందుకు దూసుకెళ్లింది. అన్ని అవరోధాలను దాటిన తర్వాత ఇప్పుడు అసలైన అంతిమ సమరానికి రంగం సిద్ధమైంది. పదేళ్ల క్రితం చివరిసారి విజేతగా నిలిచిన కోల్‌కతా తమ మూడో టైటిల్‌పై గురి పెడితే... ఎనిమిదేళ్ల క్రితం చాంపియన్‌గా నిలిచిన హైదరాబాద్ రెండో ట్రోఫీ లక్ష్యంగా బరిలోకి దిగింది. ఇరు జట్లు సమ ఉజ్జీలుగా కనిపిస్తున్న నేపథ్యంలో చెపాక్ మైదానంలో ఎవరిది పైచేయి కానుందనేది ఆసక్తికరం.

చెన్నై: ఐపీఎల్–17లో రెండు నెలలకు పైగా హోరాహోరీగా సాగిన సమరాల తర్వాత టోర్నీ విజేతను తేల్చే సమయం ఆసన్నమైంది. లీగ్ మాజీ చాంపియన్లు మరో ట్రోఫీ వేటలో సత్తా చాటేందుకు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నాయి. చిదంబరం స్టేడియంలో ఆదివారం జరిగే ఫైనల్ పోరులో సన్‌రైజర్స్ హైదరాబాద్, కోల్‌కతా నైట్‌రైడర్స్ తలపడతాయి. తొలి క్వాలిఫయర్‌లో సన్‌రైజర్స్‌నే ఓడించి దర్జాగా తుది పోరుకు అర్హత సాధించిన కోల్‌కతా దానిని పునరావృతం చేసేందుకు సిద్ధంగా ఉంది. మరో వైపు గత మ్యాచ్‌తో పాటు అంతకు ముందు లీగ్ దశలో కూడా కేకేఆర్ చేతిలో ఓడిన హైదరాబాద్ ఈ సారి మాత్రం వెనక్కి తగ్గకుండా తమ అత్యుత్తమ ఆటను ప్రదర్శించాలని పట్టుదలగా ఉంది. శుక్రవారం ప్రతికూల పరిస్థితుల మధ్య ఇదే మైదానంలో క్వాలిఫయర్–2లో రాజస్తాన్‌ను ఓడించడంతో రైజర్స్ టీమ్‌లో ఆత్మవిశ్వాసం పెరిగింది.

మార్పులు చేస్తారా!

ఫైనల్ కోసం హైదరాబాద్ తుది జట్టు ఎంపిక ఆసక్తికరంగా మారింది. టాప్–3లో హెడ్, అభిషేక్, త్రిపాఠి ఖాయం. గత మూడు మ్యాచ్‌లుగా భారీ స్కోరు బాకీ ఉన్న హెడ్ ఫైనల్లో చెలరేగితే నిలువరించడం కష్టం. అదే విధంగా అభిషేక్ కూడా మరో మెరుపు ఇన్నింగ్స్ ఆడాల్సి ఉంది. వరుసగా రెండు మ్యాచ్‌లలో దూకుడైన బ్యాటింగ్‌తో తానేంటో త్రిపాఠి నిరూపించుకున్నాడు. ఎప్పటిలాగే భారీ షాట్లతో క్లాసెన్ మిడిలార్డర్‌లో ఉన్నాడు. అయితే ఇద్దరు దేశవాళీ బ్యాటర్లు నితీశ్ రెడ్డి, సమద్‌లు మరింత మెరుగైన ప్రదర్శన ఇవ్వాల్సి ఉంది. నాలుగో విదేశీ ఆటగాడిగా ఎవరిని ఎంచుకోవాలనే విషయంలో రైజర్స్ మేనేజ్‌మెంట్‌లో గందరగోళం కొనసాగుతోంది. మార్క్‌రమ్ ఆశించిన స్థాయిలో ఆడలేకపోతుండగా, లీగ్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఫిలిప్స్‌ను తీసుకోవడం కూడా దాదాపు అసాధ్యం. పిచ్‌ను బట్టి క్వాలిఫయర్‌లో షహబాజ్‌ను అనూహ్యంగా ఇంపాక్ట్ ప్లేయర్‌గా చేసుకొచ్చి టీమ్ మంచి ఫలితం సాధించింది. అయితే ఈ పిచ్‌ను స్పిన్‌కు అంతగా అనుకూలించేది కాకపోవడంతో పాటు ప్రత్యర్థి టీమ్‌లో నలుగురు లెఫ్టార్మ్ బ్యాటర్లు ఉన్నారు. కమిన్స్, భువనేశ్వర్, నటరాజన్ పేస్ బౌలింగ్‌లో తమ బాధ్యత నిర్వర్తించగలరు.

మార్పుల్లేకుండా...

కోల్‌కతా మాత్రం ఎలాంటి సందేహం లేకుండా క్వాలిఫయర్–1 ఆడిన టీమ్‌నే కొనసాగించనుంది. మొదటినుంచి చివరి ఆటగాడి వరకు అందరూ ఫామ్‌లో ఉండటం సానుకూలాంశం. ఓపెనర్లుగా నరైన్, గుర్బాజ్ సత్తా చాటగలరు. ఆ తర్వాత వరుసగా వెంకటేశ్, శ్రేయస్, రాణా జట్టు భారం మోస్తారు. చివర్లో రింకూ, రసెల్ విధ్వంసం సృష్టించగల సమర్థులు. కేకేఆర్ బౌలింగ్ కూడా సమతూకంగా ఉంది. స్టార్క్ ఫామ్‌లో ఉంటే ఏం జరుగుతుంతో గత మ్యాచ్‌లో హైదరాబాద్‌కు అర్థమైంది. హర్షిత్, అరోరాలాంటి యువ పేసర్లు కూడా రాణిస్తుండగా... స్పిన్నర్ వరుణ్ ఒంటిచేత్తో మ్యాచ్ స్వరూపాన్ని మార్చేయగలడు.

తుది జట్ల వివరాలు (అంచనా)

సన్‌రైజర్స్: కమిన్స్ (కెప్టెన్), హెడ్, అభిషేక్, త్రిపాఠి, మార్క్‌రమ్, క్లాసెన్, నితీశ్ రెడ్డి, సమద్, భువనేశ్వర్, ఉనాద్కట్, నటరాజన్, షహబాజ్/ మర్కండే.

నైట్‌రైడర్స్: శ్రేయస్ (కెప్టెన్), నరైన్, గుర్బాజ్, వెంకటేశ్, నితీశ్, రింకూ, రసెల్, రమణ్‌దీప్, స్టార్క్, హర్షిత్, వరుణ్, వైభవ్.

పిచ్, వాతావరణం

రెండో క్వాలిఫయర్ మ్యాచ్ నల్లరేగడి మట్టితో కూడిన పిచ్‌పై జరిగి స్పిన్‌కు బాగా అనుకూలిస్తుంది. కానీ ఫైనల్‌ను ఎర్రమట్టితో కూడిన మరో పిచ్‌ను నిర్వహిస్తున్నారు. దాంతో బ్యాటింగ్‌కు అనుకూలించి భారీ స్కోరుకు అవకాశం ఉంటుంది. శనివారం సాయంత్రం వర్షం కురిసినా...మ్యాచ్ రోజు చిరు జల్లులకు మాత్రమే అవకాశం ఉంది. ఏదైనా ఇబ్బంది ఎదురైనా రిజర్వ్ డే ఉంది.

సినిమా

- ‘అన్‌సర్టైన్ రిగార్డ్’ విభాగంలో ఉత్తమ నటి అవార్డు అందుకున్న తొలి భారతీయురాలు అనసూయ
- ప్రతిష్టాత్మక పియర్ ఏంజెనీ అవార్డు అందుకున్న తొలి భారతీయ ఛాయాగ్రాహకుడు సంతోష్ శివన్

పీచు మిఠాయ్...



అపర్ణ, సందీప్ కిషన్

సైకిలు మీద ప్రేమ షికారుకు వెళ్లారు సందీప్ కిషన్, అపర్ణా బాలమురళి. ఈ జాలీ రైడ్‌లో ‘పీచు మిఠాయ్...’ అంటూ పాట పాడుకున్నారు. ధనుష్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన ‘రాయన్’లో సందీప్ కిషన్, అపర్ణా బాలమురళి ఓ జంటగా నటించారు. సినిమాలో ఈ ఇద్దరి మధ్య ‘పీచు మిఠాయ్..’ అంటూ సాగే రొమాంటిక్, మెలోడీ సాంగ్‌ను విడుదల చేశారు. ఏఆర్ రెహమాన్ స్వరపరచిన ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా విజయ్ ప్రకాశ్, హరిప్రియ పాడారు. తెలుగు, తమిళ భాషల్లో సన్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం జూన్ 13న రిలీజ్ కానుంది. తెలుగు వెర్షన్‌ని ఏషియన్–సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్ఎల్‌పి విడుదల చేయనుంది.

ఆలోచింపజేసేలా...



రాజేశ్, వరుణ్ సందేశ్

వాస్తవ ఘటనల ఆధారంగా వరుణ్ సందేశ్ హీరోగా రూపొందిన చిత్రం ‘నింద’. స్వీయ దర్శకత్వంలో రాజేశ్ జగన్నాథం నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా గానామాస్ స్పెషల్ స్కూల్‌కి చెందిన పిల్లల చేతుల మీదగా ఈ చిత్రంలోని ‘సంకెళ్లు..’ అంటూ సాగే పాటను ఆవిష్కరింపజేశారు. సంగీతదర్శకుడు సంతు ఓంకార్ స్వరపరచిన ఈ పాటకు కిట్టు విస్సాప్రగడ సాహిత్యం అందించగా, శ్రీరామచంద్ర పాడారు. ‘‘ఈ పాట ఆలోచింపజేసే విధంగా ఉంటుంది. ఓ మిస్టరీ నేపథ్యంలో రూపొందించిన ఈ చిత్రం అన్ని వర్గాలవారినీ ఆకట్టుకునేలా ఉంటుంది. త్వరలో సినిమా విడుదల తేదీ ప్రకటిస్తాం’’ అని చిత్రబృందం పేర్కొంది. శ్రేయారాణి, ఆనీ, క్యూ మధు హీరోయిన్లుగా నటించారు.

మూర్తి... యువతి... ఓ లక్ష్యం



అజయ్ ఘోష్, చాందిని

మూర్తి ఒక మ్యూజిక్ షాప్ యజమాని. డీజే కావాలనేది అతని లక్ష్యం. మూర్తి లక్ష్య సాధనకు ఓ యువతి ఏ విధంగా సహాయం చేసింది? అనే కథాంశంతో రూపొందిన చిత్రం ‘మ్యూజిక్ షాప్ మూర్తి’. డీజే మూర్తి పాత్రలో అజయ్ ఘోష్, అతనికి సహాయం చేసే యువతి పాత్రలో చాందినీ చౌదరి నటించారు. శివ పాలడుగు దర్శకత్వంలో హర్ష గారపాటి, రంగారావు గారపాటి నిర్మించిన ఈ చిత్రం జూన్ 14న రిలీజ్ కానుంది. ‘‘అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్, బేబీ, డీజే టిల్లు’ వంటి చిత్రాలను పంపిణీ చేసిన ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా ఈ చిత్రం రిలీజ్ కానుంది’’ అని చిత్రబృందం పేర్కొంది.

కాన్స్‌లో అనసూయకు ఉత్తమ నటి అవార్డు

భారతీయ నటి అనసూయ సేన్ గుప్తా కాన్స్ చిత్రోత్సవాల్లో చరిత్ర సృష్టించారు. 77వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లోని ‘అన్‌సర్టైన్ రిగార్డ్’ విభాగంలో ‘ది షేమ్‌లెస్’ (2024) చిత్రంలోని నటనకు గాను ఆమె ఉత్తమ నటిగా అవార్డు అందుకున్నారు. ఈ విభాగంలో ఉత్తమ నటి అవార్డు అందుకున్న తొలి భారతీయ నటిగా అనసూయ సేన్ గుప్తా చరిత్రలో నిలిచిపోయారు. ఈ విభాగంలో దాదాపు పదిహేను మంది నటీమణులతో పోటీ పడి ఆమె అవార్డు దక్కించుకోవడం విశేషం. బల్గేరియన్ దర్శకుడు కాన్స్టాంటిన్ బోజనవ్ ‘ది షేమ్‌లెస్’ సినిమాకు దర్శకత్వం వహించారు. ‘అన్‌సర్టైన్ రిగార్డ్’ విభాగంలోనే ‘ది స్టోరీ ఆఫ్ సోలమన్’ చిత్రంలోని నటనకుగాను బ్రూనో నాహోన్ ఉత్తమ నటుడిగా నిలిచారు. ఉత్తమ చిత్రంగా ‘బ్లాక్ డాగ్’ ఎంపికైంది. ఉత్తమ దర్శకులుగా రాబర్టో మినర్విని (ది డ్యామ్డ్), రంగనో న్యాని (ఆన్ బికమింగ్ ఎ గినీ ఫౌల్) అవార్డు అందుకున్నారు.



అనసూయ సేన్ గుప్తా

కొత్త జీవితం... ‘‘ప్రపంచవ్యాప్తంగా ఉన్న అట్టడుగు వర్గాలవారు, వలసదారులు సమానత్వం కోసం పోరాటం చేసే పరిస్థితుల్లో ఉన్నందువల్ల పోరాటం చేస్తున్నారు. నిజానికి సమానత్వం కోసం పోరాడాలంటే వలసదారులు, అట్టడుగు వర్గాలవారే కానక్కర్లేదు. మనం మంచి మనుషులు అయితే చాలు’’ అంటూ అవార్డు స్వీకరించిన అనంతరం పేర్కొన్నారు అనసూయ సేన్ గుప్తా. అలాగే ‘‘నాకు కొత్త జీవితాన్నిచ్చిన కాన్స్‌కు ప్రస్తుతానికి గుడ్ బై... కృతజ్ఞతలు’’ అని తన ఇన్‌స్టా స్టోరీలోనూ ఆమె షేర్ చేశారు.

‘ది షేమ్‌లెస్’ కథేంటంటే... ఢిల్లీలోని ఒక వ్యభిచార గృహంలో పోలీసును హత్య చేస్తుంది వేశ్య రేణుక. ఆ తర్వాత మరో రాష్ట్రంలోని సెక్స్ వర్కర్ల కమ్యూనిటీలో ఆశ్రయం పొందుతుంది. అక్కడ పదిహేడేళ్ల వయసులో ఉన్న దేవిక అనే అమ్మాయితో రేణుక ప్రేమలో పడుతుంది. ఆ తర్వాత రేణుక, దేవికల జీవితాలు ఎలా మారాయి? ఇద్దరూ ఎలాంటి సవాళ్లు ఎదుర్కొన్నారు? అన్నదే ‘ది షేమ్‌లెస్’ కథాంశం. ఈ చిత్రంలో రేణుక పాత్రలో అనసూయ సేన్, దేవికగా ఒమరా శెట్టి నటించారు.

జర్నలిస్ట్ అవ్వాలనుకుని నటిగా... అనసూయ సేన్ గుప్తా స్వస్థలం కోల్‌కతా. జాదవ్‌పూర్ యూనివర్సిటీలో ఇంగ్లిష్ లిటరేచర్‌లో డిగ్రీ పూర్తి చేశారామె. జర్నలిజంను వృత్తిగా ఎంచుకోవాలనుకున్నారు. కానీ ఆమె యాక్టర్ అయ్యేలా పరిస్థితులు మారాయి. 2009లో విడుదలైన బెంగాలీ మ్యూజికల్ ఫిల్మ్ ‘మ్యాడ్లీ బెంగాలీ’ అనసూయ సేన్ గుప్తాకు నటిగా తొలి చిత్రం. అంజన్ దత్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఆమె ఓ కీలక పాత్రలో నటించారు. ఈ సినిమా విడుదల తర్వాత 2013లో అనసూయ ముంబైకి చేరుకున్నారు. ఆమె సోదరుడు అభిషేక్ సేన్ గుప్తా బాలీవుడ్‌లో దర్శకత్వ విభాగంలో ఉన్నారు. ఎంతో ప్రయత్నించినప్పటికీ నటిగా సరైన అవకాశాలు రాకపోవడంతో ‘సాట్ ఉచక్కే, రే, మసాబా మసాబా’ వెబ్ వంటి సిరీస్‌లకు ప్రొడక్షన్ డిజైన్, సెట్ డిజైనింగ్ విభాగాల్లో పని చేశారామె. ఆ తర్వాత కరోనా టైమ్‌లో 2020 జూన్‌లో ‘ది షేమ్‌లెస్’ సినిమాకు ఆడిషన్స్ ఇచ్చారు అనసూయ. అది నచ్చి, దర్శకుడు కాన్స్టాంటిన్ బోజనవ్ ఆమెను లీడ్ రోల్‌కి ఎంచుకున్నారు.



ప్రీతీ జింతా

సంతోష్ శివన్‌కు ప్రతిష్టాత్మక పియర్ అవార్డు...

రెట్రో ఫోకస్, మోడ్రన్ లెన్స్‌ను కనుగొన్న ఫ్రెంచ్ శాస్త్రవేత్త పియర్ ఏంజెనీకి నివాళిగా 2013 నుంచి ఆయన పేరిట ఓ అవార్డును నెలకొల్పి సినిమాటోగ్రాఫర్లకు అందిస్తున్నారు కాన్స్ చిత్రోత్సవాల నిర్వాహకులు. ఈ ఏడాది ఈ అవార్డును భారతీయ ప్రముఖ ఛాయాగ్రాహకుడు సంతోష్ శివన్ అందుకున్నారు. ఈ చిత్రోత్సవాల్లో పాల్గొన్న ప్రముఖ నటి ప్రీతీ జింతా ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ అవార్డు అందుకున్న తొలి ఏషియన్ సినిమాటోగ్రాఫర్ సంతోష్ శివన్‌నే కావడం విశేషం. ఈ సందర్భంగా కాన్స్‌కు ధన్యవాదాలు తెలిపారు సంతోష్.



సంతోష్ శివన్

దర్శక–నిర్మాతగా.. మలయాళ ‘నిధియుడె కథ’ (1986) ఛాయాగ్రాహకుడిగా సంతోష్ శివన్‌కి తొలి చిత్రం. ఆ తర్వాత పలు మలయాళ చిత్రాలకు కెమెరామేన్‌గా చేసిన ఆయన ‘దళపతి, రోజా, తుపాకీ’ వంటి తమిళ చిత్రాలకు, హిందీ ‘దిల్ సే’, తెలుగు ‘స్పైడర్’ తదితర చిత్రాలకు ఛాయాగ్రాహకుడిగా చేశారు. దర్శకుడిగా సంతోష్ తెరకెక్కించిన చిత్రాల్లో హిందీలో ‘ముంబైకర్, తహాన్, మలయాళంలో ‘ఉరుమి’ వంటివి ఉన్నాయి. 35ఏళ్లకు పై బడిన కెరీర్‌లో ఛాయాగ్రాహకుడిగా, దర్శక– నిర్మాతగా సంతోష్ శివన్ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.


నిజాయతీ గల అందగాడు



కార్తీ, అరవింద్ స్వామి

అతను నిజాయతీపరుడు... అందగాడు కూడా. ఇంకా అతగాడి గురించి తెలుసుకోవాలంటే ‘మెయ్యళగన్’ (నిజాయతీ గల అందగాడు) చిత్రం చూడాలి. కార్తీ టైటిల్ రోల్‌లో, అరవింద్ స్వామి ఓ ముఖ్య పాత్రలో నటించిన చిత్రమిది. కార్తీ బర్త్ డే (మే 25) సందర్భంగా ఈ చిత్రానికి ‘మెయ్యళగన్’ టైటిల్‌ను ప్రకటించి, పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ప్రేమ్ కుమార్ దర్శకత్వంలో తెలుగు, తమిళ ద్విభాషా చిత్రంగా జ్యోతిక, సూర్య ఈ చిత్రాన్ని నిర్మించారు. తెలుగు టైటిల్‌ను త్వరలో ప్రకటిస్తారు. ‘‘షూటింగ్ పూర్తయింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు తుది దశకు చేరుకున్నాయి’’ అని యూనిట్ పేర్కొంది.

చరిత్రలో మిగిలిపోవాలంతే...



విశ్వక్ సేన్

‘మనుషులు మూడు రకాలురా.. నాసి రకం.. రెండోది బోసి రకం.. మూడోది నాణ్యమైన రకం..’ అనే డైలాగ్‌తో మొదలవుతుంది ‘గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి’ సినిమా ట్రైలర్. విశ్వక్ సేన్, నేహా శెట్టి హీరో హీరోయిన్లుగా, అంజలి ఓ కీలక పాత్రలో నటించిన ఈ సినిమాకు కృష్ణచైతన్య దర్శకత్వం వహించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31న విడుదల కానుంది. ఈ సందర్భంగా ‘గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి’ ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం సాయంత్రం హైదరాబాద్‌లోని దేవి 70 ఎంఎం థియేటర్‌లో జరిగింది. ‘‘యువ నాయకుడు రత్నాకర్’, ‘నా ఊళ్లో నాకేంట్రా భయం’, ‘ఇది చరిత్రలో మిగిలిపోవాలంతే..’ అనే డైలాగ్స్ ఈ ట్రైలర్‌లో ఉన్నాయి.

పర్ఫెక్ట్ మూవీతో...



ఐశ్వర్యా మీనన్, కార్తికేయ

కార్తికేయ గుమ్మకొండ హీరోగా నటించిన చిత్రం ‘భజే వాయు వేగం’. ఐశ్వర్యా మీనన్ హీరోయిన్‌గా ప్రశాంత్ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాలో రాహుల్ టైసన్ ఓ కీలక పాత్రలో నటించారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ నిర్మించిన ఈ చిత్రాన్ని ఈ నెల 31న ప్రపంచవ్యాప్తంగా ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ రిలీజ్ చేస్తోంది. ఈ సందర్భంగా హైదారబాద్‌లో జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో కార్తికేయ మాట్లాడుతూ– ‘‘నా ఆరేళ్ల కెరీర్‌లో హీరోగా తొమ్మిది సినిమాల్లో నటించాను. కొన్ని హిట్ అయ్యాయి, కొన్ని ఫ్లాప్ అయ్యాయి. నా గత చిత్రం ‘బెదురులంక’ బాగా పే చేసింది. కానీ ఒక పర్ఫెక్ట్ మూవీతో నా అడుగు ముందుకు పడలేదనిపిస్తుంటుంది. ఆ వెలితిని ‘భజే వాయు వేగం’ తీరుస్తుంది. ‘ఆర్ఎక్స్100’ తర్వాత నా కెరీర్‌లో ‘భజే వాయు వేగం’ మరో బెంచ్ మార్క్ మూవీ అవుతుంది’’ అన్నారు. ‘‘ఓ సాధారణ మనిషి అసాధారణ సమస్య నుంచి ఎలా బయటపడ్డాడు? అనే అంశాన్ని ఇంట్రెస్టింగ్ స్క్రీన్‌ప్లేతో చూపించాం’’ అన్నారు ప్రశాంత్ రెడ్డి. డైలాగ్ రైటర్ మధు శ్రీనివాస్, యూవీ కాన్సెప్ట్స్ చైతన్య మాట్లాడారు.

ఫుల్ మీల్స్ లాంటి సినిమా



తాన్వీ, కమల్

‘నువ్వే కావాలి, మన్మథుడు, మల్లీశ్వరి’ వంటి హిట్ చిత్రాల దర్శకుడు కె. విజయ్ భాస్కర్ స్వీయ దర్శకత్వంలో విజయ్ భాస్కర్ క్రాఫ్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందించిన చిత్రం ‘ఉషా పరిణయం. విజయ్ భాస్కర్ తనయుడు శ్రీ కమల్ హీరోగా తాన్వీ ఆకాంక్ష హీరోయిన్‌గా నటించారు. శనివారం జరిగిన ఈ చిత్రం టీజర్ విడుదల కార్యక్రమంలో విజయ్ భాస్కర్ మాట్లాడుతూ– ‘‘మంచి లవ్‌స్టోరీతో రూపొందించిన ‘ఉషా పరిణయం’ ఫుల్‌మీల్స్‌లా ఉంటుంది. నా కూతురు శ్యామల హీరో, హీరోయిన్‌కు కాస్ట్యూమ్ డిజైనర్‌గా చేయడంతో పాటు ప్రొడక్షన్ విషయంలో నాకు హెల్ప్ చేసింది. నేను అనుకున్న పాత్రకు కమల్ నటుడిగా వంద శాతం న్యాయం చేశాడు. ఇంకా ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల సహకారంతో సినిమాని అనుకున్న విధంగా చేయగలిగాం’’ అన్నారు.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

పర్వతారోహకురాలు పూర్ణను అభినందించిన మంత్రి సీతక్క

- తీన్మార్ మల్లన్నను పట్టభద్రులు గెలిపించాలి



సాక్షి, హైదరాబాద్ : రాష్ట్రానికి చెందిన పర్వతారోహకురాలు పూర్ణ మాలావత్ అతి పిన్న వయస్సులోనే ఎవరెస్ట్ అధిరోహించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆమెను పంచాయతీరాజ్, మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అభినందించారు. శనివారం మంత్రి సీతక్కను పూర్ణ తమ కుటుంబ సభ్యులతో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఆమెను సన్మానించారు. అతి పిన్నవయసులోనే ఎవరెస్ట్ శిఖరంతో పాటు, ఆఫ్రికాలోని కిలిమంజారో, యూరప్‌లోని ఎల్‌బ్రస్, దక్షిణ అమెరికాలోని అకోన్‌కాగస్, ఓసెనియాలోని కార్టెంజ్ పిరమిడ్, అంటార్కిటికాలోని విన్సన్, ఉత్తర అమెరికాలోని దెనాలి శిఖరాలను వంటి అతి ఎత్తైన పర్వతాలను అధిరోహించి చరిత్ర సృష్టించిందని మంత్రి సీతక్క కొనియాడారు. మరోవైపు వివిధ సమస్యలపై ప్రజల పక్షాన పోరాడిన తీన్మార్ మల్లన్నను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి పట్టభద్రులు గెలిపించాలని మంత్రి సీతక్క శనివారం ఓ ప్రకటనలో కోరారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై మల్లన్న తనదైన శైలిలో పోరాటం చేశారని తెలిపారు.

డీఎంహెచ్‌వో సస్పెన్షన్

- లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో..



డాక్టర్ లక్ష్మణ్‌సింగ్

కామారెడ్డి టౌన్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహించే మహిళా వైద్యులను లైంగికంగా వేధించారని ఆరోపణలు ఎదుర్కొన్న కామారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ లక్ష్మణ్ సింగ్ పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తూ, రాష్ట్ర ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ రవీందర్‌నాయక్‌లు శనివారం ఉత్తర్వులను జారీ చేశారు. ప్రజారోగ్య కుటుంబ సంక్షేమశాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ అమర్‌సింగ్ నాయక్ ప్రాథమిక విచారణ జరిపి నివేదిక సమర్పించారు. కాగా ఇదివరకే డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్‌పై దేవునిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏడు క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. ఈనెల 15న ఆయన అరెస్టు కాగా.. 16న బెయిల్‌పై విడుదలయ్యారు.

రాష్ట్రంలో పర్యావరణ కమిషన్!

ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తాం

- రాష్ట్రంలో క్లీన్ ఎనర్జీకి పెద్దపీట వేస్తాం
- సౌర, పవన, జల విద్యుత్ ప్రాజెక్టులను వేగంగా చేపడతాం
- హైదరాబాద్‌లో కబ్జాల నుంచి చెరువుల పరిరక్షణ
- క్లీన్ ఎనర్జీపై సదస్సులో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడం కోసం పర్యావరణ కమిషన్ ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో సౌర, పవన, జలవిద్యుత్ వంటి క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులను అత్యంత వేగంతో చేపడతామన్నారు. రాష్ట్రంలో బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ వాడకాన్ని క్రమంగా తగ్గించుకుంటూ పునరుత్పాదక విద్యుత్ వాడకాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తామని తెలిపారు. హైదరాబాద్ నగరం, పరిసర ప్రాంతాల్లో కబ్జాలతో చెరువులు మాయమైపోతున్నాయని, వాటి పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. చెన్నైకి చెందిన సిటీజన్ కన్జ్యూమర్ అండ్ సివిక్ యాక్షన్ గ్రూప్, హైదరాబాద్‌లోని పీపుల్స్ మానిటరింగ్ గ్రూప్ ఆన్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేషన్, హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం పర్యాటక భవన్‌లో 'భారత దేశంలో క్లీన్ ఎనర్జీ పరిణామక్రమం' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. సదస్సులో చర్చించి రూపొందించిన తీర్మానాలను తమకు అందజేస్తే రాష్ట్రంలో అమలుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తామని హామీనిచ్చారు.

సలహాలను ఎప్పుడూ స్వీకరిస్తాం

తమ ప్రభుత్వం అందరికీ అందుబాటులోకి ఉంటుందని, పారదర్శకత పాటిస్తుందని, సలహాలను స్వీకరించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. మంచి వాతావరణం ఉండే నగరంగా పేరున్న హైదరాబాద్‌లో ప్రస్తుతం ఉంటున్న ఉష్ణోగ్రతలు గతంలో ఎన్నడూ లేవన్నారు. కర్బన ఉద్గారాల తగ్గింపునకు ప్రపంచ దేశాలున్న లక్ష్యాలు పెట్టుకున్నా భూతాపం తగ్గడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. తనకు పర్యావరణ పరిరక్షణ అంశంపై ఎంతో ఆసక్తి ఉందని, గతంలో దీనిపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలో సభ్యుడిగా పనిచేశానని ఆయన గుర్తు చేసుకున్నారు.

పాలకుల తీరు వల్లే విద్యుత్ చార్జీల పెంపు: వేణుగోపాల్

ఈ పూటకి నిరంతర విద్యుత్ సరఫరా జరిగితే చాలు.. భవిష్యత్తులో సంబంధం లేదన్న రీతిలో పాలకులు వ్యవహరిస్తున్నారని పీపుల్స్ మానిటరింగ్ గ్రూప్ కన్వీనర్ ఎం.వేణుగోపాల్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీలు అందరికీ అందుబాటులో ఉండాల్సి ఉండగా, ఏటా పెంచక తప్పనిపరిస్థితిని పాలకులు తీసుకొచ్చారని విమర్శించారు. రాష్ట్రంలో అవసరానికి మించి విద్యుత్ లభ్యత ఉన్నా బయటి నుంచి విద్యుత్ కొనుగోలు చేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. శిలాజ ఇంధనాల వినియోగాన్ని పూర్తిగా విరమించుకోకపోతే భూమండలాన్ని రక్షించుకోలేమని ప్రముఖ శాస్త్రవేత్త కె.బాబురావు హెచ్చరించారు. కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్ట్ ఆర్.దిలీప్ రెడ్డి అనుసంధానకర్తగా వ్యవహరించగా, పర్యావరణవేత్తలు ప్రొఫెసర్ కె.పురుషోత్తమ్ రెడ్డి, దొంతి నరసింహారెడ్డి, రిచా మిశ్రా, విష్ణురావు, ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి రవికాంత్ రెడ్డి, మాజీ అధ్యక్షులు ఎస్.విజయ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

పౌరసరఫరాల శాఖలో అతి పెద్ద స్కాం


- సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
- అలా చేయించకుంటే మిల్లర్లతో లాలూచీ పడ్డట్టే
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్



నల్లగొండ టూటౌన్: రాష్ట్రంలోని పౌరసరఫరాల శాఖలో అతిపెద్ద స్కాం జరిగిందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ ఆరోపించారు. శనివారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రైతుల దగ్గర పంట కొని ఎఫ్‌సీఐకి విక్రయిస్తూ మధ్యవర్తిగా ఉన్న పౌర సరఫరాల శాఖకు రూ.10 వేల కోట్ల నష్టం ఎందుకు వస్తోందని ప్రశ్నించారు. కొంత మంది రైస్ మిల్లర్లు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ పెద్దలతో లాలూచి పడి అవినీతికి పాల్పడుతున్నారని విమర్శించారు. గతంలో ఆ శాఖ నుంచి రూ.వేల కోట్లు కేసీఆర్ కుటుంబానికి ముట్టాయని.. ఇప్పుడు కాంగ్రెస్‌కు ముట్టే రూ.వేల కోట్లను ఢిల్లీకి పంపుతున్నారని నిందించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ముంటే సివిల్ సప్లయ్ శాఖలో జరిగిన అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దీనిపై విచారణ జరిపిస్తారనే నమ్మకం ఉందన్న బండి.. అలా విచారణ చేయించకుంటే మిల్లర్లతో లాలూచి పడ్డట్లే అని స్పష్టం చేశారు. కృష్ణా జలాల విషయంలో మాజీ సీఎం కేసీఆర్.. చంద్రబాబుతో కుమ్మక్కై నల్లగొండ జిల్లాకు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. తెలంగాణకు 575 టీఎంసీలు రావాల్సి ఉండగా.. 299 టీఎంసీలకే కేసీఆర్ సంతకం పెట్టారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టే దురాలోచన బీజేపీకి లేదన్న బండి.. కాంగ్రెస్ వారు ప్రభుత్వాన్ని పడగొట్టే అవకాశం ఇతరులకు ఇవ్వరని ఎద్దేవా చేశారు. మతపరమైన రిజర్వేషన్లు బీజేపీ అడ్డుకుంటుందనీ, అలా అడ్డుకోవాలంటే బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు.

నిజ నిర్ధారణ కమిటీ వేయండి

- పౌరసరఫరాల శాఖ అక్రమాలపై నిగ్గు తేల్చండి
- సీఎం రేవంత్ రెడ్డికి బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బహిరంగ లేఖ



సాక్షి, హైదరాబాద్: పౌరసరఫరాల శాఖలో జరుగుతున్న అవినీతి, అక్రమాల ను బహిర్గతం చేసి వాస్తవాలను ప్రజలకు తెలియజేసేందుకు అఖిలపక్ష నిజ నిర్ధారణ కమిటీ వేయాలని, లేదంటే రిటైర్డ్ జడ్జితోనైనా నిజనిర్ధారణ కమిటీ వేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సీఎం రేవంత్‌కు బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో ధాన్యం, సన్న బియ్యం కొనుగోళ్లు, రేషన్ సరుకుల సరఫరాలో అవకతవకలు జరిగాయని తాను ఆధారాలతో సహా బయటపెట్టినా ఆ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మౌనంగా ఉన్నారంటే.. అక్రమాలు జరిగాయని ఒప్పుకున్నట్లేనని పేర్కొన్నారు. అందుకే వాస్తవాలు తేల్చాలని సీఎంకు బహిరంగ లేఖ రాసినట్టు శనివారం బీజేపీ కార్యాలయంలో మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ వెల్లడించారు. పేదలకు పీడీఎస్ ద్వారా పంపిణీకి కేంద్ర ప్రభుత్వం వెచ్చిస్తున్న రూ.వేల కోట్ల నిధులను రాష్ట్ర పౌర సరఫరాల శాఖ దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. ఈ విషయాన్ని సంబంధిత కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్తానని, రూ.వేల కోట్ల కేంద్ర నిధులను దుర్వినియోగం చేసేలా ఈ శాఖలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపించాలని సీబీఐకి కూడా ఫిర్యాదు చేస్తామని చెప్పారు. అలాగే వడ్ల కొనుగోలు లో కేంద్రం వాటా ఉన్న నేపథ్యంలో దీనిపై కూడా సీబీఐ విచారణ కోరుతూ లేఖ రాస్తానని తెలిపారు.

మేమే మంత్రులపై ఎదురు కేసులు పెడతాం

ఆ శాఖలో జరిగిన అవినీతిని బయటపెట్టినందుకు తమపై కేసులు పెట్టడం కాదనీ తామే చట్టపరంగా ప్రభుత్వపెద్దలు, మంత్రులపై కేసులు పెడతామని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. రైస్ మిల్లర్లతో మంత్రి ఉత్తమ్ రహస్య ఒప్పందం చేసుకున్నారని, ధాన్యం కొనుగోలులో రూ.800 కోట్ల దోపిడీ జరిగిందని ఆయన పునరుద్ఘాటించారు. ఈ సందర్భంలోనే మహేశ్వర్‌రెడ్డి.. రాష్ట్రంలో ఆర్, యూ, బీ-ట్యాక్స్ (రేవంత్, ఉత్తమ్, భట్టి) నడుస్తోందని సంచలన ఆరోపణలు చేశారు.

ఇవన్నీ వాస్తవాలా కాదా?

- సీఎంకు రాసిన లేఖలో మహేశ్వర్‌రెడ్డి 19 ప్రశ్నలు సంధించారు. వాటిల్లో కొన్ని..
- వివిధ జిల్లాలో రైస్ మిల్లులు ఆపరేషన్‌లో లేకున్నా.. ఉన్నట్లు చూపించడం వాస్తవం కాదా?
- ఆ బోగస్ మిల్లుల్లో స్టాక్ లేకున్నా.. సీఎంఆర్ ఇవ్వకున్నా.. ఎందుకు చర్యలు తీసుకోలేదు?
- నాలుగైదేళ్లుగా సీఎంఎంఆర్ నిల్వలపై ఆడిట్ జరగని విషయం వాస్తవం కాదా?
- ఆదిలాబాద్, నల్లగొండ, యాదాద్రి, జగిత్యాల తదితర జిల్లాల్లో ఎందరో మిల్లర్ల దగ్గర మీరిచ్చిన స్టాక్ లేకపోయినా... వారిపై చర్యలు తీసుకోకుండా కాపాడటంలో ఆంతర్యమేంటి?
- ఈ విషయంలో రూ.కోట్లు చేతులు మారుతున్న విషయం వాస్తవమా కాదా?
- సరైన టైంకి సీఎంఆర్ ఇవ్వకుండా మోసాలకు పాల్పడిన మిల్లర్లపై ఎన్ని కేసులు పెట్టారు?
- మిల్లర్లు ప్రభుత్వాన్ని మోసం చేస్తూ పాల్పడుతున్న స్కాం విలువ ఎన్ని రూ.వేల కోట్లు?
- ఏప్రిల్ 18న జలసౌధలో ప్రభుత్వం అపాయింట్ చేసిన కాంట్రాక్టర్లతో రూ.వంద స్టాంప్ పేపర్‌పై ఎంవోయూ చేయించి, మిల్లర్లతో బలవంతగా అగ్రిమెంట్ చేయించారా.. లేదా?
- క్వింటాల్ రూ.2007గా ఉన్న బిడ్ ధరకు అదనంగా రూ.216 పెంచి రూ.2,223కు అగ్రిమెంట్ చేయించింది వాస్తవమా కాదా? అంటే 35 లక్షల మెట్రిక్ టన్నులకు రూ.216 చొప్పున రూ.800 కోట్లు అదనంగా వసూళ్ల మాట నిజమా కాదా? ఇవి ఎవరి ఖాతాలోకి వెళ్లాయి?

పెట్టుబడులకు ముందుకు రండి

అమెరికన్ తెలుగు మెగా కన్వెన్షన్‌లో మంత్రి కోమటిరెడ్డి



టీఏటీఏ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్/నల్లగొండ: విదేశాల్లో ఉంటున్న తెలంగాణ ప్రజలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. వాషింగ్టన్ డీసీలోని సియాటెల్‌లో జరుగుతున్న తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (టీఏటీఏ) మెగా కన్వెన్షన్‌కు ముఖ్య అతిథిగా కోమటిరెడ్డి హాజరయ్యారు. కన్వెన్షన్‌ను ప్రారంభించిన అనంతరం ప్రవాస తెలంగాణ ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చేవారికి కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రవాస తెలంగాణ ప్రజల కృషి మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి (జడ్చర్ల), మదన్‌మోహన్ (ఎల్లారెడ్డి), మల్లారెడ్డి (మేడ్చల్)లతో పాటు టీఏటీఏ అధ్యక్షుడు పైళ్ల మల్లారెడ్డి, వంశీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల బదిలీలు పారదర్శకంగా చేపట్టాలి

- మెడికల్ కళాశాలల వైద్యుల డిమాండ్

సుల్తాన్‌బజార్: వచ్చే నెల జూన్‌లో చేపట్టనున్న వైద్యుల సాధారణ బదిలీల ప్రక్రియలో ఎలాంటి ఒత్తిళ్లకు తావు లేకుండా పారదర్శకంగా చేపట్టాలని రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన మెడికల్ కాలేజీల వైద్యులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల మెడికల్ కాలేజీల వైద్యుల బృందం ఇన్‌చార్జి డీఎంఈ డాక్టర్ వాణిని కలిసి వినతి పత్రం సమర్పించింది. అనంతరం డాక్టర్ వి.శేఖర్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ జగతి, డాక్టర్ సాంబశివారెడ్డి, డాక్టర్ ఎం.కవిత మీడియాతో మాట్లాడుతూ.... వైద్యుల సాధారణ బదిలీల ప్రక్రియలో అసోసియేషన్ నేతల పాత్ర లేకుండా, ఎలాంటి ఒత్తిళ్లకు తావు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ఐదేళ్లుగా ఒకే చోట పనిచేస్తున్న వైద్యులకు స్థాన చలనం కల్పించడంతో పాటు గత రెండేళ్లకు మించి ఒకే చోట గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులకు బదిలీల్లో అవకాశం కల్పించాలని కోరారు. బదిలీ కావాల్సిన కొందరు వైద్యులు అసోసియేషన్‌ల ముసుగులో గత పదేళ్లుగా బదిలీ కాకుండా ఒకే చోట పని చేస్తున్నారని, గత ప్రభుత్వం వారిని పట్టించుకోకపోవడంతో వారి ఆగడాలు మితిమీరి పోయాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా.. ఎలాంటి ఒత్తిళ్లకు తావు లేకుండా పారదర్శకంగా బదిలీలు జరిగేలా చూడాలని కోరారు. గత ఆరేళ్లుగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని మెడికల్ కాలేజీల్లో పనిచేస్తున్న వైద్యుల సేవలను గుర్తించి, నగరంలోని ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల్లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కాగా, తమ సమస్యలను ఇంచార్జి డీఎంఈ డాక్టర్ వాణి దృష్టికి తీసుకువెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఇంచార్జి డీఎంఈని కలిసిన వారిలో డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ అజామ్, డాక్టర్ బెంజిమెన్, డాక్టర్ మూసాఖాన్, డాక్టర్ అమరావతి, డాక్టర్ కవిత, డాక్టర్ హేమలత, డాక్టర్ అరుణ, డాక్టర్ శకుంతల ఉన్నారు.

పది రోజులు బ్యాగు లేకుండా బడి!

2024-25 విద్యా సంవత్సరం అకడమిక్ కేలండర్ విడుదల చేసిన పాఠశాల విద్యాశాఖ

నెలకోరోజు పూర్తిగా ఆటపాటలకు కేటాయించాలని సూచన.. పాఠాల బోధన, పరీక్షల షెడ్యూల్ ప్రకటన



సాక్షి, హైదరాబాద్: బడి పిల్లలపై బ్యాగు భారం తగ్గించడం, వారిలో ఉత్సాహం నింపే ప్రయత్నంలో భాగంగా 2024-25 విద్యా సంవత్సరంలో పది రోజుల పాటు బ్యాగు లేకుండా బడి నిర్వహించాలని రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ నిర్ణయించింది. స్కూల్ బ్యాగు లేకుండా వచ్చిన విద్యార్థులకు కేవలం ఆటపాటలు, ఆసక్తి కలిగించే విధంగా అభ్యసన కార్యక్రమాలు నిర్వహించాలని పాఠశాలలకు సూచించింది. ఈ మేరకు విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం 2024-25 విద్యా సంవత్సర కేలండర్‌ను విడుదల చేశారు.

వచ్చే నెల 12న పునః ప్రారంభం

ప్రతి నెలా ఒకరోజు చొప్పున 2024-25 విద్యా సంవత్సరంలో 10 రోజుల పాటు నో బ్యాగ్ డే నిర్వహిస్తారు. ఏ రోజున ఈ నో బ్యాగ్ డే నిర్వహించాలనేది ప్రత్యేకంగా తెలియజేయనున్నట్టు విద్యాశాఖ ఉత్తర్వుల్లో తెలిపింది. 2024-25 విద్యా సంవత్సరంలో 229 రోజులు పాఠశాలల పనిదినాలు ఉంటాయని వెల్లడించింది. జూన్ 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని.. 2025 ఏప్రిల్ 24న చివరి పనిదినంగా ఉంటుందని తెలిపింది. పదో తరగతి విద్యార్థులకు 2025 జనవరి 10వ తేదీ నాటికి పాఠ్యాంశ బోధన పూర్తి చేయాలని.. తర్వాత పునశ్చరణ తరగతులు నిర్వహించాలని సూచించింది. ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు పాఠ్యాంశ బోధన ఫిబ్రవరి 28వ తేదీకల్లా పూర్తి చేయాలని.. ప్రతిరోజు స్కూల్ అసెంబ్లీకి ముందు లేదా తర్వాత యోగా, మెడిటేషన్ నిర్వహించాలని పేర్కొంది. జూన్ 1వ తేదీ నుంచి 11వ తేదీ వరకు బడిబాట, జూన్ రెండో తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవం నిర్వహించాలని ఆదేశించింది. అలాగే ఫార్మెటివ్, సమ్మెటివ్ పరీక్షలు నిర్వహించాల్సిన తేదీలు.. దసరా, సంక్రాంతి సెలవులను కూడా విడుదల చేసింది.



స్కూళ్ల షెడ్యూల్ ..ఇదీ

- ✔ జూన్ 12 నుంచి పాఠశాలల పునఃప్రారంభం
- ✔ 2024-25 విద్యా సంవత్సరంలో 229 పనిదినాలు
- ✔ ఈ ఏడాది అక్టోబర్ 2 నుంచి 14 వరకు దసరా సెలవులు
- ✔ డిసెంబర్ 22 నుంచి 27 వరకు క్రిస్మస్ సెలవులు
- ✔ వచ్చే ఏడాది జనవరి 13 నుంచి 17 వరకు సంక్రాంతి సెలవులు
- ✔ 1 నుంచి 9 తరగతులకు ఫిబ్రవరి 28లోగా బోధన పూర్తి.. తర్వాత రివిజన్
- ✔ పదో తరగతికి జనవరి 10 నాటికి బోధన పూర్తి.. తర్వాత రివిజన్

స్కూళ్లలో పరీక్షల షెడ్యూల్ ..ఇలా

➡ ఎఫ్ఏ-1	31.07.2024 లోపు
➡ ఎఫ్ఏ-2	30.09.2024 లోపు
➡ ఎస్ఏ-1	21.10.2024 నుంచి 28.10.2024 వరకు
➡ ఎఫ్ఏ-3	17.12.2024 లోపు
➡ ఎఫ్ఏ-4	29.01.2025 లోపు (టెన్త్). 28.02.2025 లోపు (1 నుంచి 9వ తరగతి)
➡ ఎస్ఏ-2	09.04.2025 నుంచి 19.04.2025 (1 నుంచి 9వ తరగతి)
➡ ప్రీఫైనల్ (టెన్త్)	28.02.2025 లోపు

రాంచీలో ఓటేసిన గవర్నర్ దంపతులు



సాక్షి, హైదరాబాద్: జార్ఖండ్, తెలంగాణ రాష్ట్రాల గవర్నర్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ దంపతులు శనివారం జార్ఖండ్‌లోని రాంచీలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇతర ఓటర్లతో కలసి క్యూలో నిలబడి ఓటు వేశారు.

ప్రజలు కోర్టుకొస్తేగాని స్పందించరా?

- శేరిలింగంపల్లి అధికారులపై హైకోర్టు ఆగ్రహం
- అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని ఆదేశం




సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మున్సిపాలిటీ కొండాపూర్ సర్వే నంబర్ 78 నుంచి 93 వరకున్న ప్లాట్‌నంబర్ 327లోని 36 గుంటల భూమిలో అనుమతి తీసుకున్నట్లు కాకుండా నిబంధనలకు విరుద్ధంగా సాగిన నిర్మాణంపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని హైకోర్టు అధికారులకు తేల్చిచెప్పింది. ప్రజలు కోర్టులను ఆశ్రయించినప్పుడు మాత్రమే అధికారులు చర్యలు తీసుకుంటారా అని ఆగ్రహం వ్యక్తంచేసింది. 'కొండాపూర్‌లో 36 గుంటల భూమి టైటిల్ లేకుండా, అనుమతి తీసుకోకుండా నిర్మాణం చేపట్టారు. జి.వెంగళ్రావ్, జి.నీలిమ, విజేత సూపర్ మార్కెట్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్నా.. మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోలేదు. దీనిపై ఫిబ్రవరి 28న వినతిపత్రం సమర్పించినా స్పందన లేదు. ఇది తెలంగాణ మున్సిపాలిటీస్ యాక్ట్ 2019, టీఎస్-బీపాస్ యాక్ట్ 2020 నిబంధనలను ఉల్లంఘించడమే. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాన్ని వెంటనే కూల్చివేసేలా మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేయాలి'అని కొండాపూర్‌కు చెందిన చింతల కుమార్ యాదవ్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ టి.వినోద్‌కుమార్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది మయూర్‌రెడ్డి, ప్రభుత్వం తరఫున జీపీ, అనధికారిక ప్రతివాదుల తరఫున ఉన్నం మురళీధర్‌రావు వాదనలు వినిపించారు. 'మార్చి 22న అనధికారిక ప్రతివాదులకు నోటీసులు జారీ చేశాం. సమాధానం రాలేదు. ఆ నిర్మాణాన్ని కూల్చివేయాలని ఏప్రిల్ 10న అధికారులు నేరుగా ఆదేశాలు జారీ చేశారు.. లేకుంటే జీహెచ్‌ఎంసీ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు'అని స్టాండింగ్ కౌన్సిల్ వివరించారు.

'కూల్ రూఫ్' కనిపించదేం?

రాష్ట్రంలో కూల్ రూఫ్ పాలసీకి ఆదరణ కరువు

- దేశంలోనే తొలిసారిగా ఈ విధానాన్ని తీసుకొచ్చిన తొలి రాష్ట్రం తెలంగాణ
- 2028 నాటికి 300 చ.కి.మీ. కూల్ రూఫ్ ఏరియా లక్ష్యం
- పాలసీ అమల్లోకి వచ్చి ఏడాదైనా ఆచరణలో శూన్యం
- ప్రజల్లో అవగాహన లేకపోవడమే కారణం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కూల్ రూఫ్ పాలసీకి ఆదరణ కరువైంది. ఈ విధానం అమల్లోకి వచ్చి ఏడాదైనా స్పందన అంతంతమాత్రంగానే ఉంది. పట్టణ ప్రాంతంలో ఉష్ణోగ్రతలను తగ్గించాలనే లక్ష్యంతో గతేడాది ఏప్రిల్ 1న అప్పటి ప్రభుత్వం కూల్ రూఫ్ పాలసీని తీసుకొచ్చింది. దేశంలోనే తొలిసారిగా ఈ విధానాన్ని అమల్లోకి తెచ్చిన తొలి రాష్ట్రంగా రికార్డు సృష్టించింది. 2024 నాటికి రాష్ట్రంలో 30 చదరపు కిలోమీటర్ల మేర కూల్ రూఫ్ ఏరియాను చేరుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు నగరంలో నిర్మాణంలో ఉన్న సుమారు 20 కంటే తక్కువ ప్రాజెక్టులు మాత్రమే ఈ పాలసీని అవలంబిస్తున్నాయి.

ఏ భవనాలకు వర్తిస్తుందంటే..

భవనంలో ఆహ్లాదకరమైన వాతావరణంతోపాటు చల్లదనం కోసం కూల్ రూఫ్ ఏర్పాట్లు చేసుకోవాలి. ఇంటి పైకప్పు మీద సూర్యరశ్మిని తక్కువగా గ్రహించే విధంగా లేత రంగులు, రిఫ్లెక్టివ్ టైల్స్, గోడల నిర్మాణంలో మట్టి ఇటుకల వాడకం చేపట్టాలి. 600 చదరపు గజాల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, వాణిజ్య, నివాస భవనాలకు ఈ పాలసీని తప్పనిసరిగా అమలు చేయాలి. నిబంధనలు పాటించని భవన నిర్మాణాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) జారీ చేయరు.

అవగాహన లేమే కారణం..

తమిళనాడులో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కూల్ రూఫ్ పాలసీని అమలవుతుండగా రాష్ట్రంలో మాత్రం పట్టించుకునే నాథుడే లేడు. స్థానిక, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో అక్కడి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తుండటంతో ప్రజలు కూ డా తమ ఇళ్లలో ఈ విధానాన్ని అమలు చేసేందుకు ముందుకొస్తున్నారు. మన దగ్గర ఈ పాలసీపై అవగాహన కరువైందని ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ) నేషనల్ వైస్ చైర్మన్ సి. శేఖర్‌రెడ్డి అన్నారు.

అధిక ధరలతోనూ ప్రజల్లో అనాసక్తి..

కూల్ రూఫ్ ఉత్పత్తుల ధరలు, నిర్వహణ వినియోగదారులకు భారంగా ఉంది. ఒక రూఫ్ టైల్ ధర లేబర్, ఇన్‌స్టలేషన్ కలిపి రూ. 120-150 వరకు ఉంటోంది. రిఫ్లెక్టివ్ పెయింట్స్ 4 లీటర్ల డబ్బా రూ. 2,500 నుంచి మొదలవుతోంది. దీనివల్ల ప్రజలు వీటిని అమర్చుకోవడంపై పెద్దగా ఆసక్తి చూపించడంలేదు.

ప్రయోజనాలివీ..

- సాధారణ ఇళ్లతో పోలిస్తే భవనం పైకప్పు మీద కూల్ రూఫ్ అమర్చిన ఇళ్లలో 2 నుంచి 4 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయి.
- భవనం వేడిని నిరోధించే ఫ్లయాష్ ఇటుకలు, పైరెక్స్ అద్దాలు, బయో వాల్స్, టెర్రస్ ఫార్మింగ్, వర్టికల్ గార్డెనింగ్, ఒపల్ గ్లాస్, కిటికీల కోసం సన్‌షీల్డ్ గ్లాస్ వంటి ఉత్పత్తుల వినియోగంతో ఇంట్లో ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుతాయి.
- ఇంట్లో ఏసీ, ఫ్యాన్ వంటి విద్యుత్ ఉపకరణాల వినియోగం తగ్గుతుంది. సుమారు 20 శాతం కరెంట్ బిల్లు ఆదా అవుతుంది.
- సాధారణ ఇంటి పైకప్పుతో పోలిస్తే కూల్ రూఫ్‌ను ఏర్పాటు చేసుకున్న ఇంటి పైకప్పు ఎక్కువ సూర్యరశ్మిని ప్రతిబింబిస్తుంది. దీంతో భవనం నుంచి వేడి, కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయి.
- ఈ పాలసీ అమలుతో రాష్ట్రంలో ఏడాదికి 12 కోట్ల యూనిట్ల విద్యుత్‌ను ఆదా చేయవచ్చు.

ఛాతీలోకి బాణం.. నిమ్స్ ప్రాణదానం!

ఛత్తీస్‌గఢ్‌లో గొత్తి కోయ ఆదివాసీకి అనూహ్య ప్రమాదం

- అడవి పందిని వేటాడే క్రమంలో వేరొకరు వదిలిన బాణం ఛాతీలోకి..
- తొలుత భద్రాచలం ఏరియా ఆస్పత్రి, ఆపై వరంగల్ ఎంజీఎం, అక్కడి నుంచి గాంధీకి తరలింపు
- చివరకు నిమ్స్‌లో విజయవంతంగా శస్త్రచికిత్స.. కోలుకుంటున్న బాధితుడు





గిరిజన యువకుడికి గుచ్చుకున్న బాణం (ఇన్‌సెట్‌లో) ఎక్స్‌రే, బయటికి తీసిన బాణం

లక్డీకాపూల్: ప్రాణాపాయంతో కొట్టుమిట్టాడుతున్న ఓ ఆదివాసీ యువకుడికి హైదరాబాద్‌లోని నిజామ్స్ వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్) వైద్యులు పునర్జన్మ ప్రసాదించారు. జంతువులను వేటాడే క్రమంలో ప్రమాదవశాత్తూ ఛాతీని చీల్చుకుంటూ గుండె సమీపానికి దూసుకెళ్లిన బాణాన్ని విజయవంతంగా శస్త్రచికిత్స చేసి తొలగించి ప్రాణదానం చేశారు.

అడవిలో వేటకు వెళ్లి..

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ఉసూర్ ప్రాంతంలో నివసించే గొత్తి కోయ తెగకు చెందిన సోది నంద (17) వారం క్రితం మరొకరితో కలసి అడవిలో వేటకు వెళ్లాడు. ఓ అడవి పందిని వేటాడే క్రమంలో తోటి ఆదివాసి యువకుడు వదిలిన బాణం గురితప్పి నంద ఊపిరితిత్తుల్లోకి చొచ్చుకుపోయింది. గుండె సమీపానికి చేరుకుంది. దీంతో అతన్ని కుటుంబ సభ్యులు భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు రిఫర్ చేశారు. అయితే అక్కడ కూడా చికిత్స సాధ్యం కాకపోవడంతో అక్కడి వైద్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి సిఫారసు చేశారు. అప్పటికే మూడు రోజులుగా నరకం అనుభవిస్తున్న నంద ఆరోగ్య పరిస్థితి విషమిస్తుండటం.. ప్రాణాపాయ స్థితిలోకి చేరుకోవడంతో సత్వర వైద్యం కోసం గాంధీ ఆస్పత్రి వైద్యులు అతన్ని నిమ్స్‌కు రిఫర్ చేశారు. దీంతో శుక్రవారం సాయంత్రం నిమ్స్ ఎమర్జెన్సీ వార్డుకు తీసుకొచ్చారు. అయితే అతను ఛత్తీస్‌గఢ్ వాసి కావడం వల్ల ఆరోగ్యశ్రీ పథకం వర్తించకపోవడం, శస్త్రచికిత్సకు అయ్యే ఖర్చును భరించే ఆర్థిక స్తోమత లేకపోవడంతో నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ప్రత్యేక కేసుగా పరిగణించిన ప్రభుత్వం ఉచితంగా శస్త్రచికిత్స నిర్వహించేందుకు అనుమతిచ్చింది.

నాలుగు గంటలు శ్రమించి..

కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న రోగిని కాపాడేందుకు నిమ్స్ కార్డియోథొరాసిక్ విభాగాధిపతి డాక్టర్ అమరేశ్వరరావు, సర్జన్ డాక్టర్ గోపాల్‌తో కూడిన వైద్య బృందం అతనికి అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్స నిర్వహించింది. నాలుగు గంటలపాటు శ్రమించి శరీరం నుంచి బాణాన్ని పూర్తిగా తొలగించింది. ప్రస్తుతం ఆ యువకుడికి ప్రాణాపాయం తప్పిందని వైద్యులు వెల్లడించారు. అయితే అతని వద్ద ప్రస్తుతం సహాయకులు ఎవరూ లేరని.. దీంతో నిమ్స్ సిబ్బందే రోగి అవసరాలను చూస్తున్నారని డాక్టర్ అమరేశ్వరరావు తెలిపారు.

యూఏఈ కొత్త షరతు

- విదేశీయులు ఏర్పాటు చేసే కంపెనీల్లో తమ దేశ పౌరులకు ఉద్యోగాలు కచ్చితంగా ఇవ్వాలనే నిబంధన
- జూన్ నెలాఖరులోగా ఈ నిబంధన అమలులోకి తీసుకురావాలని ఆదేశం



మోర్తాడ్(బాల్కొండ): విదేశీ వలస కార్మికులకు ఎన్నో రకాల ఉపాధి అవకాశాలను కల్పించిన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) తమదేశ పౌరుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవడానికి కొత్త షరతు విధించింది. తమ దేశంలో కంపెనీలను ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేస్తున్న విదేశీయులు యూఏఈ పౌరులకు ఉద్యోగ అవకాశాలను అందించాలనే నిబంధనను అమలులోకి తీసుకొచ్చింది. విదేశాలకు చెందిన 50 మంది కార్మికులు ఉంటే తమ దేశ పౌరుడు ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని యూఏ ఈ ప్రభుత్వం ఆదేశించింది. ఈ కొత్త నిబంధనను జూన్ నెలాఖరులోగా అమలులోకి తీసుకురావాలని నిర్ణయం తీసుకుంది. విదేశీ వలస కార్మికులకు వేతనం ఎంత ఇస్తున్నా తమకు సంబంధం లేదని, తమ పౌరునికి మాత్రం 3 వేల ధరమ్స్ మన కరెన్సీలో రూ.60 వేల వరకు జీతం ఇవ్వాల్సిందే అని తీర్మానించింది. యూఏఈ పరిధిలోని దుబాయ్, షార్జా, అబు దాబీ తదితర ప్రాంతాల్లో తెలంగాణ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన వారు దాదాపు 500 కంపెనీలను నిర్వహిస్తున్నారు. ప్రధానంగా మ్యాన్ పవర్ సప్‌లెయింగ్ కంపెనీలు ఉన్నాయి. వీటితోపాటు సొంతంగా కన్‌స్ట్రక్షన్ కంపెనీలు, వ్యాపార సంస్థలను నిర్వహిస్తున్నవారు ఉన్నారు. విదేశీ వలస కార్మికుల సంఖ్యను పరిగణనలోకి తీసుకొని యూఏఈ పౌరులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే రానురాను ఎక్కువ ఉద్యోగాలు అక్కడి వారికే ఇవ్వాల్సి ఉంటుందని దుబాయ్‌లోని తెలుగువ్యాపారి ఎస్‌వీ రెడ్డి వెల్లడించారు. ఒమాన్, కువైట్ దేశాల తరహాలో యూఏఈ తమ దేశ పౌరుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తుందని ఇందులో భాగంగానే కొత్త నిబంధన అమలులోకి తెచ్చిందన్నారు.

విశ్వనగరంగా హైదరాబాద్ అభివృద్ధి

- పెట్టుబడిదారులకు ప్రపంచ గమ్యస్థానంగా మారుస్తాం
- టైమ్స్ వెస్ట్ హైదరాబాద్ ఎక్స్‌పోలో మంత్రి ఉత్తమ్



టైమ్స్ వెస్ట్ హైదరాబాద్ ఎక్స్‌పో-2024ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మంత్రి ఉత్తమ్

మియాపూర్: అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలతో హైదరాబాద్ విశ్వనగరంగా అభివృద్ధి చెందుతోందని రాష్ట్ర నీటిపారుదల, ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. నగరాన్ని అన్ని రంగాల్లో శరవేగంగా వృద్ధి చేస్తూ పెట్టుబడిదారులకు ప్రపంచ గమ్యస్థానంగా మారుస్తామని తెలిపారు. మియాపూర్‌లో ఏర్పాటు చేసిన టైమ్స్ వెస్ట్ హైదరాబాద్ ఎక్స్‌పో -2024ను టైమ్స్ ఆఫ్ ఇండియా ఆంధ్ర, తెలంగాణ రెస్పాన్స్ హెడ్ కమల్ కృష్ణన్‌తో కలిసి శనివారం మంత్రి ఉత్తమ్ ప్రారంభించారు. ఈ ప్రాపర్టీ ఎక్స్‌పోలో రియల్ ఎస్టేట్ డెవలపర్‌లు, ఏజెంట్లు దాదాపు 50కిపైగా తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ, భవన నిర్మాణ రంగంలోని డెవలపర్లకు, ప్రభుత్వం అన్ని విధాల సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. నగరాన్ని మేటిగా నిలపడంలో భాగంగా గ్రీన్ హైదరాబాద్, కాలుష్య రహిత హైదరాబాద్, గ్రీన్ బిల్డింగ్‌లను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడి దారులను నిరంతరం ఆకర్షిస్తున్నామని, ఇందులో భాగంగా హైదరాబాద్‌ను అత్యుత్తమ ప్రపంచ నగరాలతో పోటీ పడేలా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. కాగా, ఈ ఎక్స్‌పో ఆదివారం కూడా కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

90% ఓఆర్ దాటినా రోజూ రూ. 3 కోట్ల ఆదాయ లోటు!

తెలంగాణ ఆర్టీసీలో విచిత్ర పరిస్థితి

- అంచనాలకు మించి ఆక్యుపెన్సీ రేషియో నమోదవుతున్నా చేతికందని ఆదాయం
- సిబ్బంది వేతనాలు చెల్లించేందుకూ నానాతిప్పలు

సాక్షి, హైదరాబాద్: 'ఆర్టీసీ బస్సుల్లో 74 శాతం ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) నమోదైతే సంస్థ లాభనష్టాలు లేని (బ్రేక్ ఈవెన్) స్థాయికి చేరుకుంటుంది.' ఇదీ దాదాపు ఆరు నెలల క్రితం తెలంగాణ ఆర్టీసీ అధికారులు వేసిన అంచనా. కానీ వారి అంచనా సగమే నిజమైంది. ప్రస్తుతం బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో 90 శాతానికి మించి నమోదవుతున్నా గత నెల సిబ్బందికి జీతాలిచ్చేందుకు ఆర్టీసీ విలవిల్లాడింది. 2, 3 తేదీల్లో కొందరికి ఇచ్చి మిగతా వారికి 7వ తేదీన గానీ సర్దుబాటు చేయలేకపోయింది. ఇందుకోసం బయటి నుంచి కొన్ని నిధులు సమకూర్చుకుందని సమాచారం. మరి భారీ లాభాలు వచ్చే స్థాయిలో ఆక్యుపెన్సీ రేషియో నమోదవుతున్నా జీతాలకు ఆర్టీసీ ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఎందుకు వస్తోంది?

మోయలేని భారంగా మహిళలకు ఉచిత ప్రయాణ పథకం..

మహిళలకు ఉచిత ప్రయాణ పథకం అమల్లోకి వచ్చాక ఆర్టీసీ బస్సుల్లో రద్దీ విపరీతంగా పెరిగింది. నిత్యం 45 లక్షల మందికిపైగా ప్రయాణికుల్లో బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. సోమవారాల లాంటి రద్దీ అధికంగా ఉండే రోజుల్లో ఆ సంఖ్య 55 లక్షలను మించుతోంది. ఇవన్నీ సాధారణ టికెట్లు, జీరో టికెట్లు పొందిన ప్రయాణికుల ప్రకారం లెక్క. వారికి బస్‌పాస్ ప్రయాణికులు అదనం. వారిని కూడా చేరిస్తే ఆ సంఖ్య 60 లక్షలు దాటుతోంది. ఈ పథకం మొదలవక ముందు రోజువారీ టికెట్ ఆదాయం రూ. 16 కోట్ల వరకు నమోదయ్యేది. కానీ మహిళల ఉచిత ప్రయాణంతో అది కాస్తా రూ. 11 కోట్లకు తగ్గిపోయింది. ఉచితంగా ప్రయాణించిన మహిళల తాలూకు జీరో టికెట్ల ఆదాయం (ప్రభుత్వం ఆర్టీసీకి రీయింబర్స్ చేయాల్సినది) కలిపితే ఆ మొత్తం సగటున రూ. 21 కోట్లు ఉంటోంది. అంటే రోజూ రూ. 10 కోట్లకుపైగా జీరో టికెట్ల మొత్తం నమోదవుతోంది. నెలకు కనిష్టంగా రూ. 300 కోట్ల మేర ఉంటోంది. ఈ మొత్తాన్ని ప్రభుత్వం నెలనెలా ఠంచన్‌గా ఆర్టీసీకి అందించాల్సి ఉంది. కానీ ఇక్కడే సమస్య ఏర్పడుతోంది. ప్రభుత్వం నుంచి అడపాదడపా తప్ప ఆ ఆదాయం క్రమం తప్పకుండా అందట్లేదు.



అటు డీజిల్‌కు, ఇటు జీతాలకు ఎలా?

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రతినెలా సుమారు రూ. 225 కోట్లను జీతాల కింద యాజమాన్యం చెల్లిస్తోంది. అంటే సగటున రోజుకు రూ. 7.5 కోట్లు అవుతుంది. సంస్థకు ఆ తర్వాతి పెద్ద పద్దు డీజిల్ ఖాతానే. ఆర్టీసీ బస్సుల కోసం నిత్యం రూ. 6.5 కోట్ల మేర డీజిల్ ఖర్చు నమోదవుతుంది. రోజువారీ టికెట్ ఆదాయం రూ. 11 కోట్లను పరిగణనలోకి తీసుకుంటే నిత్యం రూ. 3 కోట్ల లోటు ఉంటోంది. ప్రభుత్వం జీరో టికెట్ల మొత్తాన్ని రీయింబర్స్ చేస్తేనే ఈ రెండు పద్దుల ఖర్చు నుంచి ఆర్టీసీ గట్టెక్కుతుంది.

భారీగా బకాయిలు..

ఆర్టీసీకి రూ. 1,400 కోట్ల వరకు సమకూర్చినట్లు కొద్దిరోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కానీ గతేడాది బడ్జెట్‌లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆర్టీసీకి కేటాయించిన రూ. 1,500 కోట్లలో రూ. వెయ్యి కోట్లు బకాయి ఉండిపోయింది. ఆ సొమ్ముతోపాటు ఏప్రిల్ నాటికి మహాలక్ష్మి పథకానికి సంబంధించిన రీయింబర్స్‌మెంట్ నిధులు రూ. 1,200 కోట్లు కలిపి మొత్తం రూ. 2,200 కోట్లను ఆర్టీసీకి ప్రభుత్వం ఇవ్వాలి. మరోవైపు 2015 వేతన సవరణకు సంబంధించిన బాండ్ బకాయిలు కొందరికే అందాయి. గతేడాది బడ్జెట్ బకాయిలు, ఇప్పటివరకు ఇవాల్సిన జీరో టికెట్ రీయింబర్స్‌మెంట్ కలిపి ఆర్టీసీకి రావాల్సిన ఇతర బకాయిలు కూడా విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.

రేపు బెంగళూరు రండి

రేవ్ పార్టీపై ఇక విచారణ పర్వం

- 27న విచారణకు రావాలని నటి హేమ సహా పలువురికి నోటీసులు

యశవంతపుర: బెంగళూరు శివార్లలోని హెబ్బగోడిలో వారం కిందట జరిగిన రేవ్ పార్టీపై పోలీసులు దాడి చేసి నిర్వాహకులను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఆ పార్టీలో పాల్గొన్నవారి నుంచి సేకరించిన రక్త నమూనాలను ల్యాబ్‌లో పరీక్షించగా 86 మంది డ్రగ్స్ సేవించినట్లు ఫలితాలు వచ్చాయి. వారిలో పలువురు తెలుగు, కన్నడ సినీ నటీనటులు కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో తెలుగు నటి హేమతో పాటు 8 మందికి బెంగళూరు సీసీబీ పోలీసులు నోటీసులు జారీచేసి మే 27న కేసు విచారణకు హాజరు కావాలని తెలిపారు. ఈ నెల 18న వాసు అనే వ్యక్తి పుట్టిన రోజు పేరుతో సన్ సెట్ టు సన్‌రైజ్ విక్టరి పేరిట రేవ్ పార్టీని నిర్వహించారు. 100 మందికి పైగా పాల్గొన్నారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు దాడి చేయగా, ఎండీఎంఎం మాత్రలు, కొకైన్, హైడ్రో గంజాయిని కనుగొన్నారు. నటులతో పాటు కొందరు ఐటీ ఇంజినీర్లు పాల్గొన్నట్లు తేలింది.

ఐదుగురి బ్యాంకు ఖాతాలు సీజ్!

రేవ్ పార్టీని ఏర్పాటు చేసిన వాసు, వైఎం అరుణ్‌కుమార్, నాగబాబు, రణధీర్‌బాబు, మహ్మద్ అబూబకర్‌లను అరెస్ట్ చేశారు. తాను హైదరాబాద్‌లో ఉన్నానని, పార్టీలో లేనని హేమ పలు వీడియోల ద్వారా బుకాయించినా పోలీసులు అన్ని ఆధారాలు చూపించి విచారణకు రావాలని ఆదేశించారు. పోలీసులు అరెస్ట్ చేసిన పై ఐదు మంది బ్యాంక్ ఖాతాలను సీజ్ చేయాలని నిర్ణయించారు. వీరు ఇలాంటి రేవ్ పార్టీలను ఇంకా ఎక్కడెక్కడ నిర్వహించారనే వివరాలను ఆరా తీస్తున్నారు. మత్తు పదార్థాలను ఎక్కడ నుంచి సరఫరా చేస్తున్నదీ విచారిస్తున్నారు. ఐదు మంది మొబైల్ ఫోన్లలోని డేటాను సేకరించే పనిలో ఉన్నారు. సోమవారం విచారణకు రావాలని ఫాం హౌస్ యజమానికి నోటీసులు పంపారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.